Draupadi Parinayam.

AN ORIGINAL DRAMA
IN FIVE ACTS.

Adapted from the well
known Maha Bharatam.

AUTHOR

Dronamraju Sitha Rama Rao,

COCANADA.

PUBLISHERS:

KARRA ATCHAYYA & SONS,
BOOK-SELLERS,
RAJAHMUNDRY.

FIRST EDITION, 1,000 COPIES.

SCAPE & COMPANY,
HIGH CLASS PRINTERS, RUBBER STAMP MAKERS,
BOOK-BINDERS & DIE-SINKERS, ETC.,
COCANADA.

1916.

 [Price 0—12—0.

ద్రౌపదీపరిణయము.

భారతమున నున్న కథ ననుసరించి వ్రాయఁబడిన
యైదంకముల నాటకము.

అభినవరాఘవ, యుషాపరిణయాద్యనేక గ్రంథకర్త యగు
శ్రీయుత దో॥ సీతారామారావుగారిచే
రచింపఁబడి

రాజమండ్రి బుక్కుసెల్లర్సు
కర్రా అచ్చయ్య అండ్ సన్సు వారిచేఁ
బ్రచురింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

కాకినాడ.
స్కేప్ అండు కో., ముద్రాక్షరశాల న్ముద్రితము.

 రు 0—12—0.

ఇందు వచ్చు పాత్రలు.

ధృతరాష్ట్రుడు—హస్తినాపురాధీశ్వరుఁడు.
భీష్ముఁడు—ధృతరాష్ట్రుని పెద తండ్రి.
విదురుడు—కౌరవపక్షమున నున్నవాఁడు.
దుర్యోధనుఁడు—ధృతరాష్ట్రుని యగ్రసుతుఁడు.
దుశ్శాసనుఁడు— ,, ద్వితీయ సుతుఁడు.
కర్ణుఁడు—దుర్యోధనుని సఖుఁడు.
పురోచనుఁడు—లక్కయిల్లు నిర్మించినవాఁడు.
ధర్మ, భీమార్జున, నకుల, సహదేవులు:—పాండవులు.
కణికుఁడు—పాండవులవార్త ధృతరాష్ట్రునకు వినిపించినవాఁడు.
వ్యాసుడు—ముని.
బకాసురుఁడు—దైత్యుఁడు.
జాబాలి } ఏకచక్రపురమున నున్న బ్రాహ్మణుఁడు
సువిందుఁడు } కుమారుఁడు.
అంగారపర్ణుఁడు—గంధర్వుఁడు.
ద్రుపదుఁడు—పాంచాలాధిపుఁడు.
ధృష్టద్యుమ్నుఁడు—,, కుమారుఁడు.
విష్ణుశర్మ, రామశాస్త్రి:—భూసురులు.
బలరాముడు, కృష్ణుఁడు:—యాదవ పుంగవులు.

స్త్రీలు.

కుంతి—పాండవుల తల్లి.
హిడింబి—భీముని వరించిన దైత్యకాంత.
కుంభీనస—అంగారపర్ణుని భార్య.
ద్రౌపది—ద్రుపదుని పుత్రిక.
నర్మద—చెలికత్తె.

(ఇంకను నాయా సందర్భమున పౌరులు సేవకులును మొదలగు వారు వచ్చెదరు.)

శ్రీ

ద్రౌపదీపరిణయము.

నాంది.

మ॥ తలమీఁదన్ బడనున్న కత్తియయినన్ ♦ దప్పించెదయుంబాంచి మె
వ్వఁడుగన్గొన్న; దవాగ్నిలోఁబడియు స♦ హర్షాత్ములై యుందు రు
జ్జ్వలతేజంబునమించి; సజ్జనములె ♦ వ్వాడింత కాపాడ ని
శ్చలకారుణ్యముయుండు శ్రీశుఁడతఁడే ♦ సభ్యాళి రక్షించుతన్.

సీ॥ అధికసంతాప మ ♦ హాబ్ధిలోపలమున్గి
దిక్కుగానకను చిం ♦ తించువేళ
నడుకానలోఁజిక్కి ♦ బెడిదంపుటిరుముల
సందును మిక్కిలి ♦ కుందునాఁడు
ద్వారికడ్డంబుగా ♦ ధైర్వముని రిపుండు
చనుదెంచి యెదిరించు ♦ సమయమందు
కౌర్మ్రేశులెల్లరు ♦ సల్పఁబాలని పనిఁ
జేయుఁగా మిగుల య ♦ త్నించునపుడు

తే॥ గీ॥ పాండురాజనందనుల వ్రా ♦ త్పద్మములను
నిల్చి; కృపవెదఁజల్లుచు ♦ నిఖిల మంగ
ళంబులన్నియుఁగూర్చి వెలసిన ♦ యంబుజాక్షుఁ
డిచ్చుగాతమీకు శుభంబు ♦ లెప్పుడుదయను.

[నాంద్యంతమున సూత్రధారుడు—ప్రవేశించి]

అతివి స్తరమెందుకు? పూజ్యులగు నీ సభాస్తారు లాలస్యమునకు దూరీజాలనివారు కదా. ఇంక నేను తొందరపడవలయును. (తెరవంకఁ జూచి) కుంకుమతిలకాంచితభ్రుకుటీ! నటీ! నీ యలంకారమింకను కాలేదా! ఎల్లప్పుడును నగలు శృంగారించుకొనుటయేనా! కాల హరణము సేయక రమ్ము.

నటి—(ప్రవేశించి) ఆర్యా! కాలహరణము చేసినందులకు క్షమింపుఁడు.
కమ్మలజతయందొకటి నీల జారి పడిపోవుటచేత దానిని వెదకు చుంటిని. ఇప్పటికిఁగనబడినది.

సూత్ర—నీ కెప్పుడును భూషణంబులమీదనే భ్రాంతి. అందుకనియే యవి తెలుసు పోవుచుండును. స్త్రీకి యివి యన్నియు భూష ణములు కావు సుమా. గుణమే భూషణము.

నటి—నాథా! మీరు ద్వాపరయుగమునాటి మాటలు చెప్పుచున్నా రు. ఇక్కాలమున నది యంతయు నాలోచించువారెవరు! అది తప్ప మనవాళ్ళ దగ్గర తక్కినవన్నియు నున్నవి.

సీ॥ పతిసేవవిడనాడి ♦ స్వైరిణీవృత్తినిఁ
జరియించుచానలు ♦ చాలగలరు
బొట్టు మోటంచును ♦ బొట్టుపెట్టుటమాను
భామామణుల్ గదుఁ ♦ బ్రబలియుండ్రి
మగవారిరీతిగా ♦ బిగువైనచొక్కాలు
ధరియించు పడతులు ♦ దనరినారు
మానాభిమానముల్ ♦ మంటిలోపలగల్పి
తిరిగెడుయువిదలు ♦ పరలినారు
తే॥ గీ॥ ఎక్కడో మూలనున్నట్టి ♦ యింతులెల్ల
వృద్ధులయ్యును మేలైన ♦ వేసములను

దాల్చుచుండిరి సిగ్గును ♦ దలఁగఁద్రోచి
కట్టా! కలికాలమీరీతిఁ ♦ గ్రాలుచుండె.

సూత్రి—రమణీమణీ! జగంబుననున్న స్త్రీ బృందంబంతయు నట్టిదే యని యభిప్రాయపడుచుంటివా? అట్లున్నటికిని జెప్పకుము. పైకిఁ బతివ్రతలమని చెప్పకొనెడి కాంతలకాగ్రహము గలిగించిన దానవగుదువు.

నటి—స్త్రీ బృందంబు నంతయు దూషించుటకంత వెఱ్ఱిదాననుగాను. మంచివారు లేరనికాదు నా యభిప్రాయము. ఎవరో నూటి కొకరు లేకపోరు. అట్టి పూతచరిత్రలింకను నెక్కడనో యుంట చేతనే జగంబీతీరుగనైన నున్నది.

సూత్ర—అయినను నొకరిని దూషించుటకు మన కేమి యవసరమున్నది.

తే॥ గీ॥ అవనిలోపల నెవరు తా ♦ మాచరించి
నట్టి పాపంబు వారలే ♦ యనుభవింతు
రదియు గాకను భగవంతుఁ ♦ డఖిల జనుల
చిత్తములయందు నుండి వీ ♦ క్షింపుచుండు.

కాని యొక్కందుకు మాత్రము నాకు సందియమగుచున్నది. "ఆరు మాసములు సహవాసము చేసినచో వారు వీరగుదురు" అని యొకయార్యోక్తి యున్నది. ఆ కారణంబున నీకు గూడ వారి గుణంబు లలవడునేమోయని భయపడుచున్నాను.

నటి—నాథా! ఇట్టిగుణము లొకరిఁజూచి నేర్చుకొనినచో రావు. వారి పురాకృత ప్రారబ్ధవశమున వచ్చును. చాలుఁ జాలు మీ సందేహమున కేమిలెండి.

సూత్ర—యువతీ! ఏదో యప్రస్తుత ప్రశంస కలుగఁజేసికొని ప్రస్తుత కార్యము మఱచితిమి.

నటి—ఇప్పుడు నన్నుఁ బిలిచిన కార్యమేమో సెలవిచ్చెదరా!

సూత్ర—

చ॥ సరసులు నీతికోవిదులు • శాస్త్రవిచారులు పండితుల్ ధరా
వరులును మంత్రివర్గమును • భాసురలీలను వచ్చి ద్రౌపదీ
పరిణయనామ నాటకము • భవ్యముదంబున నాడుమంచు సం
బరముననాజ్ఞ నిచ్చి రతివా • నినుఁ బిల్చితి నిప్పుడందుకై.

నటి—ఏమి నాటకము! ద్రౌపదీ పరిణయమా! ఇందులోనే కాబోలు రుక్మాంగదుఁడు సీత అనవాళ్లు, సత్యభామ సరసము వుంటుంది.

సూత్ర—(నవ్వుచు) ప్రేయసీ! నీ వెంత మూఢురాలవు. ద్రౌపదీ వివాహ కథయందు నవి యున్నియు నెట్లు వచ్చును. చూచి తివా! విద్యాబుద్ధులు లేకపోవుటచేత వచ్చిన యనర్థకము.

నటి—విద్యావద్దు ఏమీవద్దు. ఈలాగున బ్రతుకనిండు. విద్య నేర్చి గంతులువైచుచున్న ఆడవాళ్లకు వచ్చిన యెక్కువ మర్యాద యేమున్నది. విద్యలేని నాకేమి తక్కువయున్నది. (ఇంచుక యూరకుండి) మనోహరా! ఇప్పుడు జ్ఞప్తికి వచ్చినది. అర్జునుఁడు మత్స్యయంత్రమునుగొట్టి ద్రౌపదిని బెండ్లియాడిన కథ యిదియేకదా. సరే తెలిసినది. ఇది యే పురాణములోనో యుండవలెను. బాగా జ్ఞాపకములేదు.

సూత్ర—

తే॥ గీ॥ ధరణిఁ బంచమ వేదమై • తనరునట్లు
బాదరాయణుఁడు రచించె • భారతంబు
నమర భాషయందున; నన్న • యాదికవులు
తెలుఁగుఁ జేసిరి దానినిఁ • గలువకంటి.

ఆ భారతంబున నీ ద్రౌపదీపరిణయకథ యున్నది. దాని ననుసరించి యియ్యది నాటకముగా వ్రాయఁబడినది.

నటి—గ్రంథకర్త యెవ్వరో యడుగవచ్చునా !

సూత్ర—

తే॥ గీ॥ అతఁడు ద్రోణమరాజ వం ♦ శాబ్ధి చంద్రుఁ
డమలగుణుఁడు నారాయణా ♦ హ్వాయసుతుండు
గవి విధేయి సీతారామ ♦ కవివరుండు
వ్రాసె; నతఁడు మనకుఁ జిర ♦ పరిచితుండు.

నటి—అవును. ఈతని నాటకము లిదివరకే యనేకములు లోకఖ్యాతి వహించియున్నవి—ఇంక మనము నాటక ప్రదర్శనోద్యోగంబున నుండుదము.

సూత్రి—నాటక ప్రదర్శనంబునకుఁ బూర్వము ఋతువర్ణనము సేయుట యాచారమై యున్నదిగదా!

నటి—అట్లయిన నే ఋతువును వర్ణింపవలెనో యాసతిండు.

సూత్రి—సకల సౌఖ్యప్రదమైన యివ్వసంతమును గూర్చియే!

నటి—మంచిది.

లయగ్రాహి.

కాంతులు నిరంతరము ♦ కాంతలనుగూడి ముద
మెంతయును గల్గగల ♦ కాంతవన కేళీ
స్వాంతులయి యేగికడు ♦ సంతసముమీఱఁ దరు
సంతతుల నీడలను ♦ శ్రాంతిగొనుమర్క బూ
బంతులను బూనుచును ♦ బంతమున నాటలను
నెంతయును నాడుచును ♦ బ్రాంతములలో శ్రీ
కాంతసుతు క్రీడలన ♦ నంతముగ దేలగను
వింతయగు కాలము వ ♦ సంతమిదియొప్పుఁ.

సూత్ర—నీ వర్ణనంబునకును, గాన మాధుర్యంబునకును సభికులు మిగుల సంతసింపుచున్నారు.

(తెరలో)

ఉ॥ కౌరవరాజ చంద్రుఁడ వ ♦ ఖండపరాక్రమ శాలివీవు; ధా
త్రీరమణీ మనోహర! య ♦ ధీరులఁ బాండవులన్ దలంచి యీ
తీరున గొప్ప భీతి నెమ్ము ♦ దిన్ గననేటికి నట్టులైన న
వ్వారిని నీపురంబు నెడ ♦ బాసి చనంగను జేయుమీ వెసన్.

సూత్ర—సతీ! కర్ణ దుర్యోధనులు కాఁబోలు యిట్లు వచ్చుచున్నారు. మనము పోవుదము రమ్ము.

(ఇరువురును నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రస్తావన.

శ్రీ

ద్రౌపదీపరిణయము.

ప్రథమాంకము.

[కర్ణ దుర్యోధనులు ప్రవేశము.]

కర్ణు—మిత్రమా! దుర్యోధనా!

ఉ॥ కౌరవరాజచంద్రుఁడ వ ♦ ఖండ పరాక్రమశాలి వీవు ధా
త్రీరమణీ మనోహర! య ♦ ధీరుల పాండవులన్ దలంచి యీ
తీరున గొప్పభీతిని మ ♦ దిన్ గననేటికి నెట్టులైన న
వ్వారిని నీపురంబు నెడఁ ♦ బాసి చనంగనుజేయు మీవెసన్.

దుర్యో—సఖా! కర్ణా! మాటలవలన నేమిప్రయోజన మున్నది. అంధుండగు మాజనకుండు రాజ్యంబున కనర్హుండగుటంజేసి మా పినతండ్రియగు పాండునృపాలుండే యీ కురురాజ్యభారంబుఁ దన భుజస్కంధమునందు నిలుపుకొని బాహుబలపరాక్రమ శౌర్యంబులు దీపింప ననేక భూనాథులఁగెల్చి ధనంబు దెచ్చి మాతండ్రిచే ననేక యాగంబులు జేయించి విమలయశంబు నందినాడు.

తే॥ గీ॥ హరిణశాప కారణమున ♦ నతఁడు వనినిఁ
బ్రాణములఁ బాసి చేరెను ♦ స్వర్గపదవి
నాటినుండియుఁ గుంతియు ♦ మేటి శౌర్య

ధనులు నాపాండురాజ నం ♦ దనులు మాగృ
హంబునను నర్థిలుచునుండి ♦ రనఁగు సఖుఁడ.

మా గృహంబుననుండి మాతోపాటు విద్యల నభ్యసించి మాకంటె నెక్కువ బలశాలులైనారు.

తే॥ గీ॥ ఫాల్గుని మహాస్త్ర సంధాన ♦ పటిమఁ గాంచి
వాయుజు గదాప్రవీణత ♦ వరుసఁ జూచి
మాద్రిసుతుల ఘన పరాక్ర ♦ మంబు దలఁచి
భయము నొందుచు నుందును ♦ భావమందు.

ఆ పాండవేయులు నిజముగా నాకు హృదయశల్యములవలెఁ గన్పట్టుచున్నారు.

కర్ణ—రారాజా!

తే॥ గీ॥ ఎట్టులో వారితోఁ బగఁ ♦ బెట్టుకొంచు
బురము వెడలించుమార్గంబు ♦ నరయుమయ్య
చిక్కుఁ జింతయు లేక నీ ♦ చిత్తమందు
సంతసముబూని మెలఁగెదు ♦ తమ్మతలేంద్ర.

ఇయ్యదియే యిప్పుడు మనకుఁ దగిన కర్తవ్యము.

దుర్యో—నీవు చెప్పినది బాగుగనే యున్నది; కాని,

ఉ॥ తమ్ముని పుత్రులంచు గుణ ♦ ధార్మికులంచు ననేకవైరి బృం
దమ్మును గూల్పఁగాదగిన ♦ ధైర్యముగల్గిన వారలంచుఁ జి
త్తమ్మున నూహఁ జేయుచు ము ♦ దమ్మున మన్ననసేయుచుండెఁ దా
నిమ్మహి నాదుతండ్రి కను ♦ హీనచరిత్రులఁ బాండవేయులన్.

సీ॥ ధర్మమే నిరతంబు ♦ దనకు భూషణ మటంచు
దలచి వర్తించు నా ♦ ధర్మసుతుఁడు
భండనంబులను ను ♦ ద్దండ బలమ్మున
వైరివర్గమ్ము గూల్చు ♦ వాయుజుండు

శస్త్రాస్త్రవిద్యలో • సాటిలేక జరియించి
యశమందుచుండును • నర్జునుండు
అన్నదమ్ముల కింత • యైనను తగ్గక
మాన్యులై యుండిన • మాద్రితనయు
తే॥ గీ॥ లనుచుఁ దలపోసి నిరతంబు • నాత్మయందు
భవ్యమోదంబు నందుచుఁ • బాండుసుతుల
గాంచుచుండెను యెంతయో • కరుణతోడ
మంచిచెడ్డలు దెలియక • క్ష్మాధవుండు.

మా తండ్రిగారు వారికిచ్చుచున్న చనువును దలంచి వారును గర్వాంధకార చేతస్కులై కన్నును మిన్నును గానకయుండి మా రాజ్యలక్ష్మిని హరించుటకు లోలోపల ప్రయత్నము సేయుచున్నట్లు వినియున్నవాఁడ.

కర్ణ—అన్నా! ఎంత దారుణము.

తే॥ గీ॥ తిన్నయింటను వాసాల • నెన్నుపగిది
భవ్య భవదీయ రాజ్య సం • పదలుగొనఁగ
యత్నమును సేయు పాండురా • జాత్మజులను
సమయజేయుటే తగుపని • క్ష్మాతలేంద్ర.

దుర్యో—అట్టిది మనము చేయఁగలుగుదుమనుట కలలోనిమాట.

కర్ణ—ఏమి! మిత్రమా! అట్లు పలుకుచుంటివి!

చ॥ భరతకుల ప్రదీపుఁడవు • బాహు పరాక్రమ శౌర్య విక్రమ
స్ఫురణ జరింపుచుంటి వరి • భూపతులెల్లరు నీకు మ్రొక్క సో
దరశత మెల్లవేళలనుఁ • దద్దయు భక్తినిఁ గొల్వఁ; బాండుభూ
వరుని కుమారులన్ వినిన • భావమునన్ భయమేల చెప్పుమా.

దుర్యో—మిత్రమా! వేరొకభయ మేమియు లేదు. వారిని మనము చంపటే మనుటయే!

కర్ణు—రాజా ! ఆగ్రహింపకుము.

చ॥ సెలవిడి పంపుమీ యిపుడె ♦ చెచ్చెర తేఁజసి పాండవేయులన్
గలన వధించి నీదు పగ ♦ గంజ సమీపమునందునుంతు నా
తలువల శీర్షరాజములు ♦ దోర్బల విక్రమశౌర్య మేర్పడన్
బిలువగవద్దు కర్ణుఁ డను ♦ పేరున నట్టులు సేయకుండినన్.

దుర్యో—అకారణంబుగ వైరము గల్పించుకొన్నచో నిందాభరము మన తలపైఁ బడును. అదియట్లుండ వారిని గెల్చుటకూడ యసాధ్యమే; ఎందుకంటివేని

సీ॥ త్రోయింపగాలేదె ♦ తోయంబులందున
పాశంబులను నాడు ♦ బద్ధుఁ జేసి
కొట్టింపగాలేదె ♦ దిట్టయౌ మల్లుచేఁ
గ్రీడా పరిక్రాంతిఁ ♦ గేలుపడఁగ
కఱపింపగాలేదె ♦ ఘన సర్పములచేఁ
బూర్ణనిద్రను దాను ♦ మునిఁగియుండ
బెట్టింపగాలేదె ♦ విషభోజనంబును
మాయమాటలచేత ♦ మఱుగుఁబుచ్చి

తే॥ గీ॥ అకట! యెన్ని జేసినఁగాని ♦ యనిలపుత్రుఁ
డింతయును నొవ్వకుండెను ♦ నేమిబలమొ
వానిఁ దలఁచినయంతనే ♦ భానమందు
భయమును గల్గుచునుండును ♦ మరసఖుండ.

ఆకారణముసంజేసి నెమ్మదిగా సామవాక్యములచే వారల నీపురము వెడల నడపవలయును. (ఇంచుక యూరకుండి) ఇంకొక్క విశేషము నీకుఁ జెప్ప మఱచితిని.

కర్ణు—అది యెట్టిది !

దుర్యో—తే॥ గీ॥ ధర్మచారిత్రుఁ డంచును • దలఁచి ధర్మ
నందనుని యౌవరాజ్యంబు • నందు నిల్ప.
యత్నమును సేయుచుండెను • యంధనృపతి
యుర్వి నతఁడేల నేఁజూచి • యోర్వఁగలని.

కర్ణు—అట్లయిన నింక సహియింపరాదక నెట్లయిన మీ తండ్రిగారితో నీవిషయ మాలోచించి, పాండవులను నీయూరునుండి వెడలఁగొట్టింతము. తరువాత సంగతిఁ జూచుకొనవచ్చును. (ప్రక్కంజూచి) అదిగో మీతండ్రిగారు సంజయునితో నేదియో మాటలాడుచు సుఖాసీనులై యున్నారు. నీవు మాట్లాడుట కిదియే సమయంబు. రమ్ము. (నిష్క్రమింతురు.)

(తెర లేచును.)

—:[ధృతరాష్ట్రుఁడు—సంజయుఁడు ప్రవేశము]:—

ధృత—(సంజయునిఁ జూచి) సంజయా !

ఉ॥ అంధుని నన్ను రాజ్యమున • కర్హునిఁ జేసి భరంబు దా భుజా
స్కంధమునందు నిల్పుకొని • శౌర్య పరాక్రమ మేర్పడంగ ; గ
ర్వాంధుల నెల్లఁ జక్కడఁచి • ద్రవ్యము తెచ్చి ముఖంబులన్ గృపా
సింధుఁడు నాదు సోదరుఁడు • జేయఁగఁ జేసెను నన్నుఁ జేర్మిమై.

అట్టి యనుఁగుదమ్ముఁడైన పాండురాజుయొక్క మృతింగూర్చి కల్గిన సంతాపం బింకను నామనంబును వీడకయున్నది.

తే॥ గీ॥ తమ్మునిఁదలంచినంత చి • త్తమ్మునందు
నధికసంతాపముగును ; నే • త్రాబ్జములను
నీరుగాఱఁగఁడఁగు సెల • యేఱురీతి
యిట్టితమ్మునిఁగందునే • యెన్నఁడైన.

నిర్భాగ్యుఁడనైన నాకట్టితమ్ముఁ డేలబ్రతికియుండును.

సంజ—గతించినదానికై యిప్పుడు పగచినందువలనఁ బ్రయోజన మే
మియున్నది.

చర॥ సురలవరప్రసాదమున ♦ శోభిలినారలు ధర్మమూర్తులా
వరసుతు లేవు రీకరణి ♦ పాండునృపాలుని గర్భమందు; స
చ్చరితులవారిఁ జూచుకొని ♦ స్వాంతమునందునఁ బాండురాజె యీ
ధరణిని యున్న వాఁడనుచుఁ ♦ దాపము వాయుము కౌరవేశ్వరా.

ధృత—సంజయా! నీవు చెప్పినట్లు పాండురాజనందనులకు గుణసంపదల
యం దెవ్వరును సాటిగారుసుమా! నాయెడలఁ బాండురాజెట్టి
భక్తిఁబూని చరియించెనో ధర్మసుతుండును నట్లే చరియింపు
చున్నాఁడు. అతని బ్రాహ్మణభక్తియు, గురుజనానురక్తియు,
ధర్మకార్యాసక్తియుఁ, బొగడుటకు వేనోళ్ళ చెలువమైనను శక్తుఁ
డుగాడు. ఆకారణముచేతనే ధర్మతనూభవునికి యౌవరాజ్యపద
వి నొసంగితిని. ఇట్లు గావించినందుకుఁ బ్రజలెల్లరును నన్ననేక
భంగుల వినుతించినారు.

సంజ—రాజేంద్రా! నీవు చక్కని పనిఁగావించితివి. అతఁడు యౌవ
రాజ్యపదమందుండఁగా రాజ్యమభివృద్ధినొందుట కేమిలెక్క.
అరిరాజన్యులెవ్వరయినను కన్నెత్తి చూడగలరా! (ఇంచుక
యూరకుండి ప్రక్కదిరిగిచూచి) మహారాజా! ఎందులకో
దుర్యోధనకర్ణు లిచ్చటి కరుదెంచుచున్నారు. వారివెంట శకుని
దుశ్శాసనులుకూడా యేతెంచుచున్నారు.

[దుర్యోధన కర్ణ శకునిదుశ్శాసనులు ప్రవేశము.]

దుర్యో—(ధృతరాష్ట్రునిఁజూచి) తండ్రీ! వందనములు.

ధృత—కుమారా! వర్ధిల్లుము.

దుర్యో—భగవంతుఁడిచ్చిన యాయుర్దాయమున్నంతవరకు వర్ధిల్లక తప్పదు. నీవు ఆశీర్వచనముల చేతను, మాటలచేతను మమ్ముల వర్ధిల్లఁజేయనెంచెదవుగాని క్రియలో మాత్రము చూపవు.

ధృత—కుమారా! అట్లు పలికెదవేమి! నేను నీయెడల జేసిన లోపమేమి!

దుర్యో—నీవేమియును జేయలేదు. నా చారిత్రఫలమీరీతిగాఁ బరిణమించినది.

శకుని—సుయోధనా! ఏటికీ యెత్తిపొడుపుమాటలు. నీవభిలషించిన కార్యమేదియో మీతండ్రిగారికిఁ దెలుపుము. వారు చేయనప్పుడుగదా నిష్ఠురోక్తు లాడవలయును!

దుశ్శా—అగ్రజా! నీ కార్యమేదియో తండ్రిగారికిఁ నివేదింపుము.

కర్ణు—మిత్రమా! చల్లకువచ్చి ముంత చంకనుబెట్టిన చో నేమిలాభమున్నది.

సరిజ—(తనలో) ఈదుష్టచతుష్టయమేదియో దురాలోచన చేసియే యిచ్చటి కరుదెంచినారు. సరే! ఏదియెట్లయిన నాకేల!

దుర్యో—తండ్రీ! మేమునీకుఁ బుత్రులముగామా! అట్టియెడల మేము నీకేమి యుపకారమాచరించితిమి. మాయెడల నింత నిర్దయ వహించుటకుఁ గారణమేమి!.

ధృత—కుమారా! నావలనయున్నదోష మెట్టిదియో చెప్పుము.

దుర్యో—ఏమికావలయును. ఈచేసినది చాలదా. చూడుఁడు.

ఉ॥ తమ్మునిపుత్రులంచును; సు • దమ్మున సాకఁగవచ్చుఁగాని రా
జ్యంబునొసంగి నీసుతుల • కందరికిన్ హృదయంబులందు దుః
ఖమ్మును గల్గఁజేయుదువె • కానివిధంబుననిట్లు సేయ భా
వ్యమ్ము సమస్తమున్ దెలిసి • వర్తిలుచుంటివి కాదెభూవరా.

తండ్రీ! తమ్ముని పుత్రులందు నీకుఁ బ్రేమయుండిన నుండుఁగాక. వారిని నీయింటనుంచుకొని వలసిన సంపదల నిచ్చి కాపాడవచ్చును.—

అందులకు మే మభ్యంతరపెట్టువారము కాము కాని ధర్మనందనుని యౌవరాజ్యపదమందు నిలిపినాఁడవు దీనంజేసి మా కపాయము వాటిల్లదా! మే మేమయిపోవుదుము.

ధృత—(తనలో) వీరందరును నెప్పుడును నేదియో దురాలోచన సేయుచుందురే. (ప్రకాశముగా) వత్సా! దీనంజేసి మీకేమి కొఱఁతపడినది. లేనిపోనివి కల్పించుకొని చిత్తమున నాందోళనఁ జేర్చుకొనుచుందువు.

దుర్యో—దీనివలన మా కపాయము లేదందురా!

ధృత—ఏమి యపాయమున్నది? ప్రజ్ఞాచక్షుండ నగుటం జేసి రాజ్యపరిపాలనంబునకు సమర్థుండను గాను గదా. సమర్థుండైన భీష్ముఁడు రాజ్యవిషయమై యిదివఱకే బ్రహ్మప్రతిన వహించియుండెను. అట్టిచో నాతమ్ముఁడైన పాండురాజు నన్ను రాజుగా నిలిపి తద్భారమంతయు నాతఁడు వహించి నన్నతిభక్తితో సేవింపుచుఁ దన పరాక్రమంబున వైరిరాజుల నదిమి కప్పంబులఁ దెచ్చియిచ్చుచు, ననేక ధనరాసులఁ బోగుఁజేసి నాచే ననేక యాగంబుల జేయించి తుదకు శాపవశంబున మృతుండయ్యె. అతని కుమారులైన యీ పాండవులును గుణములందుఁ దండ్రినిబోలినవారు. అందు ధర్మతనయుండు ప్రజ్ఞాన్వితుండును, సత్యసంధుఁడును నగుటం జేసి వానికి యౌవరాజ్యపదమిచ్చితిని. దీనంజేసి రాజ్యంబు వృద్ధియగును. భీష్మద్రోణవిదురాదులును దీనికి సంతసంబున సమ్మతించిరి. వారును నన్నుఁ బాండురాజువిధంబున నతిభక్తితో సేవింపుచుండిరి.

దుశ్శాస—తండ్రీ! పైతృకంబైన రాజ్యభారము పాండుభూవిభుఁడు వహించియుండుటం జేసి యాతని సుతుఁడైన ధర్మతనయుండిప్పుడు రాజయ్యెనేని ముందుగూడ వారిసంతతి వారే రాజుల

గుదురు. మేమును మాపుత్రపౌత్రవర్గంబును నేమయిపోదుము. మేమందరముగూడ వీరికి దాసులమై సేవకులరీతిఁ జరియింపుచుండవలయునుగదా. పరులపంచఁజేరి బ్రతుకగలమా: మాగోడు నీవొక్కింత విచారింపవలదా!

శకుని—మహారాజా! దుశ్శాసనుండుపల్కిన వాక్యములు సత్యమే.

కర్ణ—అందుకు సందియమేమియును లేదు.

దుర్యో—తండ్రీ! నే నాపాండుతనయుల పరాక్రమంబునకు నిరంతరంబును భీతిబొందుచుందును. పాండురాజుయొక్క పరిపాలనంబున హాయిఁజెందియున్న ప్రజలెల్లరును ధర్మశాలియయిన యుధిష్ఠిరుని పరిపాలనంబునకే చూచుచుందురు. ఇప్పుడే ప్రజలందరును ధర్మతనయునికి వశ్యులై నన్నుఁ జూడకయున్నారు. ఇఁకఁ గొన్నాళ్ళు పోయినచో నాపేరునైనఁ దలపెట్టరు. అతఁడు ప్రజానురాగమునడసి తనరుచున్నాఁడు. అతఁడే రాజయినచో మాకుండతావుండదు.

ధృత—(తనలో) వీరు పలుకుచున్న వాక్యములు నిశ్చయమే. ప్రజలెల్లరును ధర్మజుని పరిపాలనంబును వేనోళ్ళఁ బొగడుచున్నారు. ఇందుకేమి తెరువు నూహింపనగునో తోచకున్నది.

కర్ణ—(ధృతరాష్ట్రునిఁ జూచి)

ఉ॥ భారతవంశజాతుఁడవు ♦ బాహుబలాఢ్యుల సత్కుమారులన్
ధారుణిగాంచి; సజ్జనులు ♦ ధర్మచరిత్రుఁ డటంచుఁజెప్ప వి
స్తారయశంబుగాంచితివి ♦ ధర్మవిధంబులు నీకుఁ దెల్పఁగా
నేరము; నీకునుం దెలియ ♦ నేరనివున్నవె కౌరవాధిపా.

మహారాజా! ఈ భూతలంబెల్లను మీయదియే. పాండురాజు మిమ్ములను రాజుగాఁజేసి వ్యవహారంబులన్నియు నాతఁడు జక్కబెట్టుచువచ్చె అంతమాత్రమున నాతనిసుతులు దీనికెల్లధిపతులగుదురా

కావున మీ కుమారులక్షేమంబు విచారించుట మీకు శ్రేయస్కరము.

ధృత—కుమారులారా! అట్లయిన నిప్పుడేమిసేయుమందురు.

దుర్యో—

తే॥ గీ॥ కరుణ నాయందునీకును ♦ గలిగెనేని
పాండవులవారణాసికిఁ ♦ బంపుమయ్య
కొన్నినాళ్లేగినంతన ♦ కోమఘుమిగుల
మజల నేతేరవచ్చును ♦ మహితలేశ.

అప్పటికి రాజ్యము మనకు సుప్రతిష్ఠితంబై ప్రజలెల్లరు మనకు వశ్యులై యుందురు.

ధృత—(తనలో) కష్టము. కష్టము.

చం॥ చినతనమాదిగాగనను ♦ జేరిన పాండుకుమారచంద్రులన్
ఘనకృపతోడఁ బెంచితిని ♦ గాదనకిప్పుడు వీరిమాటపైఁ
జనుఁడుపురంబువాసియని ♦ చయ్యనఁబల్కఁగ సమ్మతించునే
మనమకటా; యికేమని కు ♦ మారులకోరిక మాన్పనేర్తునో.

తే॥ గీ॥ తండ్రి; నేనేయటంచును ♦ దనదుమదినిఁ
దలఁచి సేవింపుచుండెను ♦ ధర్మతనయుఁ
డట్టివానినికారణం ♦ బరయకుండ
పురము వెడలింపనెట్లోప్తు ♦ కరుణలేక.

(ప్రకాశముగా) కుమారా! నీవుదారుణమైనకోరికఁ గోరుచుంటివి. అకారణము ధర్మచరిత్రులయిన పాండుకుమారుల నెట్లు పొమ్మని చెప్పఁగలను. ఇట్టి యకార్య మాచరించితినేని లోకులెల్ల నన్నుఁ బరమ పాతకుఁడని దూషింపరా. ఇది యట్లుండ వృద్ధులైన భీష్మద్రోణవిదురులు దీనికెట్లు సమ్మతింతురు.

దుర్యో—తండ్రి! నీవెట్టులయిన మా మాట వినకుండునట్లనేకమాటలు చెప్పుటవలనఁ బ్రయోజనము లేదు. నీవు సర్వస్వతంత్రుం

డవు. నీ కొమరులయాజ్ఞతోఁ బనియేయున్నది. నీయాజ్ఞాగార వంతున వారెల్ల యొకంబనుదురు. అశ్వత్థామ నాకిష్టుఁడయి యుంటఁజేసి పుత్రవాత్సల్యమున ద్రోణాచార్యుండు నన్నెడఁ బాయఁడు. కృపాచార్యుఁడు ద్రోణునిఁబాసి యుండకపోవుటచే నాకడనే యుండును. భీష్ముండేజోలికినిఁ బోవక యూరకుండును. విదురుండు పాండవపక్షపాతియయ్యును దానొక్కరుఁడై యుంటంజేసి నాకపకారమేమియునుఁ జేయఁజాలఁడు. చేయఁదలంపఁడు. కావున నీవు సంకోచింపక పాండుకుమారులను వారణాసికిఁ బంపుము. ఇందులకన్యథా వర్తించితివేని నా దేహ మగ్నికాహుతి గావించుట నిజము. రాజ్యసంపదలు లేక దాయాదుల యొద్ద దాసుఁడనై యుంటకంటె నదియే మేలు.

ధృత—అంత సాహసకార్య మేల చేయవలయును? నీ యభీష్టమే నెఱవేర్చెదను. (సంజయునిఁ జూచి) సంజయా! నీవరిగి పాండవాగ్రజునిటకుఁ దోడ్కొనిరమ్ము.

సంజ—(తనలో) ఆహా! కుమారులమాట నాలించి యీవృద్ధరాజెంత పాపమునకొడిఁగట్టినాఁడు. (నిష్క్రమించును.)

ధృత—ఇంక నీవు చింతఁబాసి యుండుము.

దుర్యో—(దుశ్శాసనునిఁ జూచి) మీరందఱును నిచ్చోట నుంటిరేని మన మందరమును నేదియో దురాలోచన జేసి వారిని వెడలనడుపుచుంటిమని యనుమానించెదరు కావున నిప్పటికి మీ రరిగి కొంచెము సేపు తాళి నన్నుఁ గలసికొనుఁడు.

(దుశ్శాసన శకుని కర్ణులు నిష్క్రమింతురు.)

దుర్యో—(తనలో) ఇప్పుడు నాకుఁ గొంచెము యానందము కలిగినది. పాండవేయులు తప్పక నాతండ్రియాజ్ఞపై వారణాసికేగుదురు. అచ్చోట వీరికై యొక లక్కయిల్లును పురోచనునిచే నిర్మింపఁ

చేసి దాని కగ్నిఁ బెట్టునట్లు గావించెదను. కాశంజేసి వారందరు దగ్ధులయ్యెదరు. అప్పుడు నాకు సంపూర్ణమైన యానందము కలుగును.

[ధర్మరాజు సంజయునితోఁ బ్రవేశించును.]

సంజ—(ధృతరాష్ట్రునిజూచి) దేవా! యువరాజగు ధర్మనందనుం డరుదెంచినాఁడు.

ధర్మ—తండ్రీ! భవదీయపాదపంకేరుహంబుల కీసుతుండు నమస్కరించుచున్నాఁడు.

ధృత—వత్సా! సకలసంపదలనందుచుఁ జెక్కెంగ్లు తమ్ములతోఁగూడ వర్ధిల్లెదవుగాక!

ధర్మ—భవదమోఘాశీర్వచనంబు ఫలించుఁగాక! తండ్రీ! నాయందుఁ గృపవహించి రావించినకారణం బెట్టిదియో తెలియఁగోరెదను.

ధృత—కుమారా;

సీ॥ నాయందుభక్తిని ♦ ననిశంబుఁజూపుచు
ధరణిభారమునంత ♦ దానుబూని
శత్రురాజులనెల్ల ♦ సంగ్రామరంగంబు
నందునజెండాడి ♦ యశముగాంచి
ధనరాసులను దెచ్చి ♦ తప్పకనాకిచ్చి
మఖములెన్నెన్నియో ♦ మహిమమీఱ
జేయించెనాచేత ♦ క్షితితలాధిపులెల్ల
బృథ్వియందుననన్ను ♦ వినుతిసేయ
తే॥ గీ॥ నట్టియనుఁగుఁదమ్ముండుమీ ♦ యయ్యపాండు
రాజు; వేటాడనరిగి య ♦ రణ్యమందు
భవ్యచారిత్రులనుమిమ్ముఁ ♦ బడసి; శాప
కారణంబునఁజేసి స్వ ♦ ర్గంబుజేరె.

పూతచారిత్రుండును, నాశ్రితజనహృదయపంకజభాస్కరుండును, వైరివీరదగ్రాంధకార ప్రభాకరుండును, నిరంతర సర్వదేవతా చింతన మానసుండును, నగు మీజనకునకు సచ్చరిత్రులైన మీయట్టి తనయులున్నందుకుఁ బుణ్యకర్మలు జేయుట యుత్తమమని నాకుఁ దోచినది. ఆకారణంబునఁ జేసి మిమ్ములను వారణాసికిఁ బంపనెంచితిని.

ధర్మ—తండ్రీ !

చం॥ జనకుఁడు మమ్ములన్ విడిచి ♦ స్వర్గము జేరెను నాటినుండియుఁ
జననిని మమ్ములఁ మిగుల ♦ సత్కృపతోడను సాకుచుంటివో
యనఘ ! త్వదీయవాక్యముల ♦ కడ్డముజెప్పఁగ నెంచువారమే
మనమున మమ్ముఁగూర్చియును ♦ మానమునొందకు పార్థివోత్తమా.

తండ్రీ! మాజనకుండు మరణించిననాటనుండియు మమ్ము నీవు కన్నపుత్రులకంటె నెక్కుడు ప్రేమతోఁ బెంచుచుంటివి.

తే॥ గీ॥ బాల్యమందునమాకు జ్ఞా ♦ పకము లేదు
తండ్రినీక్షించినట్టులో ♦ ధరణిపాల
తండ్రివీవేయటంచుఁ జి ♦ త్తమునందు
దలఁచివర్తింపుచుంటిమి ♦ తథ్యముగను.

ధృత—(తనలో) ఆహా! ఏమి! ఈతనివాత్సల్యము. కల్ల కపటంబులెఱుఁగని మానవుండన్న ధర్మనందనునినే యనవలయునుగదా. నిశ్చయముగా నిట్టి శాంతస్వభావుని, నిట్టి ధర్మచరిత్రునిఁ బురంబునుండి వెడలనడుపుచుంటినిగదా! (ప్రకాశముగా) వత్సా! ధర్మతనూభవా! వర్ణనాతీతమయిన నీభక్తికిసంతసించితిని. ధర్మచరిత్రులైన పుత్రులు తమతండ్రి సుగతికి జనుపుణ్యకర్మల జేయుట విధియైయున్నది. అందుచే నీవును తమ్ములును జననీసహితముగ వారణాసికరిగి యందుఁ గొన్నాళ్ళునివసింపుచుఁబితృకార్యంబులఁ దీర్పుము. వలసిన దానంబు లొనర్పుము. ఇచ్చ

వచ్చినరీతి భూసురులను సేవించుచు సన్మానింపుడు. భారతవర్షం బునందెల్ల పుణ్యక్షేత్రమై, శ్రీమదన్నపూర్ణాదేవీసమేతుఁడగు విశ్వనాథునకు నిలయమై, సకలసంపదలకును నాకరమై, పుణ్యజననివాసయోగ్యమై, సమస్తాభీష్టఫలప్రదమై, శ్రీమన్నారాయణుని చరణకమలంబులందు జనించి, శంకరునిచే నిజజటాజూటంబున ధరింపఁబడి, పరమపావనతేజోవిరాజమానమైయొప్పుచుండు గంగామహాప్రవాహంబుచే నలంకరింపఁబడి భూలోకస్వర్గమై యొప్పుచున్న యీ వారణాసీపురంబుననున్నచో మనుజులకు సంతాపంబులు నశించి పుణ్యవంతులగుదురు.

ధర్మ—

సీ॥ ధరియించినీయాజ్ఞఁ ♦ దలపైనఁదమ్ములఁ
గూడిజననియైన ♦ కుంతితోడ
వారణాసినిఁజేరి ♦ భాగీరథిఁగుంకు
లిడుచుండి మేటిభూ ♦ మీసురులకు
దానధర్మంబులు ♦ దగినట్లుసేయుచు
నన్నపూర్ణాయుతుం ♦ డైనవిశ్వ
నాథుసేవింపుచు ♦ నాదు జనకునకు
బుణ్యకర్మలఁజేసి ♦ పొలుపుగాంచి
తే॥ గీ॥ వార్తఁబంపినయప్పుడు ♦ భవ్యమతిని
మరలనరుదెంచువాఁడ సో ♦ దరులఁగూడి

ధృత—ధరణి నినుమెచ్చవచ్చును ♦ ధర్మతనయ
తండ్రియానతినిట్లు వేర్పఁ ♦ దగుదువీవు
రమ్యగుణశాలియైన శ్రీ ♦ రాఘవునకు.

వత్సా! నీపితృభక్తిఁ బొగడఁజాలను. నీయిచ్చవచ్చినట్లుగున కాశీపురంబున దానధర్మములఁజేయుచుఁ జరింపుము. వలసిన ధనంబును

గొంపొమ్ము. మఱియు నీకెప్పుడెంత ధనము కావలసినను బంపుచుండెద.

ధర్మ—మహాప్రసాదము. (నిష్క్రమించును.)

ధృత—వత్సా! దుర్యోధనా! నీస్వాంతమున నున్న చింత పోయినదికదా. (సంజయునిఁజూచి) సంజయా! మందిరంబునకు దీసికొనిపొమ్ము.

(ధృతరాష్ట్రసంజయులు నిష్క్రమింతురు)

దుర్యో—సేవకా! సేవకా!

సేవ—మహారాజా! ఏమిసెలవు!

దుర్యో—కడురయంబున నీవరిగి నాయాజ్ఞగాఁ దెలిపి పురోచనునిఁ దోడ్కొనిరమ్ము.

సేవ—చిత్తము. (నిష్క్రమించును.)

దుర్యో—ఎట్లో మాతండ్రిగారికిఁ జెప్పి పాండవులను వారణావతంబున కరుగుమని చెప్పించితిని. వారిఁక సుముహూర్తము చూచుకొని వారణాసి కరుగుదురు. ఇప్పుడు నేనేపన్నుగడనైనను బన్ని వారినాపురంబున నంతంబొందింపవలయును. ఏయుపాయమాలోచింతును? (ఆలోచించి) సరే! జ్ఞప్తికివచ్చినది. పురోచనునివలన నిక్కార్యము తప్పక నెఱవేరఁగలదు. అదుగో! పురోచనుండు వచ్చుచున్నాఁడు.

(పురోచనుఁడు ప్రవేశించును.)

పురో—(దుర్యోధనుని సమీపించి) దేవా! ఏమి యాజ్ఞ?

దుర్యో—మిత్రమా! పురోచనా! అరుదెంచితివా!

తే॥ గీ॥ బాల్యమాదిగ నాకునుఁ • బ్రాణహితుఁడ
వగుచుఁ దనరుచుండుటను; కా • ర్యంబునొండు
చెప్పఁదలఁచి రావించితి • శీఘ్రగతిని
జెప్పుటకు సందియంబును • జెందుచుంటి.

పురో — దేవా! నీవు నాయెడ్డ సందేహింపనేటికి! నే నెప్పుడును భవదాజ్ఞా బద్ధుఁడనని తలంపుఁడు. బాల్యంబాదిగ మీ యుప్పుపులుసు దినుచు జీవించువాఁడనుగదా.

తే॥ గీ॥ చేయఁ గల్గిన కార్యంబుఁ ♦ జేయువాఁడె
చేతగాకున్న నోరులను ♦ చేయఁ జేతు
ప్రాణమిమ్మన్న నిచ్చెదఁ ♦ బార్థివేంద్ర
సందియంబంద నేటికి ♦ డెందమందు.

దుర్యో — సఖుఁడా! నీవు నా కార్యమును దప్పక జేయఁగలుగుదువు. దుర్ఘటమైన కార్యము కాదు; కాని యది బహు రహస్యము. రెండవ కంటికి వానికిఁ గోచరము కాఁగూడదు.

పురో — మహారాజా! నన్ను గుఱించి నీ వన్యథా తలఁపవద్దు. ఎట్టి కార్యము జేయవలయునో చెప్పినచో నదు శీఘ్రముగాఁ జేయుటకే నేనిందు సంసిద్ధుఁడై యున్నాడు. సందియంబందక సెలవిండు.

దుర్యో — పురోచనా! తండ్రి పోయిన నాటనుండియుఁ బాండవులు మా గృహంబునందే యుండి, మా కెగ్గుసేయఁ దలంపుచున్నారను మాట నీ వెఱుంగుదువా! లేదా!

పురో — కర్ణాకర్ణికగా విని యున్నవాఁడ.

దుర్యో — అది యట్లుండ మా తండ్రి ధర్మనందనుని యౌవరాజ్యపదమందుంచుట యెఱుంగుదువా.

పురో — ఎఱుంగుదును.

దుర్యో — ఆ కారణంబున వారు గర్వాంధకారచేతస్కులై తమ యంతటి పరాక్రమవంతులు లేరని తలంచి మా రాజ్యంబు నపహరింపఁ దలంచినారు.

పురో—

తే॥ గీ॥ తండ్రి పోయినవీక్షించి ♦ తమ్ముని సుతు
లంచుఁదలపోసి జాలి వ ♦ హించి యింటఁ
జేర్చినందుల కిబ్బంగి ♦ జేయువారె
తిన్నయింటను వాసాల ♦ నెన్నువగిది.

దుర్యో—ఆ కారణంబున నేను మా తండ్రితోఁజెప్పి యా పాండవుల ను పురంబు వెడల నడపఁజేసితిని.

పురో—ఏమీ ! పాండవులు పురంబు విడిచిపోవుదురా ! ఎప్పుడు.

దుర్యో—నామాట సంపూర్తిగ వినుము. వారొక నాగము దివము లలో మా తండ్రిగారి యానతిని గాశీ పురంబునకుఁ బోవుచు న్నారు. కావున వారికంటె ముందుగ నీవా నగరంబున కరిగి నీ శక్తిచే ఘృతతైలగంధక ప్రథితమైన చతుశ్శాలను నిర్మించి వారి రాకకై నిరీక్షింపుచుండి వారరుదెంచిన వెంటనే యందు బ్రవేశపెట్టి వారితో స్నేహభావమునఁ గలసిమెలసివర్తింపుచుఁ గొన్నాళ్ళరిగినపిదప నర్ధరాత్రింబున వారు నిద్ర మునింగియు న్నప్పుడుదాని కగ్నిఁగొల్పి, వారి మరణవార్తను నాచెవులకు వి నిపించి యానందము గలుగఁజేయవలయును.

తే॥ గీ॥ అట్లొనర్చితివేని రా ♦ జ్యంబునాకు
వచ్చు; సకలసంపదలందు ♦ వాడ; దానఁ
జేసి నీవుగూడను బెక్కు ♦ శ్రీల; గాంచ
గంచువు యశమందుదువు నా ♦ కరుణచేత॥

నీవు నాకుఁ బ్రాణసముండవనియు, నిట్టి కార్యము జేయ నీవె సమర్థుండవనియుఁ దలంచి చెప్పితిని.

పురో—(తనలో) చతుశ్శాల నిర్మించుట నాకుఁ దృణప్రాయము. ఇట్టి కార్యము నేఁ జేసితినేని సుయోధనుండు నన్ను మెచ్చి యిచ్చు—

వచ్చిన సంపదల[illegible] నన్నుఁ దులదూఁగ జేయును. (ప్రకాశముగా) దేవా! ఇంతియేకదా నేఁ జేయవలసిన కార్యము. నీవు చెప్పినయట్లొనర్చి నీ కానందముఁ గూర్చెద.

దుర్యో—సఖుడా! నీవు పాండవులకన్న ముందుగా వారణాసి కరుగవలయును.

మ॥ కడువిశ్వాసివటంచు నీపయిని నీ ♦ కార్యంబునుం బెట్టితిన్
వడిగాఁ జేరుము వారణావతము నీ ♦ ప్రజ్ఞన్ గనన్ లక్కమే
డల నిర్మింపుము; వారిచావుఁగని వే ♦ డ్కన్ వచ్చి విన్పింపుమీ
పుడమిన్ నీవె యొసంగినట్లుగ మదిన్ ♦ మోదంబునుం బొందెదన్.

పురో—నేడె పోయెదను. ఆజ్ఞ యొసంగుము.

(నిష్క్రమించుచున్నాఁడు.)

దుర్యో—(తనలో) ఈపురోచనుఁడు తలఁచుకొన్నచో నెంతపనినైనను జేయగలుగును.

తే॥ గీ॥ పాండునందను లందరా ♦ భవనమందు
దగ్ధులైనారటంచు నీ ♦ తండువార్తఁ
చెవినిఁ బడవేసినప్పుడు ♦ చిత్తమందు
గలుగు మోదంబు జెప్పంగ ♦ నలవియగునె.

(నిష్క్రమించును)

[రంగము:—ధర్మ భీమార్జున నకులసహదేవులు కుంతి ప్రవేశించుచున్నారు.]

ధర్మ—తమ్ములారా!

తే॥ గీ॥ భాగ్యవశమున మనమిష్ట ♦ వారణాసి
కరుగఁగంటిమి పెదతండ్రి ♦ కరుణచేత
ఎంత ధర్మపరుండవో ♦ యెంచిచూడ
కల్ల కపటంబులెఱుఁగవు ♦ తన్నతలెంద్రి.

ధర్మ—ఆ పెదతండ్రిగారి ప్రేమ వర్ణింపఁ దరముకాదు. భూలోకస్వర్గ
మని పేరుపొందిన యీ కాశికి మనలఁ బంపించుట నిశ్చయము
గాఁ బూర్వ జన్మంబున మనమేదియో యించుక సుకృతము చే
సికొని యుండుటచేతనే కలిగినది.

తరల:—ఘనముగానల వారణాసిని ♦ గాముసంహరునీశునిన్
గనెడిభాగ్యము గల్గె నేటికి ♦ గంగయందున మున్గి యా
తని పదంబులఁ గొల్చువారికి ♦ ధారుణీ తలమందు నె
మ్మనము నిశ్చలమౌచు నొప్పను ♦ మాన్యతన్ వహియింత్రుగా.

కుంతి—వత్సా! ధర్మతనూభవా! నీవెంత వెఱ్ఱివాడవోయి! నిజము
గా మీ పెదతండ్రియగు ధృతరాష్ట్రుండు మనపైఁ బ్రేమయుం
డుట చేతనే యిట్లు వారణాశికిఁ బంపుచుండెనని తలంపు
చుంటివా!

ధర్మ—తల్లీ తమ్మునికుమారులమని తలంచి నిరంతరమును మమ్ములను
కంటికి రెప్ప చందంబునఁ గాచుచున్న పెదతండ్రియగు ధృత
రాష్ట్రుండు మా తండ్రికి గాశీ నగరంబునఁ గొన్ని పుణ్య కర్మ
లను జేసి రమ్మని పంపుచుండఁగా నీ విట్లు వక్కాణించెదవేల!

కుంతి—కుమారా! నిజముగా ధృతరాష్ట్రుండు మీయందుఁ గరుణించి
పంపుచుండుటలేదు. దుర్యోధనాదుల దుర్మంత్రంబునకుఁ బ
ద్ధుఁడై యీ రీతి గావించెనని నాకుఁ దెలిసినది. కాకున్న
చో నిరత బాల్యావస్థయందు మీకుఁ దీర్ఘ యాత్రా సంచరణ
మేమిటికి?

ధర్మ—మనకిప్పుడా విషయంబునుగూర్చి యాలోచింప నవసరములేదు.
ఏల యనిన,

తే॥ గీ॥ పోవనున్నది కాశికా ♦ పురికినిపుడు
స్నాన మొనరించునది గాంగ ♦ జలములందు

నలువనున్న దీర్ఘ తండ్రికి ♦ సంతసమున
బుణ్యకర్మలు ; దీనికిఁ ♦ బొగడనేల.

ఒకవేళ పెదతండ్రి దుర్యోధనాదుల దుర్మంత్రంబున మనలను బంపినను మనకుమాత్రమిందు మహోపకారము చేసినాడు.

తే॥ గీ॥ జీవహింసను నిరతంబు ♦ జేయువాడె
యైనఁ ; బరకాంతలనుగోరు ♦ నతఁడునైన
ననిమిషనదీఁ ప్రవాహంబు ♦ నందు గ్రుంకు
లిడిన, పాపదూరుఁడగుచు ♦ నెగడునమ్మ.

అర్జు—తల్లీ !

తే॥ గీ॥ పరుల తల్లులు పెట్టెడి ♦ పాయసంబు
కన్నఁ ; గన్నతల్లి యిడెడు ♦ గంజిమేలు
వైరి గృహమందు వసియించి ♦ భాగ్యమందు
కన్న ; యాచనమేలౌను ♦ గాదె జగతి॥

మనలకు నిరతంబును నెగ్గుసేయఁ దలపెట్టు ధార్తరాష్ట్రుల గృహంబున నుండుటకన్న వారణావత నగర నివాసమే మనకు సౌఖ్యదాయకము. మఱియు, నే మహాపురం బఖండనవఖండకలిత భూమండలంబున కెల్ల యాభరణమై యొప్పుచున్నదో, ఎద్దానియందు స్నాన మాచరించుచున్నచో దుఃఖములుపోయి, పాపంబులడుగంటి, యజ్ఞానమునశించి, విజ్ఞాన మొనగూడి, యధికతేజంబు గలిగి, చిత్తంబునకు వికాసము గలుగునో యట్టి భాగీరథి యేపురంబున బాఱుచుండునో, భక్తజనులయభీష్టంబుల దీర్పఁదలఁచి సతీసమేతుఁడై విశ్వనాథుఁడను నామంబున యేపురంబున శంభుండు నెలకొనియుండెనో, శతయోజనంబుల దూరంబుననుండి యైనను తమ తపోయోగ బలంబునంజేసి, తెల్లవారఝామున కోడి కూసినప్పుడు బయలుదేరి గంగాస్నాన మాచరించి మరల సూర్యోదయంబునకు బూర్వము తమ [illegible] రిందురే పురం

బునఁగన్పట్టుచుండుఁగో, శ్రీ కాశీ విశ్వనాథ చరణారవింద మకరం
పానమత్తేందిందిరాయమానమానసన్మానసులును, నిరంతరచతుర్వేద పా
రాయణ భాసురులును నగు భూసురులును, వైరివీరదర్పాంధకార ప్ర
భాకరులగు క్షత్రియకుమారవారంబును, ధనకనకవస్తువాహన శోభితు
లగు వైశ్యులును, అక్షుద్రభద్రతర శాశ్వతైశ్వర్యసంపత్సముద్రులగు
శూద్రులును, జవవిజితపవనమనోవేగరంగత్తురంగంబులును, మత్తసా
మజంబులును, పసిఁడితేరులును, అనేక దేవాలయంబులును గలిగి
శోభిల్లుచున్న వారణావతంబు మన కెంతయు నివాసయోగ్యము.
అమ్మా!

చ॥ మనకు నిరంతరంబు జెరు • బాముల గూర్చఁగ నెంచుచుండు దు
ర్జనుఁడగునట్టి వాని సర • సన్ నివసించుచునుంటకన్న; దు
స్తరకలుషంబులార్పఁగను • జాలినగంగ యునుండి; పార్వతీ
వరునకు వాసమైతనరు • పట్టణమందున నుంటయొప్పదే.

సహ—అమ్మా! నీవింక ధార్తరాష్ట్రులసంగతి నెత్తకుము. అచ్చట
నుండుటకన్న మనకు గాశికాపురనివాసమే శ్రేయోదాయకమ
ని తలంపుము.

నకు—అదుగో! విదురుండేటికో యిట్లు వచ్చుచున్నాఁడు.

ధర్మ—ఈతఁడు నిరంతరంబును మనక్షేమ మాలోచించువాఁడు.

[విదురుఁడు ప్రవేశించును.]

విదు—(తనలో) భగవంతా! పరమేశ్వరా! నీచర్య లతివిచిత్రములు.

మ॥ ధనికున్ బేదగ బేదనున్ ధనికుగా • ధర్మాత్మక సంవేద్యు దు
ర్జనుగా! దుర్జనుధర్మ తత్పరునిగా • సత్యవ్రతున్ హీనుగా
ఘనశక్తున్ ధర నింద్రజాలకుగతిన్ • గావింపుచున్నావు నీ
ఘనమెవ్వారు గనంగశక్తులు సుధ • ర్మాంభోధి చంద్రోదయా,

తే॥ గీ॥ భాగ్యముం జెనుమాకంను ♦ భావమందు
గర్వమునుబూనువారలఁ ♦ గరుణలేక
బిచ్చమెత్తంగఁజేతువు ♦ వేడ్కతోడ
కరుణగలిగిననిరుపేద ♦ ధరణినేలు.

అదిగో పాండవులుఁ ప్రయాణోన్ముఖంబున నున్నవారలు.

ఉ॥ పాండుకుమారులన్ గనినఁ ♦ బాండుని జూచినయట్లులుండెఁ; నా
ఖండలభాగ్యభోగముల ♦ గాంచఁగఁజాలిన వీరినెట్లు భూ
మండలనాయకుండు పురిఁ ♦ బాసిచనంగను జేయగల్గెఁ బు
త్రింకువచించువాక్యములఁ ♦ ద్రోయకఁ బ్రేమద్యజింపుచుంగటా.

ఏమనుకొన్న నేమి ప్రయోజనమున్నది. విధివ్రాతఁ దప్పింప నెవ్వరితరమగును. ఇదుగో పాండవులు. (పాండవులను సమీపించుచున్నాడు.)

ధర్మ—(విదురునిఁజూచి) విదురా! నీరాక మాకిప్పుడు శుభప్రదమని తలంపుచున్నాము.

అర్జు—మాకెగ్గులసల్పఁదలంచు పాండవులపక్షంబునందుండినను నీవు నిరంతరంబును మాక్షేమంబును, యభివృద్ధిని గోరుచుందువు.

విదు—పాండుతనూజులారా! నిజముగాఁ దలయెత్తి మీతో భాషించుటకు నాకు మిగుల లజ్జయగుచున్నది.

నకు—మహాత్మా అట్లు పలికెదవేమి?

విదు—మరేమియును లేదు.

తే॥ గీ॥ కాశి కరుగుమంచును మీకు ♦ ధర్మ్మధవుండు
పలుక నిసుమంతయేనియు ♦ వలదటంచు
నతనితోఁజెప్ప లేనైతి ♦ నకట; వృద్ధుఁ
డైన భీష్ముఁడే సైరించె ♦ ననుచుఁ దలఁచి॥

ధర్మ—నీతికోవిదా! విదురా! ఇందు మాకు గష్టమేమున్నది. పూజ్యులగు మా పెదతండ్రిగారు మాయందున్న ప్రేమచే మమ్ములను వారణావతంబునకు బంపుచున్నారు. అయ్యది పుణ్యక్షేత్ర మగుటంజేసి జనకునకు బుణ్యకర్మంబుల నాచరించి సత్వరముగానే మరలివత్తుము. మాయందు మాత్రము నీవు సంపూర్ణమైన యనుగ్రహముంచుము

విదు—ధర్మపరాయణులగు నో పాండవపుత్రులారా!

తే॥ గీ॥ ఎచటమీరుందు రచ్చోట • నిందిరాధ •
వుండలరుచుండి; దప్పక • నిందుముదము
మీఱు; మీకున శాంతము • మేలుఁగూర్చు
స్వాంతమందుననున్నట్టి • చింతఁ బాపి.

శ్రీహరి కరుణావర్ధనులగు మీకెందున్నను శుభములే గలుగుచుండును. అయినను దినములుఁ దప్పినచ్చినప్పుడు కాలంబున కొదిగి యుండవలయును. ఇంక నొక్కసంగతిఁ గూడ మీకుఁ జెప్పవలసియున్నది.

తే॥ గీ॥ కనుఁబరాకిమిముంటచే • గర్వమూని
సంచరింపఁగ బోకుడు • శత్రుశీలమున
జాగరూకులై యుండుడు • జలమునందు
నగ్ని హోత్రింబునందున • ననఘులార.

ఇంతకంటె నేఁ జెప్పవలసిన దేమియును లేదు. పితృవాక్యపరిపాలన జేయఁదలంచి వారణాసికరుగుచున్న మీరు సుఖముగా మరలివచ్చుటకుఁ బరమేశ్వరుని నశ్రాంతంబును బ్రార్థింపుచుందును. ఒకవేళ దుర్యోధనుం డేవిధమైనను మాయోపాయంబులు మీయెడల బన్నెనేని రహస్యముగ నవ్వార్తల మీ కెఱుంగించుచుండెదను. వాటికిదగిన ప్రతీకారంబుల మీరాలోచించుకొనుచు జాగరూకులై యుండుఁడు.

ధర్మ—

తే॥ గీ॥ నమ్మదో లేదొ గాని మా ♦ నెమ్మనములఁ
దండ్రివలె నిన్ను జూతుము ♦ ధన్యచరిత
యట్లు సేవుము మాదుసౌ ♦ ఖ్యంబు జూచు
చుండెదవ హర్నిశంబును ♦ సింపుపేర్మి.

పితృసమానా ! విదురా ! దయయుంచుము.

అర్జు—దుష్టులగు కౌరవుల పన్నుగడలను కూకటింగింపుము రక్షించు భారము నీయది.

విదు—మీరావిషయమై నేమియు భయంబును సందియంబును బొందవల్లదు. ఇంక నేసరిగెదను. (నిష్క్రమించును)

ధర్మ—మనకు బిత్ర్యసముండును నిరంతరంబును మన శ్రేయస్సు కోరువాడును నగు విదురుండు వచించినపలుకులు వింటిరికదా. కావున మన మతిజాగరూకతతో వారణాసియందు మెలంగవలయును. మరియు నమ్మహాత్ముండు మనయందుండు కరుణంజేసి దుర్యోధనాదులు మనయెడల నెట్టి దుస్తంత్రములనైన బన్నుచుండినచో నయ్యవి సమయమును జూచి యెవ్వరిచేతనైన రహస్యముగ వార్త బుత్తెంచుచుండెదనని చెప్పియున్నాఁడు.

నకు—విదురునిమాటలుచూడగా దుష్టసుయోధనుండేదియైన మాయ మనవిషయమై పన్నునని తోఁచుచున్నది.

సహ—వారెట్టిమాయలుపన్నినను నన్నగారిధర్మంబే మనలను నిరంతరంబును రక్షించుచుండును.

అర్జు—మనకుఁ గాలాతీతమగుచున్నది. నెమ్మదిగా బోవుదము రండు.

(అందరును నడచుచున్నారు)

[తెరలో]

ఓహో! ధర్మచరిత్రులైన యోపాండురాజనందనులారా! పోకుఁడు. పోకుఁడు మేముకూడ మీవెంటవచ్చెదము.

ధర్మ—తమ్ములారా! పౌరులు కాబోలు యాక్రందనము జేయుచు నిట్లు వచ్చుచున్నారు! వీరినెట్లయిన సామవాక్యంబులచేఁ బురంబునకు మఱలిపోవునట్లు జేయవలయును.

[పౌరులిరువురు ప్రవేశింతురు.]

(పాండవులనుజూచి)

ప్రథ—

తే॥ గీ॥ పాండుసుతులార! మిమ్ముల ♦ బాసిమేము
నిల్వఁగాఁజాలమిచ్చోట ♦ నిక్కముగను
జలవిహీనమైయెప్పుడి ♦ సరసివోలె
యొప్పనీపురిమీరు లే ♦ కుంటిరేని.

అక్కటా! దుష్టచరిత్రుడగు దుర్యోధనుడా? మమ్ము పరిపాలించుట ?

ద్వితీ—అయ్యో! పుణ్యమూర్తులగు పాండవులారా! మీ మ్మకారణంబుగ గాశీయాత్రయను నెపమువెట్టి దుర్యోధనుని మాటల నాలించి పురము బాసిపోవునట్లు గావించెనా ?

సీ॥ పెట్టిపోయుమటంచు ♦ బిచ్చమెత్తగలేదు
దయలేకపురినుండి ♦ తరుమనేల
సంపదలిమ్మంచుఁ ♦ జాలగోరనివారి
నీరీతిగావించి ♦ యెగడనేల
జనకుడీతండని ♦ మనముననెంచి నే
వింమవారికిసిట్లు ♦ లెంచనేల

తండ్రిభాగమునకై ♦ దండెత్తి యెఱుఁగని
వారి నీభంగిఁ బం ♦ పంగనేల

తే॥ గీ॥ అక్కటా యంధభూపతి ♦ యాత్మజాతు
కుటిలవాక్యంబులాలించి ♦ కుమతియగుచు
నిట్టికష్టంబులను దెచ్చి ♦ పెట్టినాడె
దాన ధర్మచరితులౌచుఁ ♦ దనరు మీకు.

రాజా! ధర్మతనూభవా! రామ రాజ్యమువలె నుండు నీ పరిపాలనంబున గడుపులో జల్ల కదలకుండ నుంటిమి. మిమ్ములను బాసి మేమీ రాజ్యంబున నిల్వజాలము.

సీ॥ యమదండనకు నర్హుఁ ♦ డౌ యపరాధినిఁ
బల్లెత్తి మాటాడ ♦ నెల్లవైతి
సేవకుండైనను ♦ జెందునో శ్రమయంచు
నేపనిఁ జెప్ప న ♦ హింపవైతి
వీరుండనని విఱ్ఱ ♦ వీగెడి రిపునైన
నెఱ్ఱగాఁ జూచుటే ♦ యెఱుఁగవైతి
భూదేవతాపాద ♦ ముల సేవ నెప్పుడు
మానసవీథిని ♦ మఱువవైతి

తే॥ గీ॥ పట్టి ధర్మమూర్తి వగుచు ♦ నెలరు నిన్ను
బంపుటకు నెట్టులొప్పెను ♦ పార్థివుండు
గర్మమిట్లుండె భువిని న ♦ ఘంబుపండె
సత్యగుణసాంద్ర ధర్మజ ♦ శ్యామతేంద్ర.

మహారాజా! ఇంక బలుమాటలతో నేమి పనియున్నది. ముమ్మాటికిని జెప్పుచుంటిమి. మీరు లేని యీ పురంబున మేముండజాలము. మిమ్ములను గొల్చుచు మీ వెనువెంట నరుదెంతుము. మమ్ము గూడ దప్పక గొనిపొమ్ము.

ధర్మ—పౌరులారా! మీరుధృతరాష్ట్రుని దూషింపనలదు. వారుమాకుఁ జేసిన యపకార మేమియును లేదు. మా తండ్రిగారికిఁ బుణ్యకర్మల జేయుటకు వారణావతంబున కరుగుచున్నాము. అయ్యది పూర్తియైనంతనే సత్వరము నరుదెంతుము. సుయోధనుండు మా యెడల నట్టి బుద్ధిఁబూని యుండెను గాని రాజ్యపరిపాలనంబునందు గడు సమర్థుండు. మాకు దడవగుచున్నది. మేమరిగెదము.

ద్వితీయపౌ—

క్రౌంచపదము.

హా నృపతీ! యాలింపుమిదే నీ ♦ యడుగులఁ గొలచుచు ♦ ననిశముని౯గో
మానకగాశీ వాసముసేయ౯ ♦ మనమ్మున దలచితి ♦ మగణితలీల౯
మానసమందు౯! సంశయమింక౯ ♦ బడగనుదగదిటు ♦ మహితచరిత్రా
దీనజనాధారా! గుణవీరా ♦ తిరముగఁ గొనిజను ♦ దినకరతేజా.

ధర్మ—పౌరులారా! నామాట లాలింపుడు. మీరన్యథా తలంపవలదు. మేము వారణాశి కరుగు కారణంబు మీతో జెప్పియే యుంటిని. మిమ్ము నా వెంట గొనిపోయితినేని మున్నే మామాటలుయన్న నసహ్యపడు సుయోధనునకు మఱింత యాగ్రహము కలుగును. అదియునుగాక పౌరులనెల్లర దనవెంట దోడ్కొనిపోయెనను నిందాభరము నా తలపై బడును. కావున మీరు పురంబునకు మఱలుడు.

ప్రథమ—ధర్మపుత్రా! నీవట్లు వచియింపుచుండ మే మేమనగలము. నీయాజ్ఞ ననుసరించియే వర్తించెదము. పునర్దర్శనంబు త్వరలోనే యగునుగాక! (నిష్క్రమింతురు.)

ధర్మ—తమ్ములారా! ఇక్కడికే యాలస్యమయినది. సత్వరముగా బోవలె రండు. (అందఱును నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

శ్రీ

ద్రౌపదీపరిణయము.

ద్వితీయాంకము.

రంగము:—వారణాసి.

[ప్రవేశము. ఒక బ్రాహ్మణుఁడు.]

బ్రాహ్మ—(తనలో) హా! పరమేశ్వరా! ఎంతలో నెంతపనిఁ గావించితివి. ధర్మపరాయణులై వారణావతంబుననున్న భూసురులకెంత యాధారము కలుగఁజేయుచున్న పాండుతనయుల కకారణమరణంబు గల్పించితివా? ఆ ధర్మపరాయణులను, నా దానవ్రతాచార పారీణులను, నా సత్యసంధులను, నా భవనంబున దగ్ధులగునట్లుజేయ వారు నీకేమి యుపకారమాచరించిరి? (దుర్యోధను నుద్దేశించి) దుష్టదుర్యోధనా! ఇప్పుడు నీ కళ్లు చల్లబడినవా? ఆ పాండవులు నీవు పన్నిన మాయ గనుంగొనలేకపోయిరిగదా. చంచలంబైన రాజ్యలక్ష్మికై యాసఁజెంది యెట్టి దుష్కార్యము గావింపఁజేసితివి. (పాండవుల దలఁచి) హా! పాండుక్ష్మాపాలనందనులారా! మీరిచ్చోట కరుదెంచిన నాటనుండియు బ్రాహ్మణుల తపంబులు పండినవి. మీ దయారసంబున మేము భాగ్యవంతులమై భార్యా బిడ్డలను బోషించుకొనుచుంటిమి. బ్రాహ్మణపక్షపాతులగు మీరు చిరకాలమీ భూమిపై వర్ధిలుదురని తలఁచితిమిగాని యిట్లగుదురని గలనైనఁ దలంపనైతిమి.

మ॥ సకలోర్వీశ కిరీటరత్నరుచి భా • స్వచ్చారుపాదాబ్జులై
సకలద్వీప సముద్రముద్రిత మహీ • చక్రంబు బాలింపు మా
సుకృపన్ దీనులనేలువారనుచు సం • శోషింపుచుండగ; మ
స్తకసత్కౌశిభు మాయలోనునిఁగి క • ష్టా! ప్రాణముల్ వాసిరే.

(ఇంచుక యూరకుండి) నిరంతరమును బరమేశ్వరారాధన తత్పరులగు వారికీతి నంతంబు నందును రాముని సందియము గలుగుచున్నది. (ఆలోచించి) అయ్యో! నేనెంత వెఱ్ఱివాడనై యాలోచింపుచుంటిని. చతుశ్శాలాభవనంబున దగ్ధులైన యేవుర పురుషులయొక్కయు నొకవనిత యొక్కయు కళేబరంబులు స్వయముగాఁజూచియు నిట్లు దలపోయుచుంటిని. అయినను దగ్ధమైపోయిన యా లక్కమందిరంబుకడకరిగి ప్రజలేమని చెప్పుకొనుచుండిరో వినెదనుగాక.

(నిష్క్రమించును.)

[రంగము:—హిడింబాసురుని వనము:—భీమరక్షితులై ధర్మార్జున నకుల సహదేవులు కుంతియు నిద్రింపుచుందురు.]

భీము:—(తనలో విదురుని నుద్దేశించి) ఆహా! విదురా! నీవెంతటి సత్కృపాశాలివి. రిపుపక్షమున నుండినవాడవయ్యును, మాయెడల నెంత ప్రేమఁగనఁబఱచితివి.

తే॥ గీ॥ అంటుకొన్నట్టి యాలక్క • యింటినుండి
భవ్యభవదీయకరుణచే • బయటబడితి
మయ్య కాకయుండిన దుష్టు • దైవకార
వాగ్రజనిమాయఁ దెలియంగ • నగునె మాకు.

నిన్ను నిశ్చయముగాఁ బ్రాణదాతవని చెప్పవచ్చును. ఆనాఁడు నీవు ఖనకునిచే నిట్టివార్త బంపకపోయినను, నాతఁడు మమ్ము రక్షించుటకు బిలంబు సేయక పోయినను మేమిరాపాటికి లోకంబును విడిచిపెట్టవల

సిన వారమగుదుముకదా ? (ఇంచుకయూరకుండి దుర్యోధను నుద్దేశించి) ఓరీ ! దుర్మతీ ! దుర్యోధనా ! ఇట్టి యకార్యము జేయుటకు నీకు మేమేమి యపకారమాచరించితిమి.

తే॥ గీ॥ ఎన్నఁడైనను రాజ్యంబు ♦ నిమ్మటంచు
గాని ; సంపదలిమ్మంచుఁ ♦ గాని నీదు
తండ్రిఁగోరియుంటిమె మేము ♦ ధర్మహీన
యేలచేసితి వీపని ♦ హీనబుద్ధి.

క్రూరుఁడా ! మాయోపాయంబులం జంపనెంచు టదియేటిపౌరుషము. ఇదియేనా నీశౌర్యము. ఎవ్వరైనను నవ్వుదురనియైనను దలంపకపోయితివా ?

శా॥ లేరే పెద్దలు నీకుబుద్ధిఁ దెలుపన్ ♦ లేకుండురే యాప్తులన్
వారింజేరవొ ; ధర్మమార్గనిరతిన్ ♦ వాంఛింపవో ; గానిదో
క్రూరత్వంబుతుబూని చిత్తమున మా ♦ కున్ గీడు సేయంగనే
లా ! రా రాజువుగ్యుడ్వ నీవిటు సను ♦ ద్వ్యద్బుద్ధిహీనుండవై.

ఓరీ ! కౌరవకులపాంసనా ! నీమాయోపాయంబుల విడిచి యెదుటకురమ్ము, కయ్యమొనరింపఁదలంచిన వాడవేని యట్లుసేయుము.

ఉ॥ ఓరిదురాత్మ యీగతి మ ♦ హాోగ్రపుమాయలు సేయనేటికిన్
ఘోరరణంబు సేయుఁగ న ♦ కుంఠితశీలను రమ్మ నిన్ను నున్-
ధారుణిఁ ద్రెళ్ళసేసెదను ♦ తమ్ములతోడనుగూడ ; సర్వభూ
దారులు వీడుచచ్చెనని ♦ తద్దయుమోదము నందునట్లుగన్.

(ఇంచుకయూరకుండి) కాలముదాటుట కెవ్వరును శక్తులుగారుగదా ! (జననీ సోదరులఁజూచి) వీరందఱును సంపూర్ణమైన నిద్రను మునింగియున్నవారు (ధర్మరాజునుద్దేశించి)

మ॥ ధరణీపాల శిరస్తటీముకుటన ♦ క్షత్రాంబురన్ మించు భూ
వరచంద్రుఁడు ; యుధిష్ఠిరుండకట న ♦ భాగ్యంబులం బాసి భీ

కరశార్దూలమృగంబు లెల్లయెడలన్ • గన్పట్టుచుండ్ల సో
దరులంగూడి మునింగె నిద్దురను ధా • తా ! యెంతవ్రాల్వ్రాసితో.

(అర్జునునిఁజూచి)

ఉ॥ దివ్యను శత్రుబృందమును • జెండగజాలిన యస్త్రవేత్త బల్
మవ్వపురూపువాఁడు జన • మాన్యచరిత్రుఁడు సద్గుణుండు నా
కవ్వశితాపముల్ నుఱచి • కంటక సూక్ష్మశిలాతలంబునం
దెవ్విధిఁ బండగాగలిగె • నేనుచిదూరుదు ధాతవ్రాతలన్.

(నకులసహదేవులనుజూచి)

కం॥ ఎండనుగన్నులఁజూడక
నుండెడిమాద్రీవరసుతు • లుగ్రాటవిలోఁ
జండరవంబులఁగోర్చియు
బండిరి దేహములెఱుఁగక • బాల్రంభకతిన్.

(కుంతినిజూచి) ఓతల్లీ ! బలపరాక్రమశౌర్యవంతులగు నేవురకుమారు
ల గల్గియుండియు, నీవెట్టి యిక్కట్లపాలయితివి? ఆహా !

ఆ॥ వె॥ కుంతిభోజుపట్టి • గోవిందు మేనత్త
పాండునృపునిపత్ని • పాపరహిత
మృదులశయ్యలయందు • నిదురవోయెడు దేవి
గాఢసుప్తినందెఁ • గటికనేల.

అక్కటా ! ఎట్టియిడుములబడవలసివచ్చినది. ఇట్లగునని యెన్నఁ
డైనను గలలోనైనఁ దలంచియుంటినా. (దైవమునుద్దేశించి) హా !
ద్వారకావాసా ! కృష్ణా ! దీనచింతామణీ ! నిరంతరము మమ్ము రక్షిం
పుచుండు దాక్షిణ్యశాలివైన నీవుగూడ యిప్పుడు మాయెడల నిర్దాక్షి
ణ్య మేలవహించితివో తెలియకున్నది.

శా॥ దేవా ! మాయెడనీకటాక్షమును బీ్రతింజూపి కాపాడుమా
నీవాత్సల్యముచేత ధారుణిని మా • నేర్పుల్ దిద్ది మా

భావంబందు వసింపుచుండి ఘనతా • పంబార్పుమీ మ్రొక్కెదన్
నీవే దైవమటంచు నుందలఁచినం • ద్రీ! బంధుచింతామణీ.
శా॥ వేదామోదిత విశ్వసంభరిత శ్రీ • వేదాంతవేద్యా హరీ
రాదా! నీదయ మాపయిన్ గుణమణీ • బ్రహ్లాదునింగావగా
లేదా! మున్ను భవత్కటాక్షమునఁ గా • ళిందీమహోవల్లభా
వాదా! మమ్ముల బ్రోవఁగల్గిన మొఁకన్ • భక్తౌఘ చింతామణీ.

కపిరాజవిరాజితము.

ఖలుఁడగు నాధృతరాష్ట్రుపుత్రుఁడు • కల్లఁ జేసిన మాయలనున్
దెలియఁగఁజాలక సుందరమున్ • దివ్యగవాసము సేయగనున్
చలమున నాతఁడు మమ్ములనందఱ • జంపఁదలంపుచు దారికిన్
గమనశీయగ్నిని బెట్టఁకదప్పక • గ్రన్నన జేరితి మిచ్చటికిన్.

ఓ! మహానుభావా! ఆపద్బాంధవా! మాయందు నీకుఁ గరుణ లేక పోయినను కుంతి నీకు మేనత్తయగుటం జేసి, యామెను జూచియైన మమ్ము రక్షింపుము.

విచారలహరి.

దేవ దేవ దేవరా • బ్రోవరమ్ము శ్రీధరా ।
భావమందు నిన్ను నే • గావవేడుచుంటిగా ॥
చిన్ననాటనుండియున్ • వన్నెమీఱఁగొల్వఁగా ।
జన్నెబ్రోవకుంట యు • న్నన్న నీదు దాసులన్ ॥
క్రూరబుద్ధిబూని యా • కౌరవేంద్రుఁడక్కటా ।
ఘోరసంకటంబులన్ • గూర్చుఁడై యొనర్చెడిన్ ॥
వంత మేలనీకు శ్రీ • కాంత! యిప్పుడిట్లు మా ।
చింత వేగఁదీర్పఁగాఁ • జెంతఁ జేరుమా హరీ ॥

(ఇంచుకయూరకుండి) ఆహా! వీరందఱును దీర్ఘనిద్రాపరవశులై యున్నారు. 'నిద్రి సౌఖ్యమెఱుంగ' దను వాక్యము నేటికనుభవమునకు

వచ్చినదిగదా. సప్తద్వీపసముద్రముద్రితమహీసామ్రాజ్య భారంబును దనదోఃపీఠిని నిల్పజాలిన యాధర్మచరిత్రుఁడైన యుధిష్ఠిరుండు తమ్ములతోఁగూడ కఠినపాషాణయుతమైన యీ వట్టినేలయందు తన బాహువులే తలగడలుగాఁ జేసికొని శరీరము మఱచి నిద్రించుచున్నాఁడు. కుంతిభోజునకుఁ గారాబపుపట్టియై, సద్గుణభావుండగు వసుదేవునకు జెల్లెలై, సర్వజగత్కర్తయగు శ్రీకృష్ణునకుఁ మేనత్తయై, భరతకులప్రదీపుడైన విచిత్రవీర్యునకు గోడలై, యరిరాజ భయంకరుండును, విమలగుణుండును, సత్యసంధుండునునగు పాండురాజునకు భార్యయై, దేవతావరప్రసాదంబున జనించిన దుర్వారబలులగు నేవురతనయులకుఁ దల్లియై, యొండకన్నను వానకన్నను నెన్నఁడును నెఱుంగని యీకుంతి యిట్టి ఘోరకాంతారమున శయనించు దుస్థితిబట్టెనుగదా. విధికృత మెవ్వరు దప్పింపఁగలరు? (ఇంచుక యూరకుండి) నాకేమియోగాని దాహము మిక్కుటముగ నగుచున్నది.

"ఉ॥ వాయుతనూజ ? లక్కయిలు • బాపి విపద్దశనందకుండ మ
మ్మాయెడ కెత్తి తెచ్చితివి • యిప్పుడు దాహము గొంటిమయ్య బల్
తోయము లెందునైన గఁడు • దొందరగా గొనివచ్చి బ్రోవుమీ
యాయమడస్పియున్నయది • యాకవలుల్ బిలువంగఁబల్క రే."

అని అన్నగారు వచించియు నిద్రను జెందినారు. అల్లదిగో ఎదుటగా నొక కాసారంబుఁ గనుపట్టుచున్నది. నా దాహముదీర్చుకొని, వలసిన సలిలంబులుఁగొని తెచ్చియుంచెదను. వీరు నిద్రలేచినపిదప ద్రావుదురు.

(నిష్క్రమించును.)

(తెరవాలును.)

రంగము:—హస్తినాపురమున ధృతరాష్ట్రుని మందిరము.

[ప్రవేశము—దుర్యోధనుఁడు:—]

దుర్యో—(తనలో) ఆహా! ‹తానొకటితలచిన దైవ మింకొకటిచేయు› నను పలుకులు సత్యమైనవిగదా. (పురోచనునుద్దేశించి) మిత్రమా! పురోచనా! నీకెట్టివిపత్తువచ్చినది.

తే॥ గీ॥ నాకు నుపకృతిసేయు మ ♦ నంబునందుఁ
దలచి; వారణాసికిఁబోయి ♦ దైవవిధిని
లక్కయింటను దగ్ధమై ♦ సురికినావె
పాండుసుతుల ప్రాణంబులఁ ♦ బాపి సఖుఁడ.

అక్కటా! నీమృతికి నేనే కారణంబుగదా. పాండవుల మరణవార్త నీవు స్వయముగా వినిపించి నాచే సత్కృతిబడయుదువని నిరీక్షింపుచుండగాఁ బిట్టపిడుగునంటి యీవార్త నాచెవినిఁబడెను. అయ్యో! దాయలగు పాండవేయులు మృతినొందినను నీవు లేకుంటచే నాకంత సంతసము గలుగకున్నది.

[కర్ణుఁడు ప్రవేశించును.]

కర్ణు—(తనలో) ఇదుగో! రారాజగు దుర్యోధనుం డిచ్చటనే యున్నవాఁడు.

(సమీపించును.)

దుర్యో—మిత్రమా! కర్ణా! అరుదెంచితివా!

కర్ణు—నీకై నీమందిరంబున కరిగితినిగాని యచ్చటలేకుంటచే నిట్లు వచ్చితిని. (ఇంచుక యూరకుండి) కౌరవేశ్వరా! నీవు ఖము నేఁడేలనోగాని విచారమున కాటపట్టయియున్నట్లు గానిపించుచున్నదే. కారణం బడుగవచ్చునా.

దుర్యో—మిత్రమా! ఏమనిచెప్పుదును?

తే॥ గీ॥ పాండవుల నెట్టులైనఁ జం • పంగఁదలఁచి
లక్కయిల్లు నిర్మించిన • యొక్కలీఁడు
మన పురోచనుఁడు; సఖుఁడు • మాన్యగుణుఁడు
పావకజ్వాల లందున • భస్మమయ్యెఁ.

కర్ణ—ఏమీ! పురోచనుం డగ్నిహోత్రునకు నాహుతియయ్యెనా! అదియెట్లు.

దుర్యో—లక్కయింటి కగ్నిఁబెట్టి తప్పించుకొనలేకపోవుటచే మడిసెనని తలంచెదను.

కర్ణ—పాండవుల సంగతి యేమైనది.

దుర్యో—వారునుఁ బురోచనుని మార్గమునే బట్టిరి.

కర్ణ—అక్కటా! పాండవేయులు మడిసిరా? (ఇంచుక విచారించును)

దుర్యో—మిత్రమా! పాండవుల మరణము నీకు విచారంబును గొలుపుచున్నదా!

కర్ణ—

తే॥ గీ॥ వారు నీమూలముననాకు • వైరులయ్యు
నేమి కారణంబోగాని • యెఱుఁగఁజాల
వారిజూచిన సోదర • భావమమరె
నందుచేతను యొక్కింత • డెందమందు
చింత జనియించె నాకును • క్షితిత లేంద్ర.

(తనలో) ఏవురు పురుషులును నొక్క వనితయు నా చతుశ్శాలా దావానలజ్వాలల దగ్ధులైరని వింటిని గాని యా మరణించినది యింక నెవ్వరో యై యుందురు. నిరంతర శ్రీకృష్ణ కృపావర్ధిష్ణులగు వారి కపాయంబులు వాటిల్లునని నాకు దోచదు. ఆ భీముండీ సుయోధనుని

కన్న గడు మాయోపాయ దురంధరుఁడు. వాసుదేవుని దయచే వారీపాటి కెక్కడనో సురక్షితులై యుందురనియే నానమ్మకము.

దుర్యో—మిత్రమా! నీదెంత దయార్ద్రహృదయమోయి. శౌర్యవంతులకిదియేనా లక్షణము. ఇట్టివాడవు సంగరంబున నేవిధంబునఁ జరింతువో తెలియకున్నది.

కర్ణు—కరుణ గలిగినవానికిఁ బగవాఁడు మడిసెనన్నను జాలిపుట్టునుగదా. కొండొక కారణంబున మీకును వారికిని వైరముగల్గినను మీకుఁ బినతండ్రి పుత్రులుగదా.

దుర్యో—తే॥ గీ॥ సంతసంబున నుండెడి ♦ సమయమందు
జిత్తమందునఁ జింతను ♦ జేర్చెదేల
నేల నిష్కంటకంబుగ ♦ నేలవచ్చు
గాదె చిక్కు జింతయులేక ♦ కర్ణ! మనము.

మఱియును క్షత్రియులు రాజ్యలాభంబునకై వారు వీరను భేదము మనమున నుంచుకొనకుందురు. మాయోపాయముచేతగాని పరాక్రమముచేతగాని, రాజ్యము సంపాదించుట రాజుల కుచితకార్యమని నీవెఱింగియుండవా!

కర్ణు—గతించినదానికై యిప్పుడీ చర్చయేల? పాండవుల మరణంబును గూర్చి మీతండ్రిగారికిఁ దెలిసినదా.

దుర్యో—ఇంతవఱకునుఁ దెలిసినట్లు దోఁచదు. అయినను దెలియకదాగునా! ఒకసారి తండ్రిగారికడకరిగి వచ్చెదను. అక్కడ సమస్తమును దెలియఁగలదు. (నిష్క్రమించును)

(తెర లేచును.)

[ధృతరాష్ట్రుఁడు భీష్ముఁడు దుర్యోధనుఁడు ప్రవేశము]

ధృత—వత్సా! దుర్యోధనా! వారణావతంబునుండి పాండవుల కుశలవార్తలేమయిన వచ్చుచున్నవా!

దుర్యో—(తనలో) ఈతఁడింకను పాండవుల మరణమును వినలేదు. నెమ్మదిగా నదియే బయలుపడవలయునుగాని నేను మాత్రము చెప్పరాదు. (ప్రకాశముగా) ఇంతవరకును నేవార్తయును వచ్చినట్టులేదు.

ధృత—ఏటికోగాని నా యెడమకన్నును నెడమ భుజంబును నదరు చున్నది.

భీష్మ—

తే॥ గీ॥ కొడుకు మాటల నాలించి • క్రూరమైన
బుద్ధి బూని నీవును గడు • బుణ్యమతులఁ
బాండవేయులఁ గాశికి • బంపినావు
రాజ్యమును గొందునంచును • రహిఁదలంచి.

నీతమ్ముఁడైన పాండురాజు నీకై యెన్ని కష్టంబులనోర్చి వైరులను జక్కఁడచి యెంతయో ధనముదెచ్చి యనేక యాగంబులు జేయించి తుదకు శాపవశంబున మరణమందినాఁడు. అట్టి యెడలఁ దమ్ముని పుత్రులనియైనను దలంపక వారిని రాజ్యంబునుండి వెడలనడపితివి. నాకెందుకని నేనూరకొంటిని.

ధృత—మహాత్మా! మన్నింపుము. తెలిసియో తెలియకనో చేసినాను ఇంక వారి నిచ్చటికి మరల రావించెదను.

దుర్యో—(తనలో) బ్రతికియున్నగదా వారిని రావించుట.

సేవ—(ప్రవేశించి) దేవా! వారణాసినుండి ఖనకుఁడరుదెంచి భవద్దర్శనార్థమై వేచియున్నాఁడు.

ధృత—శీఘ్రముగ లోనికి రానిమ్ము. పాండవుల కుశలవార్త నాలింప నాచిత్తము తత్తరమందుచున్నది.

[ఖనికుఁడు ప్రవేశించును.]

ఖని—(తనలో) పాండవులను సుఖముగా బిలమునుండి తప్పించితిని. వారిపాటికి సుఖముగా నెక్కడనో జేరియుందురు. వారణాసి యందుఁ బాండవులును గుంతియు మరణించిరని చెప్పుకొనుచున్నారు. కానిమ్ము, యిదియు నొక మేలే. బ్రతికియున్నారని తెలసినచో నీ దుష్టుండగు కౌరవేంద్రుండు మఱియొక మాయ బన్నును. కావున వారు గతించిరనియే చెప్పెదను. (ప్రకాశముగా ధృతరాష్ట్రుని జూచి) మహారాజా వందనములు.

ధృత—ఖనికా! నీవు వారణాసినుండియే వచ్చుచుంటివా!

ఖని—అవును.

ధృత—పాండవులచ్చట క్షేమంబుగ నుండిరా!

ఖని—అచ్చట పాండవు లెచ్చటనున్నారు?

భీష్మ—ఏమి! పాండవు లచ్చటలేరా!

ధృత—దేవా! ఏమియు నెఱుగనట్లు పలికినచో నేమి చెప్పుదును. రాజాగ్రణీ! నీవు నన్ను వధించినను భయుంబందువాడనుగాను.

దుర్యో—ఖనికా! ఎందుకీ యనవసరప్రసంగము? చెప్పఁదలంచిన దేదియో క్రమముగాఁ జెప్పుము.

ఖని—అయ్యా! ఎవ్వరును నేమియు నెఱుంగన ట్లడుగుచుండుటను జూచి నేనిట్లంటిని. ఓ ధృతరాష్ట్రమహీపాలా! పాండవుల నేమంబుగ నెట్లుందురు.

ధృత—పాండవులు క్షేమంబుగలేరా!

భీష్మ—ఖనికా! ధర్మపరాయణులగు పాండురాజ తనూజులు క్షేమంబుగలేరా! అది యేదియో సత్వరముగఁ జెప్పుము. చిత్తము సంతాపమందుచున్నది.

ఖని—అయ్యో! వారి దుర్వార్త చెప్పుటకు నోరాడకున్నది. అయినను మీరింతకు బూర్వమే వినియుందురేమోయని యూహించెదను.

ధృత—"యొరసిన పుండుపై యుప్పు" బెట్టినట్లు పాండవుల కుశలంబు వినుటకు తొందరపడుచున్న నాహృదయంబునకు నీవింత సంతాపమేల కలుగఁ జేసెదవు.

ఖని—దేవా! రాజ్యమపహరింపఁ దలంతురేమోయని సద్గుణమూర్తులయిన పాండుకుమారులను నిలువెళ్లఁగొట్టితివి. అంతియేగాక నీతనయుఁ డొక లక్కయిల్లు నిర్మించినాఁడు. మీచే నిర్మింపఁబడిన మాయ లక్కయింటఁబడి యా పాండవులు దగ్ధులైరని చెప్పుటకెంతయుఁ జింతనొందుచున్నాను.

ధృత—భీష్మ—హా! (అని మూర్ఛిల్లి లేచుచున్నారు.)

దుర్యో—అక్కటా! ఖనికా! పాండవులీ లోకంబును విడిచి స్వర్గ సౌఖ్య మందబోయిరా!

ఖని—మీ దయచే వారికట్టిగతి ప్రాప్తించినది. మహారాజా! నీకోరిక నెఱవేఱినది. ఇంక నీవు నిష్కంటకంబుగ ధరావలయంబు బరిపాలింపవచ్చును. పాండవులేమిసేయుదురో యను భయము నీకిక నవసరము లేదు.

ధృత—(దుర్యోధనునిజూచి)

తే॥ గీ॥ పరమ పావనచరితులౌ ♦ పాండుసుతులఁ
బంపితిని నీదు మాటపై ♦ వారణాసి
వారి నచ్చోట బావక ♦ జ్వాలలందు
గూలునట్లుగ జేసితే ♦ కుమతి వగుచు.

ఓరీ! దుష్టుఁడా! ఎంత కార్యమును జేసితివిరా! పాండవుల మరణంబునకు నేనేగదా కారణభూతుండను.

తే॥ గీ॥ ఇట్టి మాయబన్నితివని ◆ యెఱుఁగలేక
బంపితిమి నీవిట్టి ◆ పాతకంబు
సలిపినాడవు; వారలు ◆ సమసినారు
నేనె కారణంబైతిని ◆ హీనచరిత.

దుర్మార్గా! ఎంతపని చేసితివిరా! విషపూరిత మనుష్యుండవని తెలియక మోసపోయితిని. ఆ పాండురాజుకంటె నాయందు భక్తి ప్రేమలు బూని సేవించు పాండుసుతుల మరణంబు నాలించియు హృదయము బ్రద్దలుగాక నిలచి యున్నది. కటా! ధాత దీనిని లోహముతో నిర్మించెను గాబోలు. (భీష్మునిఁ జూచి) తండ్రీ! వింటివా!

భీష్మ — వినకేమి! ఈవిషయమై నేనేమియు మాట్లాడరాదని మొదటనే యూరకొంటిని. కానున్నదో హీనగుణుండును, నొకరి బాగుఁ జూచి యోర్వలేనివాఁడును నగు నీ సుయోధనుండు చెప్పినంత మాత్రమునచే పాండవులను పురినుండి నడిపితివి. సర్వస్వతంత్రత గలిగియున్న నీ కొరులేల చెప్పవలెను. "నే పాండవుల బంపనన్నచో" ఈ దుర్మార్గుఁడేమి చేయగలుగును. ఇటువంటి వానిని జంపినను పాపములేదు. కులము నిర్దోషమగును. (దుర్యోధనుని జూచి) పాపకర్మా! ఎంతటికార్య మాచరించితివిరా! దుర్మార్గా! నీ ముఖంబు జూచినఁ బంచమహాపాతకంబులును గలుగును. పాండవులను జంపించిన పాపము మిమ్ముల గట్టిగుడువక మానదు. కులవృద్ధుఁడగు నన్నుఁగూడ వీక్షింపక నిట్లుగావించితివి. ఇంక మీకు జయంబు గలుగునను మాట కలలోనిది. మిమ్ములను కులనాశనకారణులని తలంప వచ్చును. కులము నాశనము జేసికొనుటకే యిట్టి పాపకార్యము జేసినాఁడవు. ఛీ! మీమెదుటను నుండరాదు. (నిష్క్రమించును.)

ధృత—(సుయోధనుని జూచి) కుమారా! భీష్ముండు వెళ్ళిపోయెనా యేమి? ఈతనికాగ్రహము వచ్చినదే. అక్కటా! నేనే స్వయముగా తెచ్చిపెట్టుకొంటిని. (తనలో) నేనిప్పుడేమయిన నంటినా, యీతనికాగ్రహమువచ్చును. (తనలో) ఇవ్విషయమై ద్రోణ కృపాదులతోఁగూడ యోచించి పాండవులకు దగిన కర్మల జేయవలయును. (నిష్క్రమించును.)

సుయో—(తనలో) ఇప్పుడు నాకు సంతోషముకలిగినది. పితామహ ద్రోణాదులు నన్ను దూషించినను నేను లక్ష్యపెట్టకయుండినచో వారేమిసేయఁగలరు. (నిష్క్రమించును.)

ఖని—(తనలో) పాండవుల మరణంబు నిజమనియే ధృతరాష్ట్రుఁడు నమ్మెనుగదా. సుయోధనుండు సంతసించుచుండెను. కానిమ్ము. ఇదియునుమంచిదే. (నిష్క్రమించును.)

రంగము—హిడింబాసురుని వనము.

[కుంతి, ధర్మార్జుననకుల సహదేవులు నిద్రించుచుండగా భీముఁడు ప్రవేశించును.]

భీము—(తనలో) ఇంకను వీరు నిద్రలోనే యున్నారు. (ఇంచుక దూరమునుండి నలుదిక్కులు గలయఁజూచి)

మ॥ అకటా వాకిలి యొత్తుగానలికి న ♦ ట్లాకాశమునఁ మబ్బురి
మ్మ్రోనన్ ధాత్రికి దిగ్గుతారలనఁగాఁ ♦ బుష్పాల్ ప్రకాశించెడున్
మెకముల్ భీతిని గోల్పడెయురవముల్ ♦ మొదమెయ్యని వ్రోచ్చట; మా
కిక నేదారియుఁ దోచదాయెగద లా ♦ కేశా! యశోదాసుతా॥

భగవంతా వాసుదేవా! అన్నింటికిని నీవేయున్నవాడవు. మమ్ము రక్షించుభారంబు నీయదియైయున్నది. (సోదరులనుజూచి) వీరంద

రును నిద్రలేచువరకును వీరికేహానియుఁ గలుగకుండ గదాధరుండనై రక్షింపుచుందును.

(తెరలో)

అల్లాల్లా! అల్లల్లా! అలఅల! అలఅల! సోదరీ! హిడింబీ! నేడు మనవన సమీపంబున కెవ్వరో నరులరుదెంచినారు. నీవు సత్వరమ్ముగ నరిగి వారలను వధించి నాకు రుచికరముగా వండిపెట్టుము.

భీము—ఏమిది! ఎవ్వడోకదా దైత్యునివలెనున్నాడు. ఇయ్యది రాక్షససంచారమగు భూమికాబోలు. అక్కటా! తెలియక మేమింగుఁ బ్రవేశించితిమి. దైత్యార్భటంబు లధికమగుచున్నవే. సరే! దీనికాలోచింపనేల! భయమందనేల? యమగదాదండంబును మించినగదాదండము నాయొద్దనేయున్నదిగదా. ఎట్టిమ్మొక్కడి రక్కసులువచ్చినను నొక్కపెట్టున జక్కడచెద.

(తెరలో)

అగ్రజా! నీయాజ్ఞ ననుసరింపుచున్నాను.

హిడింబి—(ప్రవేశించి) ఓరోరి! దుష్టమానసులారా! మావనంబునఁ జొచ్చిన మీరెందుబోఁగలరు. మీరందరును నేడు మాకాహారమగుదురు. (భీమాదులమీదికి రాబోవును.)

భీము—(తనలో) ఇదియొకరాక్షసి. అబ్బా! ఏమి దీనిభయంకరరూపము. ఎట్లయినను దీని నిప్పుడు జంపి రాక్షసభయంబును మాన్పవలయును. (ప్రకాశముగా)

ఓ రక్కసీ! దూరముగానిల్వుము. ప్రాణంబుల కాశించితివేని పైకిరమ్ము. గదాధరుండగు భీముండిచ్చటనున్నాఁడని తలంపుము.

హిడిం—(భీముని తేఱిపాఱఁజూచి) ఆహా! మొదట వీనినిఁజంపుటకు నాగ్రహోద్యత్తచిత్తనయి యరుదెంచితిని. కాని యిప్పు డీతని

హిడింబుని జూచినంతనే వీనిని వధించుటకు నాచిత్తము స మ్మతింపకున్నది. భళిరా! ఏమి! ఈపురుషవరేణ్యుని సౌ యగము.

ఉ॥ చేరలనేలగాఁదగిన ♦ చిన్నికనుంగవఁ గాంచినంత ల
క్ష్మీరమణీవతంసము వ ♦ సించెడుభంగినిఁదోఁచు, మోము నా
యాశ్యరముజ్జాడ బూర్ణశశి ♦ యందము నేలును; నెవ్వఁడోయితం
డారయఁ; జూచినంత వశ ♦ మయ్యెను నామది యేమిసేయుదున్.

ఇట్టి సుందరమూర్తిని నే నెచ్చటను విలోకించియుండలేదు. ఈ తనినిఁజూడగనే నాచిత్తం బీతనిపైకిఁ బోవుచున్నది. మదనుండదయుఁడై తన పసనైపశరంబులు నాహృదయంబున నాటఁబఱుపుచున్నాఁడు. విరహామగ్గల మగుచున్నది. ఈతని కూటమింగలియక నెక్కింతకాలమైనను దాళఁజాల. (ఇంచుక యూరకొని) ఇప్పుడు నే నీరూపంబుతో నీతనికడఁ జేరితినేని వికృతరూపమును జూచి రాకసియని నన్నుఁ జేఁబట్ట నిరాకరించును. కావున నా ఖేచరీవిద్యాప్రభావంబున దివ్యసుందరినై యరుదెంచి యాతనిచిత్తమును మోహసాగరంబున ముంచి నాయభీష్టంబు దీర్చుకొందునుగాక. (నిష్క్రమించును.)

భీము—ఇదియంతయు రాకసమయమైన యరణ్యమువలెనున్నది. సోదరులును దల్లియు నిద్రలేచినపిమ్మట వేరొండుస్థలమునకరుగుట యుచితమని తోఁచుచున్నది. దివములు తప్పివచ్చినప్పు డెట్టి సంకటంబులు ప్రాప్తించునో! నేనుమాత్రి మెళకువగనుండినై వీరిని రక్షింపుచుండవలయును.

[హిడింబి సుందరరూపంబునఁ ప్రవేశింపుచున్నది.]

భీము—(హిడింబినిఁజూచి) ఈయర్ధరాత్రిసమయంబున నొంటరిగా నవ్వరో కాంతాతిలకం బిట్లువచ్చుచున్నది. ఈమె యెవ్వరై

యుండవచ్చును. ముల్లోకంబులను తన వీక్షణంబులచేత మోహంబున ముంచివేయఁజాలిన యీ సుందరాంగి యెవ్వరిచేతనైన బాధింపఁబడలేదుగదా !

హిడిం—(తనలో) ఈపురుషపరేణ్యుం డిచ్చటనే యున్నవాఁడు. ఇంక నేను సందియంబందనేల ఈతనిని సమీపించెదగాక. (భీముని సమీపించి) మహాపురుషా !

తే॥ గీ॥ ఎవ్వరవో గాని నిన్ను నే • నెఱుఁగనైతి
నార్తనై మ్రొక్కుచుంటిని • నధికభక్తి
నాయభీష్టముఁదీర్ప మి • నంబునందు
కరుణదాల్చుముదప్పకఁ • గలుషదూర.

భీము—(తనలో) ఈమె యిచ్చటి కొంటరిగా వరుదెంచుట • కేమికారణమో! నాకీమె మ్రొక్కి యభీష్టముఁదీర్పుమని కోరుచున్నది. ఈమె యభీష్టమెట్టిదో అయినను అడిగెదనుగాక. (ప్రకాశముగా)

మ॥ తరుణీ ! యెవ్వతెవీవు; యీకరణి రా • త్రింబందు నిచ్చోటకే
వరుదేరన్ బనియేమి; నన్నుఁ గని సం • ప్రార్థింపగానేల ; త
న్పరులెవ్వారలునైనఁ గ్రూరులయినన్ • గారించిరో కానిచోన్
సరగన్ జెప్పుము భీష్టమేదో వినఁగన్ • గౌతూహలంబయ్యెడిన్.

హిడిం—మన్మథసమానసుందరా !

త ర ల.

కలదునామది నొక్కకోరిక • కామసన్నిభరూప ; నీ
వలనఁగాదని యంటవేనియుఁ • బ్రాణముల్ ధరవీడగాఁ
దలఁచివచ్చితి నమ్ము మీనను • తథ్యముల్ వచియింతు; సం
కలుషు పేర్మిను దీర్పుమీ యది • యార్తనై నినుఁ గోరితిన్.

భీము—(తనలో) ఈమె యభీష్టమెట్టిదియై యుండునోగదా. (ప్రకాశముగా) రమణీ! సందియమందెదవేల. చెప్పుము.

హిడిం—ఓమహానుభావా! చల్లకరుదెంచి ముంత చంకనుబెట్టినందువలనఁ బ్రయోజనమేమున్నది. నేనీవనంబున కధికారియగు హిడింబాసురుండను దైత్యునకు సోదరిని. నాపేరు హిడింబి. నాయగ్రజుండు నన్నుగని మన వనంబునకు నరులెవ్వరో యరుదెంచిరికావున వారిని వధింపుమని యాజ్ఞనీయ మొదట నే నిచ్చోటి కరుదెంచితిని. నీ సుందరవిగ్రహంబు జూచినయంతనే చిత్తము మాఱిపోయినది. మన్మథుం డించుకయైనను గరుణలేక దన పుష్పశరంబులు నాపైఁ జిమ్ముచున్నాఁడు. ఇంక నీవు నన్నుఁ దప్పక గరుణింపవలెను.

భీమ—(తనలో) దైత్యయువతికి యిట్టి రూపురేఖావిలాసంబులుండుట యెచ్చటను జూడలేదు.

తే గీ॥ ఇట్టి నడిరేయి యందున ◆ నిట్టిరూపు
దాల్చి యరుగుదెంచినయట్టి ◆ తరుణిఁజూడ
మనము చలియింపదే యెట్టి ◆ మునులకైన
మనుజులనుగూర్చి యింక జె ◆ ప్పంగనేల.

కాని నాచిత్తంబునుమాత్ర మించుకయైనను జలింపనీయకూడదు.

హిడిం—వీరపురుషా! నీవు నన్నుఁగూర్చి యేదియో సందియంబందుచుంటివి. ఆలస్యమున కీయువిద తాళజాలదు. నాయభీష్టము దీర్చితివేని నావలన నీ కనేక సాయంబు లొనఁగూడును.

భీమ—స్త్రీవగు నీవలన నాకుగలుగు సాయంబెట్టిదియో చెప్పుము.

హిడిం—ఈ వనంబునకెల్ల మదీయసోదరుండగు హిడింబాసురుం డధిపతి. మీరాక నాతఁ డెఱింగెనేని, మిమ్ములనందఱ నొక్క

పెట్టున వధించును. ఈనిద్రబోయెడివారిజోలి నీకేల. వానివలన నీ కేయపాయంబును లేకుండ నిన్ను దూరముగాఁ గొనిపోయి రక్షించెద.

భీము—ఓ వెఱ్ఱిదానా! మీయన్నసంగతిఁ జెప్పి నాకు భయంబు గొలుపఁజూడకుము.

తే॥ గీ॥ అష్టదిక్పాలకులఁగూడి ♦ యమరభర్త
యరుగుదెంచునుగాక ఘో ♦ రాజియందు
భయము నిసుమంతఁ జెందను ♦ వడఁతి! వినుము
దైత్యవల్లభు మాటను ♦ దలఁపనేల.

ఇదియా నీవు చేయనెంచిన సాయము. ఇంతియేగదా. ఒకవేళ నేను నీయన్నయగు హిడింబాసురునికి భీతిల్లుదునని తలంచితివేమో. అట్లెన్నటికిని దలంపకుము. చతుర్దశభువనంబులును నొక్కపెట్టున నెత్తి వచ్చినను పోరాటంబునకు వెనుదీయక వైరిబృందంబును మదీయచండ గదాదండంబుచేఁ బిండిపిండిగఁ గావించెదను. (ఇంచుక యూరకుండి) అదియునుగాక నీకై యీమాతాసోదరులను విడనాడి రమ్మనుచుంటివి. ఇదియేటిమాట. దైత్యాంగనవగు నీపొందును గాంక్షించి తల్లిని సోదరులను విడనాడుదునని తలఁచితివా!

హిడిం—వీరాగ్రేసరా! తెలిసియో తెలియకనో పలికిన పలుకుల మన్నింపుము. మాయన్న కంటబడకుండ మిమ్మందరిని నిఁక నేవోకచోటికి దీసికొనిపోవుదును. నాయభీష్టము దీర్పుము.

భీము—నీవు మాంసాశనివి. నేను సుక్షత్రియవంశసంభూతుండను. నీకును నాకును మైత్రి యెట్లగును. ఇంక నీమాటలఁ గట్టిపెట్టి నీయన్నతో నివ్వనంబున నరులున్నారని చెప్పుము. ఆతఁడా మాటల నాలించి యరుగుదెంచెనేని నిమిషమాత్రంబున నాతనిప్రా

ణంబుల గొని వనమున బాంధవులు నిర్భీతిగ సంచరించునట్లు గావించెద.

హిడిం—అగ్రజుని నీవు వధించుటకుఁగూడ నేను విచారింపను. నీవాతని జంపినను సరే. నాయిష్టము మాత్రము దీర్పుము.

ఉ॥ గారమునీయెడన్ మిగుల ♦ గాసిడి వాదును నగ్రజున్ దిర
స్కారమొనర్చి నిన్ను విభు ♦ గావరియింపగ వచ్చినాను; భూ
దారకులాబ్ధిపూర్ణశశి! ♦ తప్పకనాదగు కోర్కెఁదీర్పుమం
సారయశంబు జేకుఱును ♦ సర్వశుభంబులు మిమ్ము జేరెడిన్.

నేను దైత్య యువతినని సందియుంబందవలదు. నేను కామరూప సంచారిణి. ఎప్పుడేయేరూపము గావలయునో యట్టిది తప్పక దాల్పగల సామర్థ్యమున్నది. ఇదియుంగాక నన్ను నీవు స్వీకరించితివేని నావలన నీకుఁ బెక్కు కార్యములగును.

భీమ—(తనలో) ఆహా! ఈకోమలి వాక్యంబులు నాచిత్తంబు నెంతయుఁ జలింపఁజేయుచున్నవి. ఇక్కాంతామణి నను వరునిగాఁ జేకొనఁదలంచి యగ్రజుని విడిచి వచ్చినదఁట. అతని వధకుఁ గూడ సమ్మతింపుచున్నది. (ఆలోచించి) అవును. ఇం దాశ్చర్యమేమున్నది. విదర్భరాజనందనయగు రుక్మిణియు కృష్ణుని బెండ్లియాడఁదలంచి, యిరువురకు నడ్డమువచ్చిన యామె సోదరుని కృష్ణుండు పరాభవించినప్పు డుపేక్షింపలేదా.

హిడిం—మహాత్మా! యోచింపుచుంటివేమి! అన్నము పెట్టవచ్చినప్పుడు నిరాకరించువాఁడెవ్వడైన యుండునా! మార్గవశమునఁ బోవు సమయంబున చేతికిదొరకిన ధనంబు నెవ్వఁడైన బారవేయునా! తనంతతాను వలచి వచ్చిన చేడియ నుపేక్షించుట నీకు ధర్మముగాదు. ఈ జన్మంబున నాకు నీవే మనోహరుండవని తలంచి వచ్చితిని.

మ॥ కరుణన్నీవు కృపారసంబొసఁగి నన్ గాపాడి రక్షింతువో
స్మరుఁ డేపట్టున వేయు బాణముల నన్ జావంగ వీక్షింతువో; సుం
దరా! నీ చిత్తము నాదు భాగ్యము నిఁకన్ వాదంబేల నేనన్యథా
శరణం నాస్తి యటంచుఁ జేరితిని మాం సంరక్షయం చిట్టులన్.

[తెరలో]

ఓసీ! హిడింబీ! ఆనరకీటకంబులను వధించి తీసుకొని రమ్మని నేను చెప్పి పంపగా, నా కార్యము మఱచి యీ పురుషునితో నవ్వియో సరస సల్లాపంబులు గావించుచుంటివా! ఏమే! నీ ధైర్యము ఇదిగో వచ్చుచున్నాను.

హిడిం—ఓ! బలశాలీ! రక్షింపుము. రక్షింపుము. మా యన్న దండతాడిత మహోరగంబు కరణి మండిపడుచు వచ్చుచున్నాఁడు. నన్నింక బ్రదుకనీయఁడు.

(భీముని పాదములపై బడుచున్నది.)

భీమ—కల్యాణీ! భయమందకుము. నీయన్నయగు నా మృక్కడిరక్కసుని నిమేషకాలంబులో నంతకునివీటి కతిథిగాబుచ్చివచ్చెదను. ఆతండిక్కడ కరుదెంచెనేని మా సోదరుల నిద్రకు భంగము గలుగును. నేను వచ్చువరకును నీవు వీరి నతిజాగరూకురాలవై యరయుచుండుము.

(నిష్క్రమించును.)

ధర్మ—(అదరిపడి లేచి) ఏదియో యొక భయంకరమైన ధ్వని నాకిప్పుడు వినవచ్చినది. ఇది యేమైయుండును. ఇప్పుడు వినవచ్చిన యీ భయంకరారావంబునకు నా జననీసోదరులేమియు భయమందక నిద్రింపుచునేయున్నారు. ఇదియునొకమేలే. ఆలాక్షాగృహదాహంబునుండి భీముండు మమ్ములదప్పించి యుచ్చోఁ

జేర్చియున్నాఁడు. వీరందఱును మార్గాయాసంబున మిగుల డస్సి మేనుల మఱచి నిద్రింపుచున్నారు. అహహ! నాతమ్ములెట్టి ప్రదేశమునందు శయనించినారు!

సీ॥ ఒరులకును గీడుల • నొనరింపఁగాఁబోరు
పరయువతులపైన • భ్రాంతిఁగొనరు
స్వప్నంబునందైన • సత్యంబుదప్పరు
న్యాయమార్గంబు నె • న్నండు విడరు
పృథ్వీసురులసేవ • విడనాడ నెంచరు
సేవకాళిని శిక్ష • సేయఁబోరు
పెద్దలతో నెప్పు • డుద్దికాండ్రై యుందు
రితర సంపదలకు • నీర్ష్యజెంద

తే॥ గీ॥ రట్టి సుగుణచరిత్రులౌ • ననుజులకట
కంటకపరీత మైనట్టి • కటికనేల
నిద్రపోవుచు నున్నారు • భద్రముగను
ధాత వ్రాసిన వ్రాలును • దాటఁ దరమె॥

(తల్లినుద్దేశించి) హా! తల్లీ! నీవు మహాసుకుమారాంగివి. ఎప్పుడును నంతఃపురంబునందనేకవేల దాసీజనంబులు బరిచర్యలు సలుపుచుండ సౌఖ్యంబు గాంచుచుండెడిదానవు. అట్టి నీకు మా మూలంబున నిట్టి సంకటంబులు ప్రాప్తించినవిగదా.

[illegible] ధిగతియుంపగా భువిని • ప్రాణముబాయక యెట్టులెట్లొ యీ
సుతులను జూచుకొంచు మది • శోకము మిగ్రఁగి విరోధి నీమనా
యతమతిఁజేరి కాలమును • నట్టులబుచ్చుచు నుండఁజూచి దు
ర్మతియగు నాసుయోధనుఁడు • మాకిటు జేయగనెంచె నెగ్గులన్.

ఆ దుర్మార్గుడయిన దుర్యోధనుఁడు మసల నందఱ లాక్షాగృహంబునఁ దగ్ధులుగాఁజేయఁ దలంచెను గాని నీకడుపు చలవచే మేము

బ్రతికితిమి. నీవును సుఖంబుగ నుంటివి. మనల నందరను భీముం
డీ స్థలంబునకు సుఖముగాఁ జేర్చినాఁడు. (ఇటునటుఁ జూచి)

తమ్ముఁడా! భీమసేనా! భీమసేనా! ఏమిది పలుకవు. (శయ్యా ద
గ్గరకరిగి చూచి) ఏమిదీ! భీముఁడు గనుపింపఁడే. ఏమాయెనోగదా.
ఎన్నఁడును మమ్ము విడనాడి యెచ్చటికినిఁ బోయి యెఱుంగఁడు. ఇట్టి
నట్టడవిని మమ్ము విడిచి యితఁడెచ్చటికిఁ బోయి యుండును. హా! త
మ్ముఁడా! వాయునందనా! మాతో గడగండ్ల గుడువలేక మమ్ము విడి
చి నీదారి నీవు చూచుకొంటివా! (విచారించును.)

హిడిం—దేవా! మీతమ్ముఁడగు భీముఁడీ ప్రాంతంబునందున్న హిడిం
బాసురుండను మృక్కిడి రక్కసునితోఁ బోరుసల్ప నరిగినాఁడు.
ఇప్పుడే రాఁగలఁడు. ఆతఁడరుదెంచువరకును మిమ్ముల రక్షిం
పుచుండుమని నాకాజ్ఞాపించినాఁడు.

ధర్మ—తండ్రి! భీమా! నీకింత సాహసమేలనోయి. మమ్ముల నెవ్వరి
నయిన సాయంబుగొనిపోవక యొంటిగా దైత్యునితోఁ బోరా
డనేల నరిగితివి. నీవు మరల నరుదెంచి నా కన్నులకు విందు
గూర్చు భాగ్యము నేను నోచితినా.

(కుంతి నిద్రనుండి లేచును.)

కుంతి—కుమారా! ధర్మనందనా! ఏవియో భయంకరార్భాటంబులు
వినవచ్చుచున్నవి. ఇది రాక్షస సంచారంబుచే నొప్పుచుండెడి
భూమి కాఁబోలు. మన భీముండేడి ?

ధర్మ—తల్లీ! ఆతఁడీ ప్రాంతంబుననున్న హిడింబాసురుండను దానవుని
తోఁ బోరొనర్ప నరిగినాఁడఁట.

కుంతి—అక్కటా! భీమసేనా. ఒంటిగా నరిగితివా. తనయులారా!
భీమన్న కెట్టిహాని కలుగునోకదా. నాచిత్తంబున ధైర్యమ్మా
గక యున్నది.

ధర్మ—జననీ ! నీవు భీముని సంగతి నెఱింగియుండియు నీరీతి విచారపడె దవేల ? (అర్జునుని జూచి) అర్జునా ! నీవు బాణపాణివై భీముఁ డున్న దెసకరిగి యవసరమయ్యెనేని యతనికి సహాయంబొనర్పుము. అంతియేగాని బాల్య చాపల్యమున సాహసమ్ముమాత్రము సేయకుము. మన దినములు తప్పివచ్చినవి.

అర్జు—అగ్రజా! ఆజ్ఞ ననుసరించెదగాక !

కుంతి—(హిడింబినిఁ జూచి) యువతీలలామా ! నీ వెవ్వరవు? ఈ ఘోరారణ్యంబున నున్న మాకడకేల యరుదెంచితివి. మమ్ము గడతేర్పఁ దలచి యరుదెంచిన దైత్యవనితవు గావుగదా. నిన్నుఁ జూచిన మాకెంతయో సందియంబు గలుగుచున్నది.

హిడిం—తల్లీ ! నీవు దలంచినట్లు నేను నిజముగా దైత్యవనితనే. ఇప్పుడు భీమునితోఁ బోరాడుచున్న హిడింబాసురుండు నాయన్న యగును. తొలుదొల్త యాతని యానతినిబూని యిచ్చటి కరుదెంచి విశాలవక్షుండును, పూర్ణేందుబింబ వదనుండును, కంజనేత్రుండును, నాజానుబాహుండును, మహాబలపరాక్రమ సంపన్నుఁడును నగు భీమునింగాంచి మదనుబారికి లోనై యాతండే నాకు దైవంబును, మనోహరుండును నని తలంచి యాతని సన్నిధి కరుదెంచితిని. ఇంతలో నాయగ్రజుండు దీనిఁగని మిమ్ములను నన్నుఁ గూడ మ్రింగదలంచి భయంకర రూపుండై యరుదేరగాఁ జూచి మీకు నిద్రకు భంగమగునని తలంచి భీముండు వానిని సమీపస్థలమునకు దీసికొనిపోయి పోరాటంబునకుఁ దలపడెను. ఆతఁడు జయము వహించి సత్వరమ్ముగనే రాఁగలండు.

[తెరలో]

ఉ॥ ధీరవు మమ్ము నెవ్వరిని ♦ జెచ్చెర సాహసమట్లు బూని యీ
తీరున నేగుదెంచితివె ♦ దేవవిరోధని గూల్పగా ! నదే
తూరుపు దెల్లవారె మన ♦ దోర్బలమెక్కుడు వేళయయ్యె నీ
వూరక గొంతసేపు భుజ ♦ యుద్ధమొనర్చి వధింపుమీతని॥

ధర్మ—అవిగో! అయ్యవి యర్జునుని పలుకులు. తమ్ముడు సుఖముగా నరుదెంచుగాక.

కుంతి—(హిడింబినిఁ జూచి) దానవాంగనా! నీవెక్కడ మాభీముండెక్కడ. నరమాంస భక్షకురాలవగు నిన్ను గ్రహించుటకు మా భీముండెట్లు సమ్మతించును. ఇట్టి యాస నీ మనంబుననుండి విడనాడుము. ఇంతవరకు నీవు మమ్ములను రక్షించుచున్నందుకును, నా కుమారుని వార్త చెప్పినందులకును మేము నీయెడల కృతజ్ఞులమై యుండవలయును. అంతియేకాని రిత్తకోరికను మనంబునఁ జేర్చుకొనకుము.

హిడిం—(రహస్యముగా) తల్లీ! నీవెఱుంగనిదీ జగంబున లేదు. రూపవంతులగు పురుషులను జూచినచో గొందఱు స్త్రీలు మోహించుట స్త్రీలోకంబున సామాన్యముగ నున్నదే. ఇవ్విషయంబు నీకునుఁ దెలిసియే యున్నది. ఈ జన్మంబున నాకతండే భర్తయని మోహించి బంధుజనులను విడనాడితిని. అతనియందున్న మక్కువచేత నగ్రజుని వధకైనను సమ్మతించితిని. నన్నాతండు గైకొనఁడేని యాతని చరణ సన్నిధినిఁ బ్రాణంబులు బాయుట కరుదెంచితిని. ఇదియే నా మనోనిశ్చయము.

ధర్మ—(సంతోషమున) అదుగో! భీమసేనుండు విజయలక్ష్మీలాలితుండై తమ్ముడగునర్జునునితో వచ్చుచున్నాఁడు. (ఎదురుబోవును.)

[భీమార్జునులు ప్రవేశించుచున్నారు.]

ధర్మ—తమ్ముఁడా ! వచ్చితివా ! నన్నొక్కసారి గాఁగలించుకొననిమ్ము.

కుంతి—తండ్రీ! మరల కంటబడితివా?

నకు—అన్నయ్యా ! ఎంతసాహసకార్యముచేసితివి ! మమ్మెవ్వరినైన బిలువకుండ నొంటరిగా నేలయరిగితివి ?

భీము—ఆదైత్యు నణఁగించుట కెంతకాలముపట్టినది! (హిడింబిని జూచి) ఈరక్కసివాని చెల్లెలే. దీనినిగూడ నంతంబొందించివనం బరాక్షసంబుగావించెదను.) (హిడింబి పైకిపోవుచున్నాఁడు.)

ధర్మ—(వారించి) తమ్ముఁడా ! ఏమి ! ఈసాహసము. ఆడువారలపైన నీపరాక్రమ మేలచూపెదవు.

తే॥ గీ॥ చంపఁదగినట్టివానినిఁ ♦ జంపినావు
చంపదగనట్టిదానను ♦ జంపనేల
నిన్ను మదిలోనఁగోరి యీ ♦ నీరజాక్షి
వచ్చియున్నదిబ్రోవు మీ ♦ పరమకృపను.

నిశ్చయముగా నొకరివలన నాపదయేవచ్చుఁగాక. వచ్చినను వారు శరణందినప్పుడు రక్షించుటయే పరమధర్మము. తమ్ముఁడా ! ఈ యబల నీపైఁ జిత్తమును బదిలపఱుపుకొని నిన్నే భర్తగావరించి బంధువులనెల్లవీడి, తుదకు నీచే దనయన్న చచ్చుటకుగూడ సమ్మతించి యిచ్చటకు వచ్చినది. జన్మమునెంచిచూడ నియ్యది రాక్షసియేయైనను దీనియందింక నీవట్టిభావ ముంచవలదు. ఇయ్యది మహాజ్ఞానసంపన్నురాలివలె గానిపించుచున్నది.

హిడిం—ఓ కుంతీమహాదేవీ! యోధర్మనందనా ! మీరు నాయిష్టంబు సమకూర్పరేని. నాప్రాణంబు లీభీమునిసన్నిధియందే బాసి ముందుజన్మంబునకైన నను నితనిని బతిగాఁ బడయుదు. మీకు నా

కోర్కె సఫలంబుగావించితేని మీకుఁ బెక్కుకార్యంబులయం దనేక సహాయంబులు సేయుదును. ఎక్కడకుఁగొనిపొమ్మన్నను మిమ్ముల నందఱ నొక్కసారిగా నెత్తుకొని గొనిపోగలను. నే నతీతానాగతవర్తమానంబు లెఱింగినదానను. నన్నుఁ బరీక్షించిచూడుము. మీరీమార్గంబున దిన్నగా నరిగితిరేని ముందర నొక కాసారంబు గాంచగలరు. అక్కడ నొక్కవనస్పతియుం గలదు. ఆరెంటను శాలిహోత్రుండను మునిపుంగవునిచే దపంబునంజేసి గాంచఁబడినవి. ఆసరోవరజలంబులు ద్రావినవారికి నాకలియు దప్పులును నడంగి యధికతేజశ్శాలురై యుందురు. మీరా శాలిహోత్రుని యాశ్రమమునందుండగా మీకడకు వ్యాసమునీంద్రుండరుదెంచును.

కుంతి—(తనలో) ఈమె నిజముగా నొక దివ్యవనితయని తోఁచుచున్నది. దీనివలన మాకు ముందు బెక్కుపకారంబులగునని తోఁచుచున్నది. (భీమునింజూచి) వత్సా! భీమా! నీయన్నవాక్యంబులును నావాక్యంబులును మన్నించి మేము చెప్పినయట్లొనర్పుము. ఈ హిడింబిని నుపేక్షింపవలదు. ఇయ్యది మహాసాధ్వి. అందుకు సందియంబందక దీనినిఁ జేబట్టుము. (హిడింబినిజూచి) యువతిమణీ! నీవు శుచివై యుత్తమస్త్రీగుణంబులఁదాల్చి భీమునకు బ్రియంబు సేయుచుండుము. (భీమునిజూచి) భీమా! యామెను పరిగ్రహింపుము.

భీము—అమ్మా! నీయాజ్ఞ కెదురాడఁజాలను. ఆమెయందు బుత్రజన్మ మగువరకును నీమెను జేఁబట్టెద.

ధర్మ—హిడింబి చెప్పినయట్లు మనమింక శాలిహోత్రుని యాశ్రమంబున కరుగుదము రండు.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

రంగము :—శాలిహోత్రుని యాశ్రమము.

[ప్రవేశము—భీమార్జున నకుల సహదేవులు—కుంతి—హిడింబి.]

ధర్మ—తమ్ములారా! మనమీ శాలిహోత్రుని యాశ్రమభూమిం జేరిననాటనుండియు నెట్టికష్టంబులును లేక సుఖముగ నున్నవారము. తమ్ములారా!

మ॥ కనుడీయుల్లదె నోచుచుండెనెనుటన్ ♦ గంభీరకంఠీరవ
ధ్వనితా కర్ణనకంపితాఖిలహరి ♦ ద్విరేఫసంతాన స
ద్ఘనభల్లూకనికాయ సాళ్వమృగఖ ♦ డ్గ వ్యాఘ్రయుక్తంబు ఘో
రనితాంతాఖిలపక్షిసంకుల రవా ♦ క్రాంతంబు కాంతారమున్.

నకు—అన్నయ్యా! అరణ్యము మాత్రము మనలను విసుచుటలేదు. ఇందున్న దుష్ట మృగంబులు మనల నేమియు బాధింపవుగదా. వీటి వలన మన కేమియు భయంబుండదుకదా.

అర్జు—తమ్ముడా! వీటివలన మనకానంతయు భయంబు కలుగదు. ఏలయనిన;

సీ॥ వైరమింతయులేక ♦ వరసురంగములకు
పాలిచ్చుచుండెను ♦ వ్యాఘ్రచయము
భీతి యింతయులేక ♦ మృగరాజుతోఁగూడి
వర్తింపుచుండెను ♦ వారణములు
పరమముదంబున ♦ బావురు పిల్లితో
భుజియింపు చుండెను ♦ మూషకతతి
సాళువంబులముందు ♦ జంకక కేళిని
సలుపుచుండెను పక్షి ♦ సముదయంబు

తే॥ గీ॥ మానిచంద్రుని సత్తపో ♦ మహిమచేత

సహ— క్రూర జంతువులయ్యు నె ♦ వ్వారికెపుడు

హాని గూర్పకయుండు నటంచుఁడోమ

నకు—అవును ! సందియంబేటికి యనుజులార.

అమ్మహాత్ముని తపఃప్రభావంబున నివి క్రూరజంతువులయ్యు ను నెవ్వరిజోలికిని రావు.

కుంతి—కుమారులారా ! ఈ శాలిహోత్రుని యాశ్రమంబున నుండుట మనకు హస్తినాపురియందున్నదానికంటె నెక్కువ సౌఖ్యదాయకంబుగనున్నది.

నకు—అది వైరుల గృహముగదా. అట్టిచో మనకు సౌఖ్యంబులెట్లుండును.

సహ—తల్లీ ! నీవుగూడ మా మూలంబున నెట్టి కష్టంబు లందుచుంటివి.

కుంతి—తండ్రులారా ! సప్తద్వీపసముద్రముద్రితమహీచక్రంబు నేకచ్ఛత్రంబుగఁ బరిపాలింపఁదగిన బాహుబలపరాక్రమవంతులును, ధర్మగుణోదారులును నైన మీరే యిడుములుపడుచుండ నేనా యోర్వలేనిదానను. ధర్మచరిత్రుండైన మీ జనకుండు గతింపగా నేనుగూడ నాయనమార్గమునుబట్టి పోవక మీకష్టంబు లన్నియుఁ జూచుటకు బ్రతికియుంటిని.

హిడిం—అత్తా ! కుంతీమహాదేవీ ! గతించినదానికిప్పుడు వగవనేల. ఈ కుమారులనుజూచి యాదుఃఖము నంతయు నీవు దిగమ్రింగవలెను.

కుంతి—కోడలా ! హిడింబీ ! నేనట్లే తలంచి వీరలను జూచుకొనుచు జింతబాసి యెట్లో దినములు గడుపుదమని తలంచితిని, కాని విధిప్రేరణంబున దుష్ట దుర్యోధనునిమూలంబున మాకీయిక్కట్లు సంప్రాప్తించినవి. భగవంతుం డింకను నెన్నికడగండ్ల బెట్టనున్నాఁడో యెఱుంగరాదు,

హిడిం—అమ్మా! ఎన్నికడగండ్లఁ గుడిచినను బావగారైన యీధర్మజుండు దాయులను నిర్జించి నల్వురతమ్ములను గలిసి సుఖంబుగ రాజ్యంబు బరిపాలించును.

ధర్మ—ఇది యెక్కడిమాట!

ఉ॥ ఇమ్మహి నేను బాములను ♦ నెన్నటికైనను వీడఁగల్గి; మో
దమ్మును నందఁగాఁదనరి ♦ తమ్ములు నల్వురు నన్నుఁగొల్వ మా
యమ్మయు బంధువర్గము; ధ ♦ రాధిపులున్ గనుమెచ్చఁ దండ్రిరా
జ్యమ్మును నేలఁగాఁగలనె ♦ హా! యిఁక నేటికి నిట్టి కోరికల్.

భీము—(కోపముతో దుర్యోధను నుద్దేశించి) అరే! కురుకులపాంసనా!

మ॥ అవనీనిర్జర పాదసేవకుఁడునై ♦ యశ్రాంత మన్యాయ దు
ర్వ్యవసాయాదులు జేరకుండఁ నవన్ ♦ బాలింపుచున్నాఁడు ధ
ర్మవిధిన్ ధర్మజుఁడట్టిచో; తలఁపకే ♦ రాజ్యంబు నెల్లన్ గొనం
గ; వనాళిన్ మముఁజేరఁ బంపితివిగాఁ ♦ గష్టాత్మ! దుర్యోధనా!.

ఓరీ! నీచమతీ! అంతటితో బోనీక మాయంతంబుగూడ జూడఁదలంచి వారణాసియుం దొక్క లక్కభవనంబు పురోచనునిచే నిర్మింపజేసి యందు మమ్ము బ్రివేశపెట్టించి దాని కగ్ని బెట్టింతువా! (ధర్మజునిచూచి) ధర్మనందనా!

సీ॥ ఆటలాడుతఱిని ♦ నీటియందున నన్నుఁ
దోయించి వెలసిన ♦ దుష్టగుణుఁడు
క్రీడాపరిశ్రాంతి ♦ గూడి నిద్రింప స
ర్పము గఱపించిన ♦ పాపహేతుఁడు
నాచావు గనఁగోరి ♦ నాఁడు విషాన్నంబు
భుజియింపఁజేసిన ♦ పుణ్యహీనుఁ
డందరఁ జంపింప ♦ నాత్మలోపల నెంచి
లక్కయిల్లొల్పిన ♦ యొక్కలీఁడు

తే॥ గీ॥ కురుకుల ధ్వంసమునకయి ♦ కుతలమందు
దయయు సత్యంబు లేకను ♦ దనరువాఁడు
అట్టి ధార్తరాష్ట్రాగ్రజు ♦ నాత్మలోనఁ
దలఁచినంతనె పాపంబు ♦ గలుగు మనకు.

సహ—అన్నయ్యా! భీమసేనా! నీవు నిజము వక్కాణించితివి!

భీమ—(ధర్మజునిఁజూచి)

మ॥ అనుమానింపక నీకొనర్తు నొక ది ♦ వ్యంబైన విజ్ఞాపనం
బును నామాటలనాలకింపు మిపుడే ♦ పూర్ణ ప్రతాపంబునన్
జని దుర్యోధను సంగరాంగణములోఁ ♦ జక్కాడి యొక్కమ్మడిన్
నిను రాజ్యంబున నిల్పువాఁడ ననిన్ ♦ నిక్కంబుగా ధర్మజా.

క్షత్రియులకు రణము ధర్మమైనపనియే గదా. వాసు చెప్పినట్లు జేయుటకు మనముత్తాత్రము లేనివారము. ఊరడగండ్ల మనమేలకుదువ వలయును. నీ వాజ్ఞయిచ్చిన జాలును.

ధర్మ—తే॥ గీ॥ ఆహవంబున కిది సమ ♦ యంబుగాదు
వారియొద్దనే పెక్కండ్రు ♦ వీరులుండ్రి
తమ్ముఁడా! కాలముమనకుఁ ♦ దప్పివచ్చె
దాళగావలెఁ గొన్నాళ్ళు ♦ తప్పకుండ.

భీమ—అగ్రజా! కౌరవులపక్షంబున పెక్కండ్రు వీరు లుండిరని నీవు సందియం బందుచుంటివా యేమి! అట్టి సంశయంబు నీవందఁ బనిలేదు. చతుర్దశభువనంబులును నొక్కపెట్టున సత్రిపద్మిమ నెనుదీయక దుర్యోధనుని ననిలోన సోదరయుతంబుగా దును మాడి యీ ధరాతలమునకు నిన్నభిషిక్తు జేసెదను.

ధర్మ—అనుజా! నీవంతటివాడవనుట కావంతయు సందియము లేదు. కాని యియ్యది సమయముగాదు. ధర్మంబునకును గాలంబునకును గట్టుబడి యుండవలెను.

భీము—అగ్రజా! నీవు కేవలము వెఱ్ఱివాడవు. నీయాజ్ఞ కెదురాడ జాలను.

హిడింబి—(ఎదుటఁజూచి) అదిగో! మనలను ధన్యులం జేయఁ దలంచి. వేదవ్యాసమునీంద్రుం డిట్లు వచ్చుచున్నాఁడు.

కుంతి—హిడింబీ! నీవాక్యంబులు విశ్వసనీయంబులైనవి.

ధర్మ—తమ్ములారా! అమ్మునిచంద్రునకు మనమెదురుగా బోవుదము.

[వ్యాసుఁడు ప్రవేశించును.]

వ్యాసుఁడు—(తనలో) ఆహా! ధర్మపరాయణులైన పాండురాజతనూజుల కెట్టి యిక్కట్లు సంప్రాప్తించినవి. వీరి నోదార్చి తగు ధైర్యంబు జెప్పెదగాక.

(అందఱును వ్యాసునకు నమస్కరింపుచున్నారు.)

వ్యాస—కల్యాణసిద్ధిరస్తు.

ధర్మ—మహర్షితిలకా! సాక్షాద్విష్ణుస్వరూపుండవును, వేదోద్ధారకుండవును, నిరంతరమును మాయభివృద్ధిఁగోరినవాడవును, నగు నీరాకచే మేమెంతయుఁ గృతార్థులమైతిమి.

కుంతి—మహాత్మా! నీమనుమలు పడుచున్నకష్టంబులు జూచితివిగదా అంతటి మహారాజుగర్భమునఁబుట్టి యింతటియవస్థ పడవలసివచ్చెనుగదా. దాయలగు కౌరవులు సమస్తరాజ్యభోగంబుల ననుభవించుచుండ, వారితోసమానంబుగ నుండవలసినవారీకాననంబున దిక్కులేనిపక్షులవలె చరింపవలసినగతి పట్టినది.

వ్యాస—అమ్మాయీ! కుంతీ! భగవత్సంకల్పమున కెవ్వరును కర్తలుగారు. మిమ్ము రాజ్యంబునుండి వెడలనడపి యాకౌరవులందఱునుబొందు సౌఖ్యంబులుమాత్ర మేమున్నవి.

తే॥ గీ॥ నిమ్మభూజంబునకునెంత ♦ నీరువిడిన
బ్రతుకుటరేమ బ్రతికినను ♦ ఫలములరుదు

యడవిలోరతిఁ జేసెనట్టి ♦ యఖిలతరులు
వృద్ధిఁ జెందుట లేదె స ♦ మృద్ధిగాను.

మీరీ ప్రదేశమునందుండినను శ్రీహరి మిమ్ముల నిరంతరంబును గాపాడుచుండును. వత్సలారా!

చం॥ కొడుకు వచించు వాక్యములు ♦ గూడవటంచు నిరాకరింపకే
కడువడి యాపదల్ పొరయ ♦ గాదతిమోహ ధృతరాష్ట్రుఁ డంచు నే
ర్పడ విని మీరలాపదల ♦ పాల్పడకుండ హితోపదేశ మి
మ్మియ్యెడ నెనరించి పోదలఁచి ♦ నే నరుదెంచితి సత్వరమ్ముగన్.

ధర్మ—మహాత్మా! నీకు మాయందున్న ప్రేమ వర్ణనాతీతముగదా.

వ్యాస—కుమారులారా! మీరు నావాక్యంబులాలించి కొన్నిదినంబులు ప్రచ్ఛన్నవేషంబులనుండుఁడు. దానివలన మీకు లాభంబు గలుగగలదు. ఈశాలిహోత్రుని యాశ్రమంబుననుండిన జలాకరంబున జలంబును మీరు ద్రావియుంటచే మీకాకలిదప్పులడంగినవిగదా. మదీయవరప్రభావంబున మీకు సమస్తవేదవిద్యయు నలవడును. ఇంక గొన్నిదినంబులీ శాలిహోత్రుని యాశ్రమంబుననుండి యనంతర మేకచక్రపురంబున కరుగుఁడు. అచ్చట మీరు భైక్షుకవృత్తిని జరింపుచు నారాకకై ప్రతీక్షింపుచుండుఁడు. మిమ్ములను నేను మరల నచ్చట జూచెదను. (హిడింబినిజూచి) ఈహిడింబి పూర్వజన్మంబున గమలపాలిక యను నామంబున దనరినది. ఇదియొక దివ్యవనిత. దీనిని వేరు విధంబుగ భావింపవలదు. దీనియందు మహాభుజబలపరాక్రమసంపన్నుఁడగు కొడుకు భీమున కుదయించును. అతడు మీకనేక కార్యంబులయందు బెక్కు సహాయంబు లాచరించును. ఇక నే నరిగెద.

ధర్మ—పితామహా! నీవు నిరంతరంబును మా క్షేమంబు నారయుచు మమ్ము రక్షించుచుండుము.

వ్యాస—వత్సలారా! మీకెట్టియాపదలును జేరకుండునుగాక. ఇంక నే నరిగెదను. (నిష్క్రమించును)

ధర్మ—తమ్ములారా! వింటిరిగదా. వ్యాసమునీంద్రునివాక్యంబులు. ఏకచక్రపురంబున మనలను బ్రాహ్మణవేషంబులనుండి భైక్షుకవృత్తిని జరింపుమని యాజ్ఞయొసంగినాడు. అక్కటా! కాలమెట్లుమారినది.

భీమ—అన్నయ్యా! దీనికి విచారింపవలసిన యవసరమేమున్నది!

ధర్మ—నావిషయమై నేనంతగా విచారింపనుగాని,

తే॥ గీ॥ పృథ్వినేలగాఁదగినట్టి • వీరు; నిన్ను
బేదవిప్రసమానుని • బిచ్చమెత్తు
మంచు నేరీతినీకు వ • చించువాఁడ
నక్కటా! యెట్టిగతివచ్చె • ననుజ! మనకు.

భీమ—నావిషయమై నీవు చింతనంతవలదు. మంచిదినంబులువచ్చువఱకును నోపికబట్టి యుండవలెను. కాలమెప్పుడును నొకతీరున నుండదుగదా.

ధర్మ—(అర్జునునిజూచి)

తే॥ గీ॥ ద్రోణునాజ్ఞనుబూని యా • ద్రుపదనృపుని
రథమునకుఁగట్టితెచ్చి వి • రాజలీల
శస్త్రవిద్యావిశారదుం • డనుచుఁ బేరు
గాంచి విమలయశంబును • గాంచినావు.

అట్టినిన్ను బ్రాహ్మణువేషంబునుబూని భైక్షుకవృత్తినిఁ జరియింపుమని యెట్లుచెప్పుదునాయని సందియముగలుగుచున్నది,

అర్జు—అన్నయ్యా,

తే॥ గీ॥ "ఓడలే బండ్లగును బండ్లు ♦ లోడలగును"
కాలమొకరీతి నెవ్వరు ♦ గడుపగలరు
చింతయేటికి నీకును ♦ స్వాంతమందు
మహితగుణతేజ ధర్మజ ♦ క్ష్మాతలేంద్ర.

సురమునిగణపూజితుండగు వ్యాసుండు జెప్పిన తెఱంగున మనము ప్రవర్తింపవలయును. నన్నుం గూర్చి విచారింపవలదు.

ధర్మ—(నకులసహదేవులనుజూచి)

తే॥ గీ॥ మాద్రికోర్కెమై మిముగాంచి ♦ మరణమందె
నశ్వినులభాతి మీరును ♦ నలరుచుండ్రి
యక్కటా సుకుమారులై ♦ నట్టిమిమ్ము
దేవవిధికుఁబాల్పఱచు ♦ దెలుపగలనె.

భగవంతుండు మన కెట్టికష్టంబుల జేయుచున్నాఁడు.

నకు—అగ్రజా! విధియాజ్ఞ నుల్లంఘించుటకు మనతరమా. ఏదియెట్లు జరుగుటకు విధాత వ్రాసినాడో యట్లే తప్పక జరుగుచుండును. నీవు దీనికై యోచింపవలదు.

సహ—అన్నయ్యా, మనకుఁ గాలాతీతమగుచున్నది. శాలిహోత్రముని చందర్శింపను నరుదెంచు వేళయైనది.

ధర్మ—అట్లయిన నాతనిని దర్శించి యతండెప్పు డేకచక్రపురంబున కరుగుమని చెప్పిన నరుగుదము. రండు.

(నిష్క్రమించుచున్నారు.)

ఇది ద్వితీయాంకము.

సంపూర్ణము.

శ్రీ

ద్రౌపదీపరిణయము.

తృతీయాంకము.

[రంగము:—ఏకచక్రపురము:—ప్రవేశము జాబాలియను భానుకుండను, భార్గవీయను భార్యయు, చారుమతియను పుత్రికయు, సునందుఁడను పుత్రుఁడును, ప్రవేశింపుచున్నారు.]

జాబాలి—(తనలో విచారించుచు) అక్కటా! భగవంతా! మాయంతముఁజూడఁదలంచితివా! ఆబకున కాహారంబుగాఁబోవుటకు నేఁడు మాయింటి వంతువచ్చినది—అక్కటా! ఇప్పుడు నే నేమి సేయుదును. ఎవ్వరిని నా రాక్షసున కాహారంబుగాఁ బంపుదును. అగ్నిసాక్షిగ బెండ్లియాడిన యీ కాంతను బంపుదునా. నామరణాంతమున నాకిన్ని నీళ్ళుచుక్కలను బోయుచు వంశవృద్ధికి గారణుండగునని తలంచి నాయాసలన్నియు నెవనిపై నిలిపితినో యట్టికుమారుని బంపుదునా? చక్కనివరుని వివాహమాడి మావంశంబునకు సుకీర్తి దెచ్చునని నమ్మియున్న సుగుణచరిత్ర కుమారిని బంపుదునా. లేక నేనేయరుగుదునా! అయ్యో! నిరంతరమును నన్నే దైవముగా భావించుచు, నొక్క త్రుటికాలమయినను నన్నెడబాయక, సాధ్వీలోకంబున విమలకీర్తి గడించిన భార్యను బంపుటకు నాచిత్తంబెట్లు సమ్మతించును. నిజగర్భసంభవయగు పుత్రిక నర్పించుటకు జేతులెట్లాడును. కన్నకుమారుని నర్పింతమని తలంచినచో నయ్యది వంశవిచ్ఛేదనంబునకు

మూలంబగుగదా. పోనిమ్ము. నేనే యరుగుదఁ బనితలంచినచో నాత్మహత్యాదోషంబునకు బాల్పడినవాఁడనగుదును. అయ్యో! ఏమిసేయుటకున్ను దోచకున్నది. మమ్మీవిపదాబ్ధినుండి యెవ్వరు తరింపజేయఁగలరు. ఎవ్వరిని వేఁడుకొందును. ఇట్టిసమయంబున మాకెవ్వరడ్డపడుదురు. (భగవంతుని నుద్దేశించి) హా దైవమా!

విచారవల్లరి.

సురగణనుతమా ♦ శోకమువినుమా
సరగునమమునీ ♦ సత్కృపగనుమా
సురరిపువలనన్ ♦ సాక్షిగనిపుడే
యరుగఁగవలెమా ♦ యార్తినివినవా.

అయ్యో! దైవమా! ఎట్లో వైదికవృత్తిచేఁ గాలంబుగడుపుచు నీకుమారుని, కుమారికను జూచుకొనుచు నానందమందుచు దినములు వెళ్ళబుచ్చుచుండగా మాకిట్టియాపద గూర్చుట నీకు ధర్మమా! నిరంతరము నీపదారవిందసేవదప్ప యన్య మెఱుఁగనివాఁడనుగదా. దేవా! కూటసాక్ష్యంబులేమైన నొసంగి యెవ్వరికొంపయైనను మాపియుంటినా! ద్రవ్యంబునాశించి యెవ్వరిగొంతుకనైన రహస్యంబుగ గోసియుంటినా! చంచలచిత్తుండనై పరునికాంతను గూడితినా! సిరితోడులఁ దూగుచుంటినని గర్వాంధకారంబున మునిఁగి నీపాదసేవ మఱచియుంటినా! ఇట్టికార్యంబుల నెన్నఁడును జేసియెఱుఁగని నన్నిట్టిసంకటంబులపాలు జేయనేల!

పార్వ—నాథా! ఏలమీరిట్లుచింతించెదరు. చింతించినందువలనఁ బ్రయోజనంబేమియున్నది.

తే॥ గీ॥ భూరివిపదాబ్ధిలోపల ♦ మునిఁగినాము
దానిఁదరియింపమునకును ♦ దరముగాదు

చింతనేటికి జేర్తుదు • చిత్తమందు
నసురవాతకు నన్పంపు • డమలచరిత.

ఆదైత్యునకు నే నాహారంబయ్యెద. మీరు చింతింపవలదు. నాయందు బడయవలసిన సంతతి నిదివఱకే బడసియుంటిరి. వంశంబు వృద్ధిసేయఁదగిన నందనుండొకఁడున్నాఁడు. అదిగో పుత్రికయున్నది.

చం॥ ఘనుఁడగు వానినొక్కనిని • గన్యకుఁ బెండిలిజేసి; మీఱుచున్.
వనజదళాయతాక్షుసుర • వందితు శ్రీరమణీమనోహరున్
మనమున భక్తి మీఱఁగను • మానక గొల్చుచు నెట్టులెట్టులో
దినములు వెళ్ళదీయుఁడుమ • దిఁ ననుమెచ్చుఁడు పుత్రిఁ జూచుచున్.

ఇంక జాగుసేయక నసురునికడ కరుగుటకు నాకానతిండు.

జాబా—(దుఃఖముతో) హా! సతీమణీ! ఎంతదారుణపు వాక్యంబుల బలికితివి. నవ్వులాటకునైనను నెవ్వరిని నొవ్వనాడని సుచరిత్రవు. పరిహాసమునకైనను నసత్యంబు బలుకనిదానవు. కలయందైనను నాసేవ నిడనాడి యెఱుంగనిదానవు. అక్కటా! మంత్రయుక్తంబుగ నగ్నిహోత్రిముందు నర్ధాంగిగ జేకొనిన నిన్ను నేనెట్లు బాయగలను. సాధ్వీమణీ! నిన్నాయసురుని వాతకుబాల్పడుమని చెప్పుటకు నాకు నోరెట్లాడును. ఆయసురుని కాహారంబుగా నే నరిగెదను. పుత్రుని పుత్రికను జూచుకొనుచు గాలంబు వెళ్ళదీయుము.

పార్వ—ప్రాణేశ్వరా! మీ రలుగవలదు. జీవనంబులు బరిత్యజించియైనను భార్య, భర్తకు హితంబుసేయుట పరమధర్మమై యున్నది. మఱియును,

తే॥ గీ॥ కాంతుకంటెను ముందు స్వ • ర్గంబుజేరు
చాన లోకంబునందు య • శంబునందు

భర్తృహీనమై జగమందు ♦ బ్రతుకు కాంత
సాధ్వియయ్యుఁ జూడఁబడు న♦ సహ్యముగను.

తే॥ గీ॥ జాతి పడిపోవునట్టి మాంస ♦ సంబుకొఱకు
పక్షు లాసించువిధమున ♦ భర్తృహీన
యైన యువిదకొఱకు హీను ♦ లాసఁజెందు
చుందు రిదిపాప మనకను ♦ డెందమందు.

ఇంతియేగాక సతి గతియించినచో పురుషునకు బునర్దారాసంగ్రహము శాస్త్రసమ్మతమై యున్నది. అంతియేగాని కాంతకు బతి విముక్తుం డయ్యెనేని యన్యపురుష సంగ్రహమున కధికారము లేదు. మీరు లేకున్న యీజగంబున నేనొక్క ఘటికాలంబయినను జీవింపజాలను.

చారు—తల్లిదండ్రులారా! ఏల యీరీతి మీరు శోకంబునందుదురు. నన్ను మీ రెంతికాలము పెంచినను నేను మీవాఁడను గాను. నేనొరుల ధనంబునై యుంటిని. అట్టియెడల నొరుల కిచ్చుటకన్న మీ ప్రాణసంరక్షణార్థమై నన్నాయసురున కాహారంబుగాఁ బంపుఁడు. తండ్రియొనరించు తిలాదిదానవిధులు పరలోకంబుననున్న పుత్రికను జేరును; గాని పుత్రి యొనరించు విధులుమాత్రము తల్లిదండ్రులను జెందవు. అయ్యవి దానిపురుషునే జేరును. మీకు నాయందుగలుగు దౌహిత్రలాభంబుకంటె మీ రిరువురును బ్రతికియుంటిరేని యనేక పుత్రపౌత్రలాభంబు నందగలరు. దానంజేసి కులము నిలచును. ఇంక సందియంబందక నన్ను బంపుఁడు.

జాబా—కులమునకుఁ గీర్తిదెత్తునని తలంచి యాసతోనున్న వాఁడ. నిన్నెట్లు బంపుదును. బిడ్డా నీవేగవలదు. నేనేయరిగెదను.

సువిం—తల్లిదండ్రులారా! మీరెవ్వ రరిగినను బ్రయోజనములేదు. ఆ దుష్టరక్కసునిచేత మడంపదగిన మహిమ మీయొద్ద లేదు. నేనరిగి వానిని యాకోలచేఁగూల్చి వచ్చెదను. నన్నుఁబంపుఁడు.

జాబా—కుమారా! నీవారక్కసుని గూల్పఁదగినంతటి పరాక్రమవంతుండవా! (భార్యనుజూచి) రమణీమణీ! ఎందు కీయాలస్యము. ఆలస్యమయ్యెనేని యారక్కసుండు పురిలోని కరుదెంచును. కావున నే నరిగెదను.

పార్వ—అయ్యో! మీ రరుగవలదు.

తే॥ గీ॥ పురుషు లుండకయున్నచోఁ ♦ బొలతియెట్టు
లుద్ధరించును సంసార ♦ మబ్ధియందు
ససుర కాహార మగుటకే ♦ వరుగుదాన
గాఁచుచుండుము వీరిని ♦ ఘనతరముగ. (పోఁబోవును.)

జాబా—కాంతా నీ వేగవలదు.

చారు—అమ్మా! నీవు వలదు. నే నరిగెదను.

సునం—మీరెవ్వరునువద్దు. నేనే యరిగెదను.

పార్వ—నాథా! బిడ్డలను జూచుకొనుచుండుము. నే నరిగెదను.

జాబా—(భార్యను బట్టుకొని)

జగన్మోహిని.

చాలుఁజాలునింక ♦ జాలమేలనే సఖి జాలమేలనే
[illegible] ♦ భీతియెందుకే చెలీ భీతియెందుకే
మాలదైవమిట్టి ♦ పాట్లు దెచ్చెనే సతీ పాట్లుదెచ్చెనే
యేలచింత నేనె ♦ యేగివచ్చెదన్ ప్రియా యేగివచ్చెదన్

[అంత కుంతి ప్రవేశించుచున్నది.]

కుంతి—(తనలో) ఎందుకోగాని పాపమీయింటిలోని భూసురుండు తన భార్యబిడ్డలతోఁగూడ మిగుల దుఃఖించుచున్నాఁడు. ఇందులకు

గారణంబేమైయుండునోగదా. సరే. వీరివలన దెలిసికొని వేఱ
నైనచోఁ దగుసహాయ మాచరించెదను. "పరోపకారార్థ మి
దంశరీర" మని పెద్దలు చెప్పియుండిరిగదా! (బ్రాహ్మణుని
సమీపించి) బ్రాహ్మణోత్తమా! మీరీరీతి చింతించుటకు గార
ణంబేమియో నే నెఱుంగవచ్చునా!

బ్రా—అయ్యో! తల్లీ! వినినను వినకపోయినను యేమిప్రయోజనము
న్నది. నేటితో మాకు గాలముదీఱినది. (వగచుచున్నాఁడు.)

కుంతి—భూసురవర్యా! చింతింపవలదు. మీ యాపదయెట్టిదో తెలి
య జేసితిరేని దానికిందగిన ప్రతీకార మాలోచించవచ్చును. త్వ
రితముగఁ జెప్పుడు.

బ్రా—అమ్మా! ఏమనిచెప్పుదును. ఈపురంబునకు నాలుగుక్రోసుల
దూరంబున యమునానదీగహ్వరంబున బకుండను దానవుండొ
క్కఁడునివాసముజేయుచున్నాడు. ఆక్రూరాత్ముండుదప్పించి పురి
లోనికి విచ్చలవిడిగాఁ బ్రవేశించి యిచ్చవచ్చినయట్లు యీపుర
వాసులను జంపుచుండ, సాధుగుణులైన భూసురులు జపహో
మదానవిధులంజేసి, యారక్కసునితో నిట్లనుదినంబును పురంబు
నకరుదెంచి జనహింససేయుట వలదనియు, నింకనుండి ప్రతిది
నంబును నిలువరుస నొక్కమానిసిని రెండెనుబోతులంబూనిన శ
కటంబున నపరిమితభక్ష్యపిశితమిశ్రాన్నంబును బంపబడుచుం
డుననియు వానితో నొడంబడిక జేసికొనిరి. ఆయొడంబడిక
ననుసరించి ప్రతిదినంబును నట్లు జరుగుచున్నది. తల్లీ! నేడు
వానికాహారంబుగాబోవుట మాయింటివంతై యున్నది. పెద్ద
కాలంబునకు నాకుజన్మించిన యీకుమారుని బంపజాలను. కు
లమునకు గీర్తిఁదెచ్చునని తలంపుచున్న యీకుమారిని బం
పజాల. మంత్రయుక్తంబుగ నగ్నిహోత్రినిముం దర్ధాంగిగ

స్వీకరించిన యుక్కాంత నసువఁజాల. అందులకై నేనే పో
తెదను !

కుంతి—ఓ ! ధరామరా ! నీవింక నాసంగతింగూర్చి చింతింపవలదు. నీకు బెద్దకాలంబునకుజనించిన యీ కొమరుం డొక్కఁడేయున్నవాఁడు. అతనిం బంపవలదు. నాకేవురుతనయులున్నారు. కావున నారక్కసునకు భవదర్థంబు మెక్కరుం డు బలిగానుపోవును. ఇందులకై మీరు సందియంబందవలదు.

జాబా—తల్లీ! ఎంతమాట జెప్పితివి !

తే॥ గీ॥ అతిథియైవచ్చినట్టి ధ ♦ రామరునెటు
నసురకాహారముగను జే ♦ యంగనెంతు
విప్రమరణంబుదలపోయ ♦ బృథ్వియందు
బెద్దపాతకంబగుచును ♦ వెలయుఁగాదె.

అతిథిని, నభ్యాగతుని, భయస్థుని, శరణాగతుని జంపుటకు సమ్మతించుదురాత్ము డిహపరంబులకు దూరంబగును. ఆత్మహత్యగూడ మహాపాతకంబని యార్యులు నుడువుదురుగాని యియ్యది యొరులచే జేయింపబడుచుండెనుగాన నన్నా పాపంబంటదు. ఎవరిమూలమున నే నిట్టి ఘోరకార్యముచేయుట కొడంబడితినో వారినే యంటును. కావున బ్రాహ్మణవధకు నే నంగీకరింపఁజాల.

కుంతి—దయా ! వెర్రిబ్రాహ్మణుఁడా ! నేనుమాత్రము బ్రాహ్మణవధకు సమ్మతింతునని దలంచితివా ! ఈసంగతి నాకుమాత్రము దెలియదా. నాకుమారుని వధించుటకా దానవునకు శక్యంబుగాదు. మహామార్గుండగు నారక్కసుని రణంబున నాసుతుండు తప్పక దునుమునని యెఱింగినదాననగుటచేత నే యిట్టికార్యము చేయఁబూనితిని. అంతియేగాని మూర్ఖురనుతులున్నవారెవ

నందొకరివధకు సమ్మతించువారెవ్వరుందురు. నాద్వితీయతనయునిచే నింతకుమున్నే పెక్కండ్రురక్కసులు మడిసిరి. ఈతఁడొక మంత్రసిద్ధుఁడు.

[(అంత భీముండు ప్రవేశించును]

భీము——(కుంతినిఁ జూచి) తల్లీ! వీరి విచారంబునకుఁ గారణంబరసితివా!

కుంతి——వత్సా! కనుఁగొంటిని. ఇచ్చటికనతిదూరంబుననున్న బకాసురుండను దానవుని కీటువరుస ననుసరించి యీబ్రాహ్మణుండాహారంబుగాఁ బోవలయునఁట. అందుకై వీరు శోకింపుచున్నారు. కావున నీవు రెండెనుబోతులంబూన్చిన శకటంబుపై నాహారంబుఁబెట్టుకొని యా యసురునికడ కరిగి వానినిజంపి వీరిని గాపాడవలయును.

భీము——అమ్మా! ఇంతియేగదా. తప్పక నీయాజ్ఞ ననుసరించెద. (బ్రాహ్మణుఁజూచి)

మ॥ ఘనసాధ్వీమణియైన నాజనని యా • జ్ఞన్ బూనితిన్ నాకునై
యనుమానింపకు మింకనిఁకుమది లో • నాదైత్యుఁడున్నట్టి తా
వునకున్ బోయెదనేనె శీఘ్రగతి సం • పూర్ణప్రతాపంబుతో
దనుజున్ గూల్చెద నేకచక్రపురి మో • దంబంది శ్లాఘింపఁగన్.

ఓధరామరోత్తమా! నాభుజపరాక్రమమునుగూర్చి నీకొక్కింతయు దెలియదు. ఆతండేగాక చతుర్దశభువనంబులును నొక్కపెట్టున నెత్తివచ్చినను నినుమంతయు భీతిల్లువాడనుగాను. మీరరిగి యాబకునకు గావలసిన యాహారాదికంబులు సిద్ధము సేయుఁడు.

(బ్రాహ్మణుఁడు భార్యాపుత్రులతో నిష్క్రమించును.)

[ధర్మజుఁడు ప్రవేశించును.]

ధర్మ——(కుంతినిఁజూచి) అమ్మా! మధూకరాన్నము దెచ్చితిమి.

కుంతి—తక్కిన తమ్ములు మువ్వురును నేరి!

ధర్మ—అచ్చట గూర్చుండియున్నవారు. (భీమునింజూచి) అమ్మా! మ నభీముని వదనంబు నేడది యొకతీఱున నున్న దేమికారణము.

కుంతి—బ్రాహ్మణప్రాణ సంరక్షణార్థమై నేడు బకాసురుని సంహరింపదలంచినాడు.

ధర్మ—వాయునందనా! మఱల నేదియో సాహసకార్యము బూనితివా!

కుంతి—వత్సా! ధర్మతనూభవా! ఈయింటిభూసురుని శోకంబు గనులార జూడజాలక నీభీముని నిట్టి యుద్యోగంబున నేనే బ్రవేశ పెట్టితిని.

ధర్మ—అమ్మా! నీవు ముందువెనుక లాలోచించకుండ నెట్టికార్యము నీతనిచే జేయింపదలంచితివి? ఇది కేవలము సాహసముసుమా!

సీ॥ దుష్టగుణుండైన • దుర్యోధనుడు మాయ
లెన్నెన్నొ యాయంధ • నృపునితోడ
బల్కి మనలను వా • రణాసికిం బంపి
యచ్చటనెవ్వరు దెలి • యంగలేని
లక్కతో దివ్యమౌ • నొక్కయిల్లును జేసి
మనలనందుంచి బ • ల్మాయచేత
దావాగ్ని బెట్టించె • దానికి ; నప్పుడు
వాయుజుడు మనల • బ్రతుకజేయ
తే॥ గీ॥ నంటుకొన్నట్టి యాలక్క • యింటినుండి
సరగదప్పించి మించెను; • శౌర్యమెసగ
ఘోరవనమందున హిడింబు • గూల్చి మనకు
నధికసంతోషమును గూర్చె • నట్టిభీము
విడువనెంచుట భావ్యమే • వెఱ్ఱివగుచు,

కుంతి—కుమారా! కొడుకునువిడుచుట కంతవెఱ్ఱిదాననుగాను. ఈతని శక్తి నే నెఱుంగనిదిగాదు. ఈతండు వజ్రకాయుండు. వజ్రధరుండైన విబుధేంద్రునిగూడ నెదిరింపఁదగినబలశాలి. ఈతని గన్న పదియవదివసంబున నాయొడినుండిజాఱి పర్వతంబుపై బడగా నీతనిశరీరముదాకి యాశిలలన్నియు నుగ్గయినవి. బ్రాహ్మణులకు నిరంతరమును మనము బ్రియముసేయుచుండవలయును. మీరట్లు గావించితిరేని వారిప్రసాదంబున నీవును నీసోదరులును నిరంతరసౌఖ్యశ్రీలనందుదురు.

ధర్మ—అమ్మా నీబ్రాహ్మణభక్తికి సంతసించితిని. బలశాలియగు తమ్మునికెందును నేకొఱంతయుగలుగక విజయంబే లభించుగాక!

భీము—అన్నయ్యా! భవదమోఘాశీర్వచనంబు ఫలించుగాక! (ఎదుట జూచి) అదిగో విప్రుం డరుదెంచుచున్నాఁడు.

జాబాలి—(ప్రవేశించి) ఓ వీరపురుషా! నీయానతిని నన్నము సిద్ధము జేసితిని.

భీము—(కుంతినిజూచి) అమ్మా!

శా॥ ఉల్లాసంబున వీరు మెచ్చఁగను న • య్యుగ్రాహవక్రీడలో
ముల్లోకంబుల నేచు పాతకుని వే • బోకార్చి యేతెంచెదన్
దల్లీ యన్నముపిండివంటకము మో • దంబొప్పఁ బెట్టింపుమీ
యుల్లంబిమ్మెయి నాబకాసురవధో • ద్యోగంబునన్ మిన్నందెడున్.

జాబా—(భీమునిఁజూచి) బలశాలీ! బ్రాహ్మణోత్తమా! ఇంతమాత్రమునకు నీవు మీతల్లినడుగనలయునా. మాప్రాణంబుల సంరక్షించి వంశంబు నిలబెట్టదలంచి, ఘోరకార్యము భుజస్కంధమునందు వహించియున్న నీకు గడుపునిండ నన్నముబెట్ట నేను సమర్థుండనుగానా! ప్రాణదాతా! రమ్మ. ముందునీకేమికావ

లయునో యట్టి దేకొఱంతయు లేకుండ గడుపునిండ భుజింపుము. (భీమునిచేయిబట్టుకొని తీసికొనిపోవుచున్నాఁడు.)

ధర్మ—అమ్మా మేముదెచ్చిన మధూకరాన్నము మాకు బంచిపెట్టెదవుగాక! రమ్ము.

కుంతి—మంచిది.

(నిష్క్రమించుచున్నారు.)

రంగము—బకాసురునిగహ్వరము.

బకాసురుఁడు—(కోపముతో బ్రవేశించి) ఔరౌరా! ఏమీ! ఈయేకచక్రపురవాసుల యవిధేయత. ప్రతిదినంబును సిలువరుస నొకమానిసిని రెండెనుబోతులనుబూనిన శకటంబున దానికిదగిన యాహారమును బంపుదుమని చెప్పుటచే జాలిదలంచి యిందులకొప్పుకొంటిని. అనుదినంబును వారిది పంపునప్పు డొక్కింత యాలస్యమైనను నాగ్రహింపక యెట్లో తాళుచుంటిని. నేడేమియోగాని నా కాహారంబుబంపుటయందు మిగుల జాగుచేసినారు. అహా! అకలిబాధ నన్నుదహించివేయుచున్నది. (కోపమున) ఓ! యేకచక్రపురనివాసులారా! మీరు నన్ను మఱచిపోయిరికాబోలు. దుర్మతులారా! మీరు మఱచిపోయినను యీ బకుండుమాత్రము మిమ్ములను మఱచువాడుకాడని తలంపుడు. మీపురంబెల్ల నిమేషకాలంబులో భస్మముగావించెద.

[అంత భీముఁడు శకటంబుతో బ్రవేశించును.]

భీమ—(తనలో) ఇప్పటి కిక్కడ జేరుకొంటిని. అనుదినమును నీ రక్కసున కాహారము వచ్చు వేళకంటె నేను మిగుల యాలస్యమైయుండుటచేత వాడు చిందులుద్రొక్కుచునేయుండును. (ఎదుట జూచి) అహహో! అక్షీణరూక్షేక్షణవీక్షణంబుల త్రైలోక్యం

బంటును భస్మము గావించునట్లు, తన కాహారమువచ్చు వేళ మిగిలినదని యీ మూర్ఖుడు రక్కసుండు దురాగ్రహంబున కేకలు బెట్టుచున్నాడు. కానిమ్ము. వీని యంతంబొందించు కాలము సమీపించుచున్నది. (నలుదెసలం గలయజూచి) శల్య మాంస చర్మశోణిత దుర్గంధ పంకమైన వీని గహ్వరంబును నేను సమీపించుటకన్న నే నిచ్చటనే యీ శకటంబుయొద్ద నుండెదను. వీడే నన్ను జూచి రాగలడు.

చం॥ మదిని సుమంత్రియోని యను • మానము బూనక దల్లియాజ్ఞ; దు
ర్మదుడగు వీనిదాకి సమ • రంబున ద్రుళ్ళడగించిపుచ్చి స
మ్మదము నొసంగెదన్ విమల • భూసురుడెంతయు నన్ను మెచ్చ; నె
మ్మదులను నేకచక్రపుర • మాన్యులు చింతల బాసియుండగన్.

(ఇంచుక యూరకుండి) భగవంతా! వాసుదేవా! ఆనాడు కౌరవు లగ్నిబెట్టించిన లక్కయింటనుండి నీ కరుణచేతనే జననీ సోదరులను దప్పించి యడవి చేర్చితిని. నీ యమూల్య కారుణ్యముచేతనే జననీసోదరులు నిద్రించుచుండగా నట్టహాసంబున వచ్చుచున్న హిడింబాసురుని దునుమాడ గల్గితిని. దేవా! నేనిప్పుడొక నిర్భరమైన కార్యంబును బూనినాను. తల్లి యాజ్ఞ ననుసరించి బ్రాహ్మణప్రాణ సంరక్షణార్థమై లోకకంటకుండైన యీ బకాసురుని వధింపనుంటిని గావున నాయందు గృపాంతరంగుండవై యికార్యంబు కొనసాగునట్లుజేసి, నీమేనత్త కుమారులకు గీర్తి దెమ్ము.

బకా—(ఎదుటం జూచి) అదుగో! యెవ్వడో మానిసి యాహారసమేతముగా శకటంబును దెచ్చినాడు. (ప్రకాశముగా) ఓరీ! మానుషాధమా! నేడింత యాలస్యము చేసితివేమి! మీరీరీతి గావించినచో నేకచక్రపురవాసుల నందఱిని నొక్క దినముననే

యాహారముగా గొందునను మాట మఱచితివా యేమి! అయి
నను నా కాహారంబగుటకు వచ్చిన నీపై నాగ్రహించిన నేమి
ప్రయోజనంబున్నది. రమ్ము. నా కాకలియగుచున్నది..

భీము—(తనలో) ఈ క్రవ్యాదుం డాకలిబాధచే నేమేమో ప్రేలుచు
న్నాఁడు. వీనికి గాలమాసన్నమైనది. వీని వాక్యంబులు నేను
విననట్లు నటించెదనుగాక! వాడిక్కడ కరుడెంచులోపల యిం
దున్న పదార్థంబులు నేను భుజియింపుచుండెదను. (శకటంబు
పైనున్న భక్ష్యంబుల దినుచుండును.)

బకా—(భీమునిజూచి) అరే మూర్ఖా! సత్వరమ్ముగా రమ్మని పిలుచు
చుండ నా వాక్యములు వినిపించుకొనవేల. (పరికించి) మాట
వినిపించుకొనకుండుటయేగాక నాకై తెచ్చిన యాహారంబు నీవు
భుజింపుచుంటివా! అవురా! ఏమి నీ ధైర్యము. ఇదిగో
వచ్చుచున్నాను.

భీము—రమ్ము. రమ్ము. నిన్ను నా భుజములసందున నిఱికించి తృటి
లోఁ జంపెద.

బకా—(భీముని సమీపించి) ఏమిది! మిగుల నాశ్చర్యముగా నున్నది!
త్రిలోక భయంకరుండనగు నన్నుజూచి వీఁడొక్కింతయైనను
జలింపకయున్నాఁడు. కానిమ్ము. వీనిమద మడగించెదను.
ఓరీ! దురాత్మా! అరే మర్త్యాధమా! ఏమిరా నీ కండకావర
ము. మనుష్యమాంసభక్షకుండ నైన నాకు భీతిల్లి యనుదినం
బును నేకచక్రపురవాసులు నా కాహారంబు బంపుచుందురు. నీవు
నేడు నాకాహారము మిగుల నాలస్యముగా దెచ్చుటయేగాక,
నాకు తెలియకుండ నయ్యది నీవే తినుచుంటివా. (అని
తన్నును.)

భీమ.—(తన్నును లక్ష్యముసేయక) ఇదిగో! యీ యాహారములో తక్కిన భాగముగూడ భుజించి వచ్చుచున్నాను. తొందరపడ వలదు.

బకా.—(తనలో) ఏమిది! నా వాక్యంబుల కెవ్వడును నీరీతిని బ్రత్యుత్తరం బిచ్చినవాఁడు లేఁడు. వీ డెవడో యించుక చేవగలిగిన మానిసివలె దోఁచుచున్నాఁడు. అది యెట్టిదో యించుక గనుగొనవలయును. (ప్రకాశముగా) ఓరీ! మనుష్యాధమా! ఏమిరా ప్రేలుచుంటివి?

భీమ.—ఓరీ! దైత్యాధమా!

ఉ॥ చాలుఁజాలు మాయుమిఁక ♦ జక్కఁగ నీదగు నోరు విప్పు; వా
చాలత నేల జూపెదవు ♦ బాహాబలంబును జూపనెంచుమీ
కాలునిలీల వచ్చితిని ♦ గ్రన్నన నిన్ను వధింపనెంచి యో
బాలిశ! యేకచక్రపుర ♦ వాసులు సంతతము సుఖింపఁగన్.

బకా.—(భీముని జూచి)

ఉ॥ ఎవ్వఁడవోరి నీవిటుల ♦ హీనపరాక్రమమున్న రీతినిఁ
జివ్వకుఁ గాలు ద్రవ్వెదవు ♦ ఛీ! యటు నిల్వుము; దేవబృందమే
యెవ్విధి యీ బకాసురుని ♦ నిబ్బువిలోపల గూల్తుమంచు వా
రవ్విధి వేసికొందురు భ ♦ యంబుల జెందుచు మానసంబులన్.

స్వర్గమర్త్య పాతాళ లోకంబులయందు నన్నెదిరించి నిల్చు వీరుండు లేఁడు. అట్టి యెడల స్వాంతంబున భయమింతయైనను లేక నా యెదుట నిల్చి యీరీతిని బలుకుచుంటివి! ఎటులైనను నీవి కాహారం బగుటకు నే తెంచితినిగదా యని తలంచి, కొన్ని పౌరుషవాక్యంబులాడిన విడవనే చచ్చుటకు దలంచి యిట్లు కాకలు ప్రేలుచుంటివి కాఁబోలు.

భీమ.—ఓరీ! క్రవ్యాదా! నీ ప్రగల్భవాక్యంబుల కిచ్చట నెవ్వరును భయమందువారు లేరు!

తే॥ గీ॥ బలము గలదంచు నెంచి గ ◆ ర్వమును బూని
యేకచక్ర పురంబున ◆ నెల్ల జనుల
హింసజేయుచు నుంటివి ◆ హీనచరిత
దాని నడగింపవచ్చితి ◆ దర్ప్యముగను.

ఓరీ! దురాత్మా! ధరాపాలుండు సామంతరాజులయొద్దను, ప్రజలయొద్దను గప్పము గైకొనుచుండు విధంబున నీవు పాపమని భావింపక నేకచక్రపురంబునంగల ప్రజలయొద్ద నిలువరుస బ్రతిదినంబును నొక మానిసి చొప్పున నాహారంబును గ్రహింపుచు కండబట్టియుంటివి. అదియెల్ల నీచే నేను గ్రక్కించెదను.

బకా—ఏమిరా! నీ కండకావరము.

కం॥ నరుఁడవు నీవు దలంపఁగ
నరభోజనుఁడ నగుదేను ◆ నాకును నీకున్
సరియగునే పోరాడఁగ
దురితాత్మా! పొమ్ము పొమ్ము ◆ దూరమ్మునకున్

భీము—ఓరీ! నీ బీరంబులనింకఁ జాలింపుము. కాలము సమీపించిన జ్వరబాధితుండు సంధియెత్తి యీరీతినే ప్రేలుచుండును. దుర్మతీ నాచేతఁబడిన నీవెందుబోగలవు. నేఁడు నిన్నెట్లయిన వధించి యేకచక్రపురవాసులు చిత్తంబుల సంతోషంబు నందుచు, దైత్యభయము లేకుండ సుఖించునట్లు గావించెద.

బకా—

శా॥ ఓహో! మృత్యువునీకు దారసిలిన ◆ ట్లుండెన్ రిపుస్తంభ స
ద్వ్యాహారసంపదగల్గు మాదృశులతోఁ ◆ దార్కొలు జూడన్ గనున్
సాహంకారత పక్షినాథుని సము ◆ త్కంబందు నిర్భీతితో
నాహా! యల్పఫణ్యంబుద్రిప్పెడు మహా ◆ వ్యాళంబు చందంబునన్

భీము—అరే! దైత్యాధమా! నీ భయంకరాకారంబునుం నీ యార్భాటంబులును జూచి యిక్కడ భీతిల్లువా డెవ్వడును లేడు. నీవలెనే నన్నెదిరించి, హిడింబాసురుండు గతించినాడు.

శా॥ ఉద్దండాదివి ఖండనక్షత మహో • ద్యద్ధ్వప్రసిద్ధప్రభా
బద్ధాస్మద్భుజదండ మండితగదా • పాతాహతిన్ నీతలల్
బ్రద్దల్ జేసెద భూతజాలము మదిన్ • బాగంచు గీర్తింపనా
గ్రద్దల్ మెక్కగమాంసఖండచయముల్ • ఖండించివైతున్ వడిన్.

నీ వేకచక్రపుర జనులను బెట్టుచున్న కష్టంబులన్నియు నేటితో యంతమైనవని తలంపుము.

బకా—ఓరీ! తుచ్ఛుడా! ఈ మాటలతో నేమి ప్రయోజనమున్నది. నీవే కాదు. చతుర్దశభువనంబులును మెక్కపెట్టున నెత్తివచ్చినను నిసుమంతయు భయంబందక వారి నందఱ జుట్టచుట్టి నా వదన గహ్వరంబున బ్రవేశపెట్టెదను.

భీము— కవిరాజ విరాజితము.

శరములు హస్తమునందున బూనుచు • శౌర్యము జూపక యీ
కరణిని విక్రమ ముండెనటంచును • గాఱులు ప్రేలెదవే
సరగున నన్ను నెదిర్చి రణంబును • సాహసమేర్పడగా
దురితరతా! యొనరింపుము నీదగు • దోర్బలముల్ గనెదన్.

బకా— కవిరాజ విరాజితము.

మదినిసుమంతయు భీతినిబూనక • మమ్మెదిరించెదవే
త్రిదశులుగూడను నన్నెదురింపక • ధీరతబాయగ; దు
ర్మదమున నీవిటు వచ్చితివా! సమ • రంబు నొనర్చుటకై
మదమును దూల్చెద ప్రాణము బాపెద • మానవ! చూడుమిదే.

భీము—నక్తంచరాధమా! అనవసర ప్రసంగములతో నేమి ప్రయోజనమున్నది. ఇంచుక నిల్చి రణంబొనర్చుము. నీ బలంబును

నా బలంబును తెల్లమగును. రమ్ము.

(అని యిరువురును రణంబునకు మొనయుచున్నారు.)

బకా—ఇదిగో! ఈ దెబ్బ గాచికొనుము.

భీము—(తప్పించుకొని) ఇదిగో నీదెబ్బ తప్పించుకొంటిని. ఈ ముష్టి ఘాతంబును జవిఁజూడుము.

బకా—ఇదిగో తప్పించుకొంటిని. వలసినేని బాణంబులు దెచ్చుకొని నాతో గయ్యం బొనర్పుము.

భీము—రాక్షసాధమా! నిన్ను జంపుటకు నా కాయుధంబులు గావలయునా! నా పిడికిటి పోటులే నిన్నంతం బొందించగలవు.

శా॥ రక్షోనాథను దేభకుంభదళన • ప్రజ్ఞా ప్రచండార్భటీ
దక్షౌత్యమ్ము విక్రముండ; విలస • ద్ధర్మావనీపాల హ
ర్యక్షేంద్ర ప్రియ సోదరుండ; ఘన భీ • మాఖ్యుండ దుష్టాత్మ త
ద్వక్షం బాయత తీక్ష్ణముష్టిహతి బ్ర • ద్దల్ జేతు వీక్షింపరా.

(అని దైత్యుని బట్టుకొని నేల బడవైచి)

ఉ॥ మించి పరాక్రమించితివ • మేదినియందున భీతిలేక; హిం
సించితివెల్ల భూసురుల • శ్రేయము నెంచక; నట్టి నిన్నిదే
దంచెద; బిండి పిండిగను • తప్పక నిప్పుడు సంతసంబు న
ర్పించెద నేకచక్రపుర • పృథ్వీసురౌఘము నన్ను మెచ్చఁగన్.

(బకుని జంపుచున్నాఁడు.)

బకా—(కేకలిడుచు ప్రాణములు విడుచును.)

భీము—(తనలో) ఇక్కడకీ దైత్యుండు నశించినాడు. వీని భయంకరమైన కళేబరమును పురజనులు జూచుటకై పురిలోనికి దెచ్చుకొని పోయెదగాక. (అట్లు చేయుచున్నాఁడు.)

(తెర వాలును.)

[రంగము:—విష్ణుశర్మ—ప్రవేశము.]

విష్ణు—(తనలో) ఈ పురంబున జాబాలి గృహంబున దిగిన యీ యేవురు భూసురులను జూచిన నాకది యొక తీరుగ ననుమానము దోచుచున్నది. ఒక్క వనితయు నేవురు కుమారులును నాతని యింట బసచేసి యున్నారంట. ఇది యిట్లుండ నందొక భూసురుండు యేకచక్రపురవాసులను జిరకాలమునుండి హింసించుచున్న బకాసురుని గడతేర్చి ప్రజల రక్షించినాడట. ఒకవేళ వారణాసియందు లాక్షాగృహానలజ్వాలలనుండి భగవంతుని కరుణచేఁ బాండవులు తమ జననియగు కుంతితోఁ దప్పించుకొని వచ్చి యీ పురంబున నిట్లు బ్రచ్ఛన్న వేషంబులతో మెలంగుచుండుట లేదుగదా. (ఆలోచించి) అవును. అట్లైనందుకుఁ గాఁగూడదు. నిరంతరము శ్రీ వాసుదేవ కరుణావర్ధిష్ణులగు వారేయుపాయంబునను బాల్పడుదురని తలంపను. అదియునుగాక త్రిలోకభీకరుండైన బకాసురుని జంపుటకు సామాన్యుఁ డెవ్వఁడోపును. అట్టి కార్యము భీముడే జేసియుండునని నా యభిప్రాయము. నేను వారితో ద్రుపదపుత్రికా స్వయంవర మహోత్సవము జరుగునని మాటవరుసకు జెప్పితినిగాని, యవ్విషయంబునుగూర్చి నేను సవిస్తరముగఁ బ్రశంసించలేదు. వీరు నిజముగ బాండవులగుదురో కారో యను సంశయము దీర్చుకొన్నచో నా కెంతయు నానందముగనుండి యుండునుగదా. నిశ్చయముగా వీరే పాండవులై యుండిరేని, వీరి వార్త నేను ద్రుపద మహీపాలునకుం దెలిపితినేని, "లాక్షాగృహదావంబున బడి దగ్ధులైపోయిరి? ఆ యర్జున కిచ్చుటకై యీ ద్రౌపదిని యగ్ని కుండంబున గాంచితి. అతని కొసంగ నిర్దేశించిన యువ

తిని నింకొకరి కట్టియనేర్తు" నని మిగుల విచార మొందుచున్న యీ రాజచంద్రుఁడు నా కెంతయో బహుమతి నిచ్చునుగదా. ఇంతకును నాయదృష్ట మెట్లున్నదో. అరుగో! ఎవ్వరో! ఇట్టు వచ్చుచున్నారు. (పరికించి) ఎవ్వరో యనుకొన్నాను. జాబాలి గృహంబున బసచేసిన యేవురి భూసురులలో నివాడే. కానిమ్ము. ఇక్కడ నెవ్వరును లేరు. వీరు పాండవు లగుదురా కాదా యను సంశయ మిప్పుడు దీర్చుకొందు. (అని. తన మూటలో నున్న ద్రౌపదియొక్క చిత్రపటమునుదీసి జూచుచున్నాడు.)

[బ్రాహ్మణ వేషధరుండైన యర్జునుఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

అర్జు—(తనలో) ఈ పురంబున కరుదెంచి మేము విడిసిన గృహమందే విడిసిన, పాంచాలరాజ పురోహితుండగు విష్ణుశర్మ మాతో రాఁగల పౌషమాసంబున శుక్లపక్షంబున సప్తమియు రోహిణి నాడు, యీ రాజేంద్రుని పుత్రికయగు ద్రౌపదికి స్వయంవర మహోత్సవంబు జరుపబడునని చెప్పెను. ఆ స్వయంవర మహోత్సవంబున. ననేక రాజులేగుదురు; కాని మేమట్టిభాగ్యమును నోచికొంటిమో లేదో కదా. (దుర్యోధను నుద్దేశించి) ఓరీ! దుర్యోధనా! నీమూలంబున మే మెట్టిసంకటములపాల్పడితిమిరా! ఎవ్వని బాహుదండముననిలిచి హస్తినాపురరాజ్యలక్ష్మి యొకింతయైన చలింపక నిల్చినదో యట్టి నీపినతండ్రియగు పాండుభూవరునకుఁ బుత్రులమైన మాచే బ్రాహ్మణవేషంబుల బిచ్చమెత్తునట్లు గావించితివి. కానిమ్ము. ఈపాపంబంతయు నీవనుభవింపకపోవు. (ఎదుట విష్ణుశర్మనుజూచి) ఇదుగో! ఇంతకు బూర్వము జాబాలిగృహమున భుజించిన ద్రుపదరాజపురో

హితుండు (విష్ణుశర్మనుజూచి) భూసురోత్తమా! నమస్కారములు.

విష్ణు—శీఘ్రమేవ వివాహసిద్ధిరస్తు!

అర్జు—మహానుభావా! మీకునాయందుగలిగిన వాత్సల్యముచేత నట్లు దీవింపుచున్నారుగాని, పురాకృతప్రారబ్ధవశంబున నిట్లు చరింపుచున్న మాకు వివాహమెట్లగును.

విష్ణు—నాయినా! ఇందుఁ బరులెవ్వరునులేరు. నీవును బ్రాహ్మణుండవే! నేనును బ్రాహ్మణుండనే. మీరు చేసికొన్న ప్రారబ్ధ మేమున్నది. ఇప్పుడు మీకుబడుచున్న యిడుములెవ్వి. నాకు వినిపించితివేని తగిన శాంతిజేయుటకు బ్రయత్నముజేయుదును.

అర్జు—పుణ్యపురుషా! నీ నిర్హేతుకజాయమానకటాక్షంబున కనేకవందనంబు లర్పించుచున్నాను. భగవంతుడు మా మానసపరీక్షార్థమై తెచ్చిపెట్టిన కడగండ్ల నాతడే దీర్పవలెనుగాని మానవమాత్రులకు దరంబుగాదు.

విష్ణు—(తనలో) ఈతనిమాటలనుబట్టి నాయనుమానము మఱింత యధికమగుచున్నది.

అర్జు—ఆర్యా! తమ హస్తమునందున్నది యేమిటి?

విష్ణు—ఇంతకుబూర్వమే ద్రుపదపుత్రికకు స్వయంవరమహోత్సవంబని జెప్పియుంటినిగదా. ఇయ్యది యాకన్యకయొక్క చిత్రపటమే!

అర్జు—దేవా! నన్నొకసారి చూచుట కనుగ్రహించెదరా!

విష్ణు—చిత్రపటమా! నీవుచూచెదవా! అంతేటకోర్కెయున్నదా!

అర్జు—అమ్మానినీ మణిసౌందర్యవిశేషంబుల నొక్కసారి కన్నులారగని సంతసించెదను.

విష్ణు—(పటము నిచ్చుచున్నాఁడు.)

అర్జు—

సీ॥ ఘోరకాననభూము • లే; రమణీయమై
బఱగెడియుద్యాన • వనములయ్యె
యడవులందుండు భ • యంకరమృగముల
రవములే సంగీత • రవములయ్యె
ప్రీతియింటఁ దెచ్చిన • మధుకరాన్నమె; భక్ష్య
పూరితమైనట్టి • భోజ్యమయ్యె
మానీంద్రచంద్రుల • పర్ణశాలలె; దివ్య
రత్నప్రభాసౌధ • రాజియయ్యె

తే॥ గీ॥ నక్కటా! యంధుఁడౌ ధృతరాష్ట్రు • నాత్మజాతు
కారణంబుననీరీతిఁ • గ్రిలవలసె
పుట్టుభోగివినీవు మ • మ్ములనుగూడి
కష్టముల బడుచుంటివి • గాదె! తల్లి.

కుంతి—కుమారా! ఆగర్భశ్రీమంతులును, రాజ్యంబు బరిపాలింపదగిన వారును, విక్రమాఢ్యులును, బాల్య వయస్కులును నయిన మీరే యిడుములు బడుచుండగా, నేనా మోర్వజాలనిదానను.

భీము—ఇట్టి సంకటంబులన్నియు మనకీ ధార్తరాష్ట్రాగ్రజుని మూలంబున గలిగినవి. అన్నగారు మొన్న యనుజ్ఞ యిచ్చియుండిరేని గదామాత్ర సహాయుండనై యరిగి యా దురాత్ముని సోదర సమేతంబుగా సంతికునిపీటి కీపాటి బుచ్చియేయుందును.

ధర్మ—కాలమునకుఁ గట్టుబడి యుండవలెను. వ్యాసమునీంద్రుండు మనకు శుభదినంబులువచ్చు కాలము సమీపించినదనియు, ద్రౌపదీ స్వయంవరమునకు మనలనుగూడ నరిగి బ్రాహ్మణ వేషంబులనే యుండుడనియుఁ జెప్పెనుగదా!

కుంతీ—(అంగారపర్ణునిజూచి) మనోహరా! ఈ ప్రక్కనుండి యెవ్వరో నరులు వచ్చుచున్నారు. నాకు మిగుల భయమగుచున్నది. దేహము కంపమెత్తుచున్నది.

అంగా—రమణీ! వారినిటు రానిమ్ము. (పాండవులు సమీపించుటఁ జూచి) ఓహో! నరులారా! అర్ధరాత్రియు సంధ్యయు నీ రెండు కాలంబులును, భూత యక్ష దానవ గంధర్వులు దిమ్మరియెడు కాలంబులని మీ రెఱుంగరుకాఁబోలు. ఇట్టి సమయంబులందు భూలోక నివాసులగు మానవులు సంచరించుటకు భయంబందుదురు. అదియుంగాక నివ్వేళలయందు మేమెంతటి పరాక్రమవంతులనైనను నిర్జింపగలము. అట్టియెడ నేను తరుణితో నిచ్చట విహరింపుచుండ నా విహారంబునకు భంగముగల్గ జేయ మీరు వచ్చుటకేల సాహసించితిరి. తెలిసియో తెలియకనో యరుదెంచిరి. ఇంక జీవితేచ్ఛగలవారేని సత్వరమ్ముగ నిచ్చోటు వాసిపొండు.

అర్జు—ఓయీ! నీవెవ్వరవో ముందు మేమెఱింగియుండినఁగాని తగు ప్రత్యుత్తరంబు నొసంగఁజాలము.

అంగా—ఏమీ! నే నెవ్వరినో మీకుఁ దెలుపవలయునా! వినుము నేను యక్షేశ్వరుండగు కుబేరునకు బ్రియసఖుండ. మహాబల పరాక్రమ సంపన్నుఁడ. అంగారవర్ణాభిధానుండ. నిరంతరమును యీ నదీతీరమున కాంతా సమేతుండనై యిట్టి సమయంబులందు విహరింపుచుందును. మఱియు నివ్వనంబంగారవర్ణవను నామంబున దనరుచున్నది. నేను విహరించు సమయంబులందిచ్చట కెవ్వరును రానోపుదురు.

అర్జు—అంగారవర్ణా!

తే॥ గీ॥ భీతిఁబొందిన వారలి ♦ వ్వేళలందు
సంచరింపక యుందురు ♦ సాహసమున
బలము; శౌర్యంబు గల్గిన ♦ వారమగుట
సంచరింతుము గంధర్వ ♦ సార్వభౌమ.

మా కెట్టివేళలయందునైన జరించుటకు హృదయంబులయందు భయముండదు. అందుచేతనే యిట్లు బయలుదేఱితిమి. (అని ముందుకు నడచుచున్నారు.)

అంగా—(అడ్డగించి) ఓ మనుష్యకీటకములారా! నా మాటల కెదురించి మీరందఱును నొక్క యడుగైనను నవతలఁ బెట్టగలరా? ఈ సమయంబున నీ నదియొద్దకు మీరు పోగూడదు. ఇయ్యది నాయది. నా యాజ్ఞ నుల్లంఘించి పోదలంచితిరేని మీకు ప్రాణంబులు దక్కవు. (ధనుష్టంకారమొనర్చును.)

అర్జు—గంధర్వుఁడా! నీ వీరాలాపంబులకిక్కడ భీతినొందువారెవ్వరును లేరు. అడవులయందును, నేఱులయందును నీకు స్వాతంత్ర్య మెట్లుండును. త్రిభువనపావనియు, సకల జనులకును సేవ్యంబయినదియు నైన యీ గంగ నీయది యెట్లగును!

సీ॥ హిమాచలమునుండి ♦ యింపార జనుదెంచి
భాగీరథియనెడు ♦ భవ్యనామ
మును ధరియించి యి ♦ బ్భూమిపై శోభిల్లె;
భోగవతియటంచుఁ ♦ బొలుపుసందె
పాతాళమందున; ♦ సురసిద్ధసాధ్యయ
చ్చరముని సేవ్యమై ♦ సత్పథమున
మందాకినియను నా ♦ మంబున రాజిల్లె;
నలపార్వతీశు జ ♦ టాగ్రభాగ

తే॥ గీ॥ ముందు ధరియింపఁగాఁబడి • యఖిలలోక
సేవ్యమైనట్టి గంగను • జేరవలద
టంచు సాహసంబున నీవ • డించుమాట
నవ్వఁజాలించు విచ్చట • హీనచరిత.

ఓయీ! ఇంక నీవు మా కడ్డురాకుము. అట్లు గావించితివేని నా బాణాగ్ని జ్వాలలయందు నిన్ను దగ్ధునిఁగా జేసెద.* (నడచుచున్నాఁడు.)

అంగా—ఏమిరా! నీ కండకావరము. హీనమర్త్యుండవైన నీవే నన్నె దిరింపఁ దలంచితివా!

కవిరాజవిరాజితము.

నిలు నిలు మెచ్చటి కిప్పుడు బోయెదు • నీచమనంబున; నా
పలుకుల నింతయు వీనులబెట్టక • బాఱగ నెంచితివే
తులువతనంబును మానుము నీదగు • దోర్బలమంతయు ని
ప్పుడె గనుపింపగజేయుము; దుంచెద • భూరి శరంబుల చేన్.

అర్జు—(కోపావేశమున)

శా॥ ఓగోరీ! భయమింతలేక మదిలో • నుగ్రాహవ క్రీడలో
ధీరత్వంబున నన్నెదుర్చుటకునై • తీండ్రింపుచున్నాఁడవే
రారా నీబలమెట్టిదో కనెద; శ • స్త్రాస్త్రంబులం గప్పి; నిన్
జేరంబుత్తును కాలువీటి కిపుడే • శీఘ్రంబుగా దుర్మతీ.

నీ మాయలు, తంత్రంబులును, గంధర్వ విద్యలును నాయెదుట బనికిరావు. (తన యస్త్రమును జూచి) పూజ్యమగు నో యస్త్రమా!

మ॥ వరపాంచాల ధరాధినాయకు సుతన్ • వైవాహికంబాడగా
నరగన్ బోవుచునుండ నీకరణి నీ • చాత్ముండు గంధర్వ తే
జరయున్ మమ్ముల నడ్డగించెను మహా • హంకారుడై; కావునన్
శస్త్రమా! వీని దహించివేయుము; కటా • తుంబూని నాపైనన్.

(అని మంత్రించి ఆగ్నేయాస్త్రము విడుచును.)

అంగా—(అస్త్రజ్వాలలం గాంచి) హా! చచ్చితి. చచ్చితి. (మూర్ఛ నందును.)

కుంభీ—(అంగారపర్ణునిం జేరి)

సీ॥ హా! మన్మనోహర! ♦ యస్త్రవిముక్తమైన
నితని నెదురించి ♦ తేలనీవు
మఱచితే నీవు ♦ మానినీమణి నీకు
జేయుచున్నట్టి యా ♦ సేవలెల్ల
అలుక జనించెనే ♦ యాత్మేశ నీకును
దోయజాక్షిపయిన్; నా ♦ దోషమేమి
కాంతతోనింక; సౌ ♦ ఖ్యంబులేల యటంచు
విసుకుదోచెన మహా ♦ విక్రమాఢ్య
తే॥ గీ॥ హా! మదీయ పుణ్యఫలంబ! ♦ హా గుణాఢ్య!
హా! కుబేర సఖ! రణ వి ♦ ద్యా ప్రవీణ!
హా! విజిత చంద్రబింబ! స ♦ త్య పరిపాల!
హా! మనోహార! రవితేజ! ♦ హానిజేశ.

హా! ప్రాణేశ్వరా! బలపరాక్రమ విక్రమోపేతులని యెఱుంగక వీరి నేల యెదిరించితివి. అయ్యో! నన్ను విడనాడి పోవుటకు నీ చిత్తంబెట్లు సమ్మతించినది. యమునాతీరవిహారసౌఖ్యంబు నీతోఁగలసి యుండ దలంచి యరుదెంచిన నీ మనోహారిణగు నన్నిట్లొంటరిగా విడిచి పోవుట నీకు ధర్మమా! నీకై కన్నుల నశ్రుబిందువులు ప్రవాహంబుగా బాఱునట్లు విలపించు నీ ప్రియురాలిని నాదరింపకుండుట మేఱగాదు. సంపూర్ణపూర్ణిమా చంద్రబింబమును ధిక్కరించు నీ ముఖంబు నేడిట్లు ధూళిచేఁ గప్పఁబడియుండ నేఁజూచి యోర్వఁగలనా! అక్కటా!

కలువ రేకులమించు నీ కన్ను గవమూసి యుంచితివేల. ఇదిగో! నీ కాంత నీ ప్రక్కఁజేరి విలపించుచుండగా నేల వీక్షింపవు. నీవు లేని యీ జగంబంతయు నంధకారబంధురమైన విధంబున నాకు గనుపించుచున్నది. (పాండవులఁజూచి) పరాక్రమశౌర్యవంతులగు నో మహానుభావులారా! నా విన్నప మాలకింపుఁడు. మన్మనోహరుండగు నీతండు ధర్మపరతుండయ్యును మోహనిర్మగ్నుఁడై మీపరాక్రమంబు దెలియక మిమ్ముల నడ్డగించి యిట్టిపాటును బొందియున్నాఁడు. ఈతనివలన నేరము లేదని నేను జెప్పసాహసింపనుగాని పతిలేకున్న నేను ప్రాణంబుల ధరింపఁజాలను. నాయందు కృపాంతరంగులై యీతనిదోషంబు మన్నించి నాకుఁ బతిభిక్షఁబెట్టుఁడు. లేదేని నన్నుగూడ నాతనిసన్నిధికిం జేర్పుఁడు. దీనయై వేడుచున్న నా మొర నాలింపుఁడు.

కుంతి—కుమారులారా! ఆడుదానిమనస్సునకు కష్టము గల్పింపరాదు.

ధర్మ—తమ్ముఁడా! అర్జునా! ఈగంధర్వుని భార్యపలుకులు నాకెంతయు జాలిఁగలుగఁజేయుచున్నవి. ఈయంగారపర్ణుడు మనయెడల నిట్టిసాహసము దెలియకజేసినాడు. కావున నీతనిని రక్షించి యీమెకు నానందంబుగలుగఁజేయుము. నీయాగ్నేయాస్త్రంబు నుపసంహరింపుము.

అర్జు—(ఆగ్నేయాస్త్రంబు నుపసంహరించి యంగారపర్ణునిఁజేరి) అంగారపర్ణా! నీవింక భయంబువిడువుము. అన్నగారియాజ్ఞచే నీవు నాచే రక్షింపఁబడితివి. (కుంభీనసినిఁజూచి) సాధ్వీమణీ! నీవింక చింతదక్కుము.

అంగా—(లేచి పాండవులంజూచి) మహాత్ములారా! మీకు నమస్కరింపుచున్నాను.

ధర్మ—అంగారపర్ణా! నీవింక భయంబునువిడువుము. మాచే రక్షింపఁబడితివి.

అంగా—పూజ్యులగు నో మహానుభావులారా!

తే॥ గీ॥ భవ్యభవదీయవిక్రమ • బలము లెఱుఁగ
జాలకను జేసినాడను • సాహసంబు
ఫలముగాంచినాడను నిప్డు • బవరమందు
దప్పు మన్నించి బ్రోవుఁడీ • దయ వలిర్ప.

అయ్యలారా! నేను మీచే నోడింపఁబడితిని. అట్లు పరాజితుండ నగుటచేత నాయంగారపర్ణనామంబున నినుమలను స్మరింపఁజాలను. మహాత్ములగు మీరు ప్రచ్ఛన్నవేషంబులనుండుటచే గుర్తింపలేకపోయితిని. ఇప్పుడు నాకు మీరు పాండవేయులని గోచరమునకువచ్చినది. (అర్జునునిజూచి) అర్జునా! వీరపురుషా! నేను నీచేత నోడింపఁబడియు, నారథంబు నీ యాగ్నేయాస్త్రంబున దగ్ధంబుగావించినను గంధర్వమాయచే వేరొకరథము బడయుటచే నేటినుండి చిత్రరథుండను నామంబును దాల్చెద. మీ యెడల నేనాచరించినదోషంబును మన్నించి మీతో సఖ్యము నాకు దయసేయుఁడు.

ధర్మ—గంధర్వరాజా! పాపము జేసియు పశ్చాత్తాపమునందుచుంటివిగాన నీయందు దాదోషము లేదు. నిన్ను నేటినుండియు మాకు బరమసఖునిగా భావించెదము.

అంగా—(అర్జునునిజూచి) పాండవమధ్యమా! నీపరాక్రమంబునకు నే నెంతేయు మెచ్చితిని. నాయొద్ద చాక్షుషియను విద్యయొకటి కలదు. ఇయ్యది నేను తపంబునఁ బడసితి. దానిప్రభావంబు వర్ణింపదరముగాదు. దానిప్రభావంబున మూఁడులోకంబులును జూచి యథేచ్ఛగా జరింపవచ్చును. అయ్యది నీకొసంగెద. ఇంతియగాక మహాజవసత్వంబులును, గామగమనంబును గల గంధర్వహయంబులు మీ యేవురకును నైదునూర్ల నొసంగెద. నా

యందు గరుణాంతరంగుండవై నీ యాగ్నేయాస్త్రంబు నాకొ
సంగుము.

అర్జు—గంధర్వరాజా! ఏంతటిమిత్త్రి చేతనైనను నుపకారమాచరించి యందులకు బ్రతిఫలముక్రింద ధనంబుగొనుటకు చిత్తంబు సమ్మతింపదు. అయినను నీయొద్దనున్న విద్య నీయంతటనీవు నాకిచ్చెదనని పలుకుచున్నావు. నీకుగావలసిన యాగ్నేయాస్త్రంబిదే యొసంగెద. గైకొమ్ము. (ఆగ్నేయాస్త్రమునిచ్చును.)

అంగా—నీకు చాక్షుషి నుపదేశించెదను. (అర్జునునిచెవిలో నేదియో చెప్పును.)

ధర్మ—అంగారపర్ణా! నీవు మాకొసంగెదనన్న రథంబును హయంబులును నీయొద్దనే యుంచుము. వలసినప్పుడు మేము తీసుకొనెదము.

అంగా—మీచిత్తమువచ్చినట్లాచరింపుఁడు.

అర్జు—గంధర్వశేఖరా! ఇకమాకరుగుట కాజ్ఞయిచ్చెదవా!

అంగా—పాండవేయులారా! మీరు ద్రుపదరాజనందనస్వయంవరార్థమై యరుగుచున్నారని నాకుఁ దెలియును. మీరీమార్గంబున బోయితిరేని యొక యాశ్రమంబును జూడఁగలరు. అందు ధౌమ్యుండను భూసురుండుండును. ఆతనిని బురోహితునిగా గైకొని పాంచాలంబున కరుగుఁడు. మీయభీష్టంబులన్నియు నాతనివలన దీఱును.

ధర్మ—మిత్త్రమా! నీవుచెప్పినయట్లొనర్చెదము. ఇఁక మేమరిగెదము.

(నిష్క్రమించును.)

అంగా—రమణీ! నరసంచారమిక్కడుగ నుండువేళయైనది. కావున మన నెలవున కరుగుదము. రమ్ము. (అంగారపర్ణుఁడు కుంభీనస నిష్క్రమించుచున్నారు.)

అర్జు—(చిత్రపటంబునుజూచి) భూసురోత్తమా ! ఈమెసౌందర్యంబు
జూచుటకీ రెండుకన్నులును జాలకయున్నవి.

తే॥ గీ॥ ఈమెతోఁబోల్పఁ దగువస్తు • వేదియైన
జగమునందున లేదు ని • శ్చయముగాను
నీమె కీమెయెసాటియౌ • నెంచిచూడ
లేన లేదీమెబోలెడి • లేమయెచట.

విష్ణు—నీవు నిజముచెప్పితివి.

అర్జు—ధరామరవర్యా! చూడుము.

ఉ॥ మానినియిట్టి దుండెనని • మ్రొక్కులు గన్గొనియున్న; చంద్రబిం
బాననరూప చిత్రపట • మంచితలీల గ్రహించివారి శ
య్యానిలయంబులందుఁ దమ • యంగనలెల్లరు రూపగర్వముఁ
మానుటకై ఘటింపఁగను • మానక నెంచుచు నుండరే సదా.

విష్ణు—నీవు వయస్సున నా కంటె జిన్నవాడవయ్యు మంచి మాట
జెప్పినావు.

అర్జు—దేవా !

తే॥ గీ॥ ఏరినిఁ గృతార్థులుగఁజేయ • నెంచినాఁడొ
గాక తనసృష్టి నేర్పులు • గానిపింప
నయ్యజుఁడీమె నిర్మించి • యలరినాఁడొ
తీర్చినట్టులె యున్నది • దివ్యవనిత.

(తనలో) ఈమె చిత్రపటంబును జూచినంతనే నా హృదయము చంచలించిపోయినది. ఇట్టి నారీమణిని జూచినంతనే పరమనిష్ఠాగరిష్ఠాత్ములయిన మునులే తమ తపంబులను విడిచి యీమెకు దాసులై వర్తింతురనుటకేమియు సందియము లేదు.

విష్ణు—భూసురా! ఇక్కాంత యెవ్వరిని కృతార్థునిఁ జేయుటకు జన్మించినదనియా యడిగితివి! అందుల కేమని ప్రత్యుత్తరం బిత్తునా యని యాలోచింపుచుంటిని.

అర్జు—దేవా! అట్లు వచియింపుచుంటి రేమి!

విష్ణు—ఏమియును లేదు. అయినను వినఁదలంచితివి గాన యీయుదంతంబు సవిస్తరంబుగ నీకుఁ దెలిపెద. వెనుక నొకనాడు పాండవ కౌరవుల శస్త్రగురుండైన ద్రోణాచార్యుండు తన బాల్యసఖుండైన ద్రుపదుని సన్నిధి కరిగి తన బాలునకు క్షీరంబు నిమిత్తమై యొక గోవును నొసంగుమని కోర, ద్రుపదుండు ద్రోణుని సఖ్యంబును మఱచి యతనికి గోవు నొసంగక యనేక మాటలాడి పరాభవమొనర్చి పంపెను. అంతట నా యాచార్యుండు కరినగరంబున కరుదెంచి కురుపాండవుల శస్త్రగురుండై యొక్క దినంబున నిరుతెగలవారిని జూచి గురుదక్షిణగా ద్రుపదుని గట్టి తెచ్చి తన కప్పగింపుడని యడిగెను. ఆమాటలు విని ముందు కౌరవులరిగి ద్రుపదునిచేఁ బరాజితులై యరుదెంచిరి. అనంతర మర్జునుండు చని నిర్వక్ర పరాక్రమంబున నా పాంచాలాధీశునితోఁ బోరాడి యాతనిని దన రథమునకు గట్టి తెచ్చి ద్రోణుని సన్నిధినిఁ బెట్టెను. ద్రోణుండును ద్రుపదున కేహానియు గూర్పకుండ నతనిని విడిచిపుచ్చెను. అనంతరము ద్రుపదుండు తత్పరాభవముచే ఖిన్నుఁడయ్యు నర్జునుని పరాక్రమంబునకు మెచ్చి యతనికి సతిగా దగిన కూతురును, ద్రోణుని వధించునట్టి కొడుకును బడయుదునని యథావిధిగ బ్రాహ్మణుల సన్నిధిని పుత్రికామేష్టి గావించెను. అప్పుడు యగ్నికుండమునుండి దృష్టద్యుమ్నుఁడను పుత్రుండును, కృష్ణయను పుత్రికయు ను

ద్భవించిరి. కృష్ణ యనియు, ద్రౌపది యనియు, పాంచాలియనియు బిలువఁబడు నా పుత్రికను ద్రుపదుం డర్జునున కీయఁదలంచి యుండగా, విధిప్రేరణంబున నా పాండవులు జననీ సమేతంబుగా వారణాసిని లక్క యింట దగ్ధులైరని విని మిగుల విచారించి యీ స్వయంవరము ఘోషింపజేసినాఁడు.

అర్జు—(తనలో) ఓ! ద్రౌపదీ కాంతాలలామా! నే నిప్పుడు సంపూర్తిగ నీకు దాసుండనై తిని సుమా!

తే॥ గీ॥ కన్నులున్నట్టి ఫలముఁ • గాంచినాఁడ
నోరు మున్నంగ నుతియింప • నోచినాఁడ
గాని నిన్ను వైవాహి • కంబునాఁను
బాగ్యమిఁక గల్గునో లేదో • పడతి! యెఱుఁగ.

శా॥ నాకుఁ బెండిలిసేయఁగాదలఁచి భూ • నాథాగ్రణీమాళి; స
దా శాపూర్ణ సుధాకరాస్యను నినుఁ • రాజిల్లఁగాఁ గాంచి; యా
హా! కౌరవ్యుల మాయలోఁ బడినవా • రంచుఁ మమున్ జూచి యా
క్ష్మాకాంతుండు స్వయంవరంబు నిపుడుఁ • గావింపగాఁ నెంచెనే.

బ్రాహ్మణవేషంబుననున్న నేను స్వయంవరమున కెట్లరుదెంతును. అరుదెంచెదనుగాక! ఇతఁడే యర్జునుండని నిన్ను నాకు నీ తండ్రి యెట్లొసంగి పరిణయంబును సేయును. నాయంతట నేను చెప్పకొన్నచోఁ బ్రయోజనము లేదుకదా. (ప్రకాశముగా) భూసురవర్యా! ఆ స్వయంవరంబున కన్నెను గొనుటకు ద్రుపదుండేమైన నియమంబులు పెట్టెనా!

విష్ణు—ఏమి లేకుండ నెట్లు జరుగును. ఏదియును లేకపోయినచోఁ బ్రతివారును గన్నెను నాకిమ్మనియే యడుగుదురు. స్వయంవర సభామధ్యంబున నుంచఁబడు మత్స్య యంత్రమును గొట్టినవా

రికా కన్యక నిత్తునని చాటఁ బంచినాఁడు. ఎవ్వరా మత్స్యయంత్రమును గొట్టుదురో వారే యక్కన్నియం గొనుట కర్హులు.

అర్జు—అట్లయిన బ్రహ్మణులు క్షత్రియులను విచక్షత లేదు కాబోలు.

విష్ణు—అట్టి దేమియును లేదు. ఎవరు ప్రయత్నించినను బ్రయత్నింప వచ్చును.

అర్జు—అట్లయిన మేము తన్మహోత్సవ సమయంబునకు వచ్చుట కరుదెంచెదము. (ఎదుటకేగి) అదుగో వ్యాస మునీంద్రుండు గాబోలు వచ్చుచున్నాఁడు. నే నీతని కెదురేగి మా గృహంబునకు దోడ్కొనిపోవలయును.

(నిష్క్రమించును.)

విష్ణు—నేనును నరిగెద. వీరే తప్పక పాండవులని తోచుచున్నది. కాకున్న నితఁడు నిజమైన బ్రాహ్మణుఁడైనచో స్వయంవరమునకు దాను గూడ వచ్చెదనని యేల పలుకవలయును. నేనే భాగ్యవంతుఁడనగు యోగ్యత యుండెనేని వీరే పాండవులగుదురుగాక.

(నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము

సంపూర్ణము.

శ్రీ

ద్రౌపదీపరిణయము.

చతుర్థాంకము.

రంగము:—[యమునానదీ తీరము:—ప్రవేశము
అంగారపర్ణుఁడు, భార్యయగు కుంభీనస.]

అంగా—సుందరవదనా ! ఈ యమునా జలంబులనుండి వచ్చుచున్న మంద మారుతంబు మన దేహంబులకెంత విందొనగూర్చుచున్నదో గంటివా !

కుంభీ—మనోహరా ! దానికేమిగాని యిది చూడుము. ఈ యొడ్డున మన మాసీనులమైయుండ, తరంగములచే జలంబు లొడ్డును దాకునప్పుడు గాలిచే నీటి బిందువులు దేహమునకు దాకునప్పుడు మఱింత సుఖముగా నుండునుగదా.

అంగా—అవును నిశ్చయము. అదే చూడుము !

తే॥ గీ॥ జారచోరులు మదిలోన ♦ జాలగుంద
నల చకోరకంబులు గడు ♦ హర్షమంద
బద్మములు దమ మోములు ♦ వంచివేయ
జంద్రుఁడుదయించె కాంతిని ♦ సాంద్రుఁడగుచు.

కుంభీ—ఆహా ! ఆ సుధాకరుం డుదయించి తన సంపూర్ణమైన కళలను జగంబునఁ బ్రకాశింపఁజేయుచున్నాఁడు. ఈతని రాక మన కిప్పుడెంతయు నానందకరముగదా !

అంగా—రమణీమణీ ! ఆతనిరాక యొకప్పుడు సంతోషకరంబును, నొక ప్పుడు దుఃఖదాయకంబుగూడ నగును.

కుంభీ—నాథా ! నీవట్లు వచియించెదవేల !

అంగా—

తే॥ గీ॥ పడఁతితోఁగూడి యంగార ♦ పర్ణుఁడిపుడు
వనవిహారము సేయుంగ ♦ వచ్చెననుచు
దాడివెడలెను నామీఁద ♦ తరుణి ! యతఁడు
నీదు కరుణ లేకను గెల్వ ♦ నేరనతని.

కుంభీ—(సిగ్గుతోఁ దల వాల్చుకొనును.)

అంగా—సతీ ! లజ్జ నభినయించెదవేల ! ఈ మందమారుతంబున కాంత దు దోడై మన్మథునితోఁ జెప్పి నాపై బుష్పశరముల బఱుపఁ జేయుచున్నాఁడు.

వసంతతిలకము. సరోజపత్ర నేత్రి యింక ♦ జాలమేలనే
మరుండు పొంచి పొంచివేసి ♦ బాణజాలముల్
బిరాననీవు ప్రేమబూని ♦ భీతి మాన్పుమీ
స్మరాంబకంబు లెల్లనిప్డు ♦ జక్కఁ జేయుచున్.

కుంభీ—ప్రాణేశ్వరా ! మీ సరసంబుల కేమిగాని, ఆ సైకత స్థలం బందు గొంతకాలము విశ్రమింతమా !

అంగా—ఔరా రత్నమా ! ఆ సైకతస్థలములకన్న నివి బాగుండును చూడుము. వెన్నెల యగుటచే నేత్రపర్వ మొనరించుచున్న యీ మందార సహకార చందన కేసరి పున్నాగ తాలతక్కోల వకుళజాజి కురువిందతిలక హింతాలమాదవీప్రముఖతరు లతాము లెట్లు శోభిల్లుచున్నవో. ఈ పువ్వులన్నియు గోసికొని పుష్ప శయ్య నమర్చుకొందము. (అని పువ్వులు గోయుచున్నాఁడు.)

కుంభీ—నాథా! మీ పుష్పాపచయంబిక చాలును. రండు. ఇచ్చట కూర్చుందము.

అంగా—రమణీ! అయిపోయినది. మన మింతవరకును నామూలనున్న పుష్పతరులతాదులనువీక్షించి యుండలేదు. ఆ ప్రక్కనుగూడ విహరింతము రమ్ము.

కుంభీ—అబ్బా! నేను నడువజాలకయుంటిని. ఇంచుకకాల మిచ్చట విశ్రమింతము.

అంగా—

మ॥ స్తనభారం బధికంబు లేనడుము కొం ♦ చం బౌచు మెప్పారఁ టన్
స్తనయుగ్మంబిటు రెమ్ము నేనదిక నా ♦ బ్జాతంబునఁ బట్టి మె
ల్లనగానిఁ న్నడిపించెదఁ మదికి నా ♦ హ్లాదంబు సంధిల్లఁ గా
ననుమానింపకరమ్ము సత్వరముగా ♦ నబ్జాత పత్రేక్షణా.

కుంభీ—(సిగ్గునఁ దల వాల్చును.)

అంగా—రమ్ము. (అని చేయి బట్టుకొనుచున్నాడు)

కుంభీ—ప్రాణేశ్వరా! ఏమికారణమోగాని నా చిత్తంబున నిప్పుడపరిమితమైన భీతి జనించుచున్నది. నా యెడమకన్నును నెడమ భుజంబును నదరుచున్నది.

అంగా—బేలా! నేను నీయుండనుండగా నీకెట్టిభయము కలుగును. నా ప్రక్క నుండుము.

[అంత పాండవులు ప్రవేశించుచున్నారు.]

ధర్మ—తమ్ములారా! ఆ వ్యాసమునీంద్రుడు చెప్పిన వాక్యంబులు మీరు వింటిరిగదా. ద్రౌపదీ స్వయంవర మహోత్సవంబును గూర్చి మనకు సవిస్తరంబుగ దెలిపినాడు. అతని యానతిచొప్పున మన మిచ్చటు బ్రివర్తించవలయును.

కుంతి—ఇట్టి సమయంబున మనకు ఘటోత్కచుఁడుగూడ సహాయుఁ డుండిన బాగుగనుండునుగదా. అతఁడు జనించినవెంటనే యెప్పుడుదలంచి నప్పు డరుదెంచెదనని చెప్పి తల్లియగు హిడింబిని దోడ్కొని తన యాశ్రమంబున కరిగినాఁడు.

భీమ—అమ్మా! నీకిప్పుడు భయమేలకలుగవలయును.

కుంతి—తండ్రులారా! నేను మాట వరుసకంటిని. మీరిందఱుండగా నాకేమిభయము! ఇంకను పాంచాలపురం బెంతదూరముండు నోగదా!

ధర్మ—అమ్మా! ఇప్పుడు మనము యమునానదియొద్దకు వచ్చినాము. ఇంక నప్పురము మనకు నైదుదినంబుల ప్రయాణముండును!

అర్జు—తల్లీ! నడువలేకుంటివి కాబోలు.

సీ॥ కుంతిభోజుని ముద్దు ♦ కొమరితై యెంతయో
ప్రేమతో నచ్చోట ♦ పెంపుఁగాంచి
శిష్టగణుండు వి-♦ చిత్రవీర్యసుతుండు
పాండుభూవల్లభు ♦ పాణిఁబట్టి
మహనీయమణిమయ ♦ మందిరంబులలోన
బరిచారికాతతి ♦ భక్తిఁ గొలువ
సకలసౌఖ్యంబుల ♦ జాలబొందుచు నొప్పి
సాధ్వియంచు ఘనయ ♦ శంబుగాంచి

తే॥ గీ॥ బలపరాక్రమవిక్రమ ♦ వంతులైన
యేవురి కుమారమణులను ♦ నిట్లుగాంచి
యొప్పుచుండియు నీరీతి ♦ నడవియందు
గష్టములనందుచుంటివి ♦ గాదె! తల్లి.

కుంతి—వత్సా! విధివ్రాత యనుల్లంఘ్యనీయముగదా!

రంగము—[పాంచాలపురంబున నుద్యానవనము:—ప్రవేశము:—
యొంటరిగా ద్రౌపది:—]

ద్రౌపది—(తనలో) అహా! ఈవార్త నిజమైయుండునా! నిశ్చయముగాఁ బాండవులు వారణాసిని కౌరవేంద్రమాయాకల్పితలాక్షాగృహదహనజ్వాలలయందు భస్మమైయుండిరా! అట్లయిన నే నింక జీవించుటయెట్లు. నన్నాయర్జునునకే యీయఁదలంచి యగ్నికుండంబునఁగాంచిన నా జనకుండింక నన్నెవ్వరికొసంగునో గదా! బాల్యంబునుండియు నాచిత్తంబును,, దృష్టులును నర్జునునిపైననే నిల్పియుంటి. అట్టియెడ నాచిత్తం బన్యులవరించుటకు సమ్మతించునా! (అర్జునుని యుద్దేశించి)

సీ॥ కుంతీకుమార! నీ ♦ కునొసంగ మాతండ్రి
యంచితంబుగ నన్నుఁ ♦ గాంచినాఁడు
వీరచరిత్ర! పృ ♦ థ్వీపయి మీరుమడిసి
రన్నవార్తలు దెలి ♦ యంగవచ్చె
ధైర్యహేమాద్రి! నే ♦ తగనిదానను నీకు
నంచును మదిలోన ♦ నెంచినావొ
శత్రుభయంకర! ♦ నతిగాఁగ నీకును
బజగనుండినదాని ♦ బాయనగునె

తే॥ గీ॥ అక్కటా! దుష్టుఁడగు కౌర ♦ వాగ్రజుండు
సృష్టిచేసిన యా మాయ ♦ గృహమునందు
సోదరులఁగూడి జననితో ♦ సాక్కినావె
ద్రౌపదినొకింతయైనను ♦ దలపకుండ.

(ఇంచుక యూరకుండి) నిశ్చయముగా నా పాండవులు లాక్షాగృహంబున దగ్ధులై యుండరా! వసుదేవ రక్షితులగు వారి నేయపా

యంబును బొందదని నాకు సంపూర్ణమైన నమ్మకము గలదు. అది యునుగాక, నేకచక్రపురంబున నేవురు బ్రాహ్మణులును నొక్క వనితయు నుండిరనియు నందొక్క బ్రాహ్మణుండు బకాసురుని వధించి యేకచక్రపురవాసులను రక్షించెననియు వినియుంటిని. ఆ యేవురును పాండవులనియు నావనిత కుంతి యనియు నాకు దోచుచున్నది. దుష్టాత్ములగు కౌరవులకు దెలియకుండ పాండవులిట్టి ప్రచ్ఛన్నవేషంబుల నుండి యుందురు. (ఇంచుక యూరకుండి) ఏమి శుభంబు గలుగునోగాని నా యెడమకన్నును నెడమ భుజంబును నదరుచున్నది.

[చెలికత్తెయగు నర్మద ప్రవేశించుచున్నది.]

నర్మ—(ద్రౌపదిని జూచి) చెలీ! ద్రౌపదీ! అది యేమి కారణము. నేడు వనంబునకు నాతో జెప్పకుండ నొంటరిగా నరుదెంచితివి.

ద్రౌప—ఏమియును లేదు.

నర్మ—ఏమియును లేకేమి. మీ జనకుండు రేపు స్వయంవర మహోత్సవ మాచరించునుగదా. నీకు ప్రాణేశ్వరుండరుదెంచునుగదా యను సంతోషంబున నన్ను మఱచియుందువు.

ద్రౌప—నర్మదా! ఎందుకే యిట్టి హాస్యంబులాడెదవు. నే నంతటి భాగ్యము నోచికొని యుంటినా!

నర్మ—ఆడుజన్మ మెత్తినతరువాత వరుడు రాకుండునా యేమి

ద్రౌప—"ఏదో బొంతకుందగిన గంత" యనునట్లు యెవ్వడో యొకడు వరుండగుటకా చూచుచుంటివి.

నర్మ—అట్లు గాక మఱి యెట్లు!

ద్రౌప—అట్లయిన నేను జీవంబులు విడువవలసినదాననే!

నర్మ—అది యేమమ్మా! అట్లు సాహసించి పలికెదవు. నీ మనస్సున నున్న విచారమెట్టిది.

మ॥ తరుణీరత్నమ! నేఁడో రేపటనో యు ♦ ద్వాహంబు గావింపఁగా
ధరణీపాలుఁడు నిశ్చయించెఁగద మో ♦ దంబార; నీవట్టిచో
బరమానందయుతోడ నుండకను భా ♦ వ్యంబౌనె యిట్లాడఁ; నీ.
కరయన్ జీవము బాయునంతపని యే ♦ లా చెప్పు బింబాధరీ.

ద్రౌప—సఖీ! సకలంబును దెలిసియుండియు నీరీతి నడిగెదవేల!

తే॥ గీ॥ ఎవ్వనికి నన్ను నీయంగ ♦ నెంచి; యగ్ని
కుండమందున నాజన ♦ కుండుగాంచె
నట్టి విక్రమోపేతుఁడౌ ♦ యర్జునుండు
సోదరులతోడ నగ్నిలో ♦ సాక్షినకట.

ఎప్పుడు నేను జన్మించితినో యప్పుడే నాచిత్తం బర్జునునకు వశమైనది. ఆతనిం దప్ప నే నన్యుల వరింపనొల్లను.

నర్మ—అమ్మా! ద్రౌపదీ! పాండవులు నిశ్చయముగా మరణించిరని నీవు చెప్పగలవా.

ద్రౌప—అదియును నేను నిర్ణయింపజాలకున్నాను. కొందరు పాండవేయులు ప్రచ్ఛన్నవేషంబులతో నేకచక్రపురంబున నున్నారని చెప్పుచున్నారు.

నర్మ—అట్లయిన యీ విచారమెందుకు. రేపు స్వయంవరంబునకు నప్పుడ వరుదెంతురు. అందర్జునుండు నిన్నుఁ గైకొనితీఱును.

ద్రౌప—

తే॥ గీ॥ ఆకసమువంకఁ జూచుచు ♦ నట్టిలచు
చాతకమునోటఁ బిడుగో వ ♦ ర్షంబొ; పడెను
భంగి; నెల్లుండి యాస్వయం ♦ వరమునందు
పాండవేయులజాడలు ♦ బయలుపడి; ము
దంబొ; చింతయో గల్గును ♦ దప్ప కతివ.

నాకు జింతయేగలిగెనేని యన్యచింతను స్వాంతమునందాల్పక ప్రాణంబులు బాసెదనని నమ్మము.

నర్మ—అవుగా! నాకర్థము తెలియలేదు. పాండవేయులు బ్రతికియుండనిచో నీవుకూడ ప్రాణంబులు బాయుదుననియా చెప్పుచుంటివి!

ద్రౌప—అదితప్ప నేనుజేయవలసిన కార్యమింకొకటిలేదు. నాజనకుండు తపంబునంజేసి నన్ను గాంచుటకా యజ్ఞముండే కారణము. కావున వివాహమాడిన నాతనినే వివాహమాడవలెను. లేదేని యనుగులవీడి మున్నుజన్మంబునందైన నాతని బతిగా బడసెదగాక!

నర్మ—చెలీ! నీమాటలు కడువిచిత్రముగనున్నవి. "తావలచినది రంభ, తామునిగినది గంగ" యను నార్యోక్తిని ధృవపఱచుచున్నావు. కానిచో,

సీ॥ పండమంచము లేదు • వసియింపగా నొక్క
మాణిక్యమందిర • మైనలేదు
కట్టవస్త్రము లేదు • పెట్టుటకొరులకు
భుజియింపవారికే • భుక్తిలేదు
యేలుటకొక్కింత • నేలయైనను లేదు
నిలచుటకెక్కడ • స్థలములేదు
యాజ్ఞించుటకుశక్తి • యంతకన్నను లేదు
నిజరూపమున నుండ • నేర్పులేదు
తే॥ గీ॥ అట్టికుంతీసుతుని వివా • హంబునాడి
సౌఖ్యముల నేమి కాంతువు • సారసాక్షి
వట్టికోర్కెయెగాని • లాభంబులేదు
నమ్మమీ నన్ను నీదగు • నెమ్మనమున.

ఆపాండవేయులు శౌర్యంబుగలవారేని కౌరవులు పురినుండి వెడలనడుపునప్పు డేల యూరకుండిరి. శక్తిలేక నేగదా!

ద్రౌప—వారి పరాక్రమంబునుగూర్చియు, వారి ధర్మవ్రతాచారంబును గూర్చియు, వారి సత్యసంధతనుగూర్చియు నీకేమియుఁ దెలియదు. తెలియనిదానవగు నీతో నేను వాదించుటవలనఁ బ్రయోజనము లేదు. ఈమహీచక్రంబునందున్న భూపాలురందఱును పాండవేయుల కాలిగోళ్ళకయినను జాలరుసుమా. వారు ధర్మపాశబద్ధులై ప్రస్తుతము కొంవుల కొదిగియుండిరి. అంతియే గాని మఱియొండుకారణం బేమియులేదు. ఇంతకును నాభాగ్యవిశేషంబున వారు బ్రతికియుండి స్వయంవరంబున కరుదెంచవలయునుగదా! అట్టిభాగ్యమును నేను నోచుకొని యుంటినో లేదో. పరమేశ్వరుండు నాపాల గలఁడో లేఁడో!

శా॥ బాలా యేలవిచారమందెదవు భూ ♦ పాలుండు వైవాహసుల్
వాలాయంబుగ నేఁడొ రేఁపొ యుచితుల్ ♦ గావింపనున్నాఁడు భూ
పాలాగ్రామణి యెవ్వఁడోయొకఁడు శుం ♦ భల్లీలనయ్యంత్రముల్
గూలంజేయును నిన్నుఁ గైకొనును నీ ♦ కోర్కెల్ గడుందీఱునన్.

ద్రౌప—చెలీ! యెవ్వఁడోయొక రాజేంద్రుం డరుదెంచి మత్స్యయంత్రమునుగొట్టినచో నేనాతనిని వివాహమాడవలసినదేనా!

నర్మ—రమణీ! నీచిత్తమెట్లుండునోయని యింతవఱకును నదియొక తీరుగ భాషించితిని. పాండవేయులు జీవించియున్నారనియు, వారెచ్చటనో ప్రచ్ఛన్నవేషంబుల జరింపుచుండిరనియు దెలిసియే యిట్టి స్వయంవరంబు జాటబంచినాడు. అభేద్యమగు నామత్స్యయంత్రము గూలనేయుట కాయర్జునుడుతప్ప నితరులెవ్వరును

శకునములుగావు. స్వయంవరంబున కాంతుఁడనుబొంది మత్స్యయం
త్రమును గూలనేసి నిన్నుఁ దప్పక గైకొనును.

ద్రౌప—సఖీ! నే నంతటి భాగ్యంబును నోఁచికొనియుంటినా!

తే॥ గీ॥ నేను వరతంబు సేవింతు • నిఖిలలోక
జనని భగవతి నాచిత్త • జలజమందు
నిలచి నాయభీష్టముదీర్ప • నలమునో న
లంపడో భాగ్యమెట్లుండునో ; పడంతి.

ఉ॥ మానవనాథులెల్లను శ • రాసని సన్నుతిఁ జేయునట్లుగా
నానరుఁడేగుదెంచి వర • యంత్రము గూలఁగనేసి నన్ను సన్
మానితరీతిఁ గైకొనక • మానఁడు నాదగు సౌఖ్యమెల్ల నా
కాననసీమఁ గాయు నవ • కౌముదికిన్ సరిగాదె కోమలీ.

నర్మ—అమ్మా! నిన్ను విచారింపవలదు. స్వయంవరసమయంబునకుఁ దప్పక యర్జునుండే తెంచును. ధైర్యచిత్తవయి యుండుము. (ఇంచుక యూరకుండి) చెలీ! అటుచూడుము. విరహిణీజనంబులను వేపుటకై మేనల్లుండగు మన్మథునకు సహాయంబొనర్పఁ జనుదెంచు వెన్నెలఁ గాయుచుండెనాయనునట్లు నెల్లెడ నల్లిబిల్లిగ నల్లుకొన్న మల్లెపందిరిలక్రిందఁ బడియున్న మల్లెమొగ్గలును, ఘుమ్ముఘుమ్మని కమ్మని తెమ్మెరలమెసంగు జాజిపువ్వంబులును, కందర్పుని హస్తంబునుండెడు బాకులో యనందగిన కేతకీపుష్పములును, డెందంబుల కానందంబుగల్పించు మందార సుమబృందంబును, సువాసనచే మిగుల నెగడు పొగడపూలును, మాధవపదారవింద పూజార్హంబులగు మాధవీచయంబును, యుల్లంబుల కుల్లాసంబును వెల్లిగొలుప నెల్లెడ నల్లుకొన్న మల్లికాదివల్లికలనుండి రాలిన పూమొత్తంబులును,

కుసుమసౌరభ్యంబున నన్నింటను మించిన సంపంగిపూవులును, హృదయాహ్లాదకరంబులగు పారిజాతములును, పూవిలుకాడు తన శరంబులకు బదులువెట్టెను నను పైన వలకరాళ్ళేయునం దగిన కదలీతరువులయందు లేతయాకులును, చిలుకముక్కులచే నొక్కఁబడి కెంపురుచులీనెడి దాడిమీఫలంబులును, మార్గాయాసజనితతృష్ణావిదారణ కారణంబులగు నారికేళంబులును, ఘూర్జరఖర్జూరపనసాది ఫలవృక్షరాజంబులును, విమల సలిలాసారంబులగు కాసారంబులును, దత్కాసారంబులచెంత మాయసన్యాసులచందంబున దొంగజపంబాచరించుచు మీనంబుల బట్టుటకై వేచియున్న బకంబులును, లేమావి చిగురుమెక్కి మత్తెక్కి కోకోరావంబులసలుపు పికంబులును, ముద్దుపలుకుల శ్రీరామ శ్రీరామ యనిపిలిచెడు శుకంబులునుగలిగి రమణీయమైయున్న యుద్యానంబునందించుక కాలము విశ్రమింతమా !

ద్రౌప—చెలీ! నేడేమియోగాని చిత్తంబున వనవిహారమున్న సంతసము జనింపకయున్నది. నీమాట నిరాకరించుచున్నందుకు నన్ను క్షమియింపుము.

నర్మ—అర్జునునిఁగూర్చి నీమనంబున బెంగజనించియున్నది. అంతకంటె మరొండుకారణ మేమియు లేదు. అవ్విషయంబున నీవు చింతింపవలదని నేను చెప్పియుంటినిగదా. తరుణీ! ఈవనంబున నొక్కింతకాలము విహరించినచో సిమందమారుతము యొడలికిసోకి సౌఖ్యముగాంచెదవు. రమ్ము.

ద్రౌప—సఖి! నన్నేలబలవంతపెట్టెదవు.

నర్మ—బలవంతముగాదు. నీవు పార్థుని దప్పక పెండ్లియాడుదువని సూచింపుచు సంతోషంబున నా నెమలిపురివిప్పి యట్లు నృత్య

ము సేయుచున్నదో చూతము. మనమావైపునకుఁబోయి పలు విధములగు పుష్పంబులు కోసికొని గృహంబున కరుగుదము. రమ్ము.

(ద్రౌపతి చేయిఁబట్టుకొని తీసికొనిపోవుచున్నది.)

ఇది చతుర్థాంకము.

సంపూర్ణము.

శ్రీ

ద్రౌపదీపరిణయము.

పంచమాంకము.

[రంగము:—ఏకచక్రపురమునందలి రాజవీధి—విష్ణుశర్మయు రామశర్మయు చెఱియొకప్రక్కనుండి ప్రవేశించుచున్నారు].

రామ—(విష్ణుశర్మనుజూచి) విష్ణుశర్మగారూ! విష్ణుశర్మగారూ! ఒక్కసారి యీలా దయచేయండీ!.

విష్ణు—(వినిపించుకొనక తొందరగా నడచును)

రామ—ఏమండీ! పిలుస్తూవుంటే పలుకరు! మీరు రాజుగారిసన్నిధిని యాస్థానపురోహితులని నాకు తెలియును. ఒకసారి నామాట వినిపోండీ!

విష్ణు—(రామశర్మనుజూచి) ఓహో రామశర్మగారా! రండిరండి. నేను తొందరపనిమీద వుండడంచేత మీమాట వినలేదు.

రామ—అవును. మీతొందరపని నాకుదెలియును. ద్రౌపదీస్వయంవరమహోత్సవకార్యమంతా మీమీదనే పాటుతుందికాబోలు. సంభావనవిషయంలో నన్ను కొంచం కనిపెట్టాలి. మనమంతా సగోత్రికులము.

విష్ణు—అయ్యో! ముఖ్యంగా మీకు సహాయంచేయడంకన్న నాకు కావలసినదేమున్నది. స్వయంవరమందిరమునకు మీరు వస్తారు కదా. అక్కడ మళ్ళీ కలుసుకొందాము. నేను తొందరగా వెళ్ళవలెను.

రాము—ఇప్పుడు మీ రెక్కడికి దయచేస్తున్నారు?

విష్ణు—మన పురమునకు నెవ్వరో యేవురు భూసురులు వచ్చియున్నారఁట. వారు వేదములు తల్లక్రిందులుగా జదువగలరఁట. వారెవ్వరో కాస్త చూచివద్దామని వెళ్ళుతున్నాను.

రామ—వారిప్పు డెక్కడవున్నారు!

విష్ణు—ఒక కుంభకారుని గృహమందు బసచేసినారఁట.

రామ—బ్రాహ్మణులు కుంభకారునియింట బసచేసినారా!

విష్ణు—మీ రల్లా ఆలోచిస్తా రెందుకు. వారు సాక్షాత్పరబ్రహ్మస్వరూపులు. అదియునుంగాక నిశ్చలచిత్తు లెక్కడనుండినను నుండగలరు.

రామ—నేనును మీ వెంట వారినిజూచుటకు రావచ్చునా.

విష్ణు—అవశ్యము.

(ఇరువురును నిష్క్రమింతురు.)

రంగము—స్వయంవరమందిరము.

[నానాదేశపురాజులును—బలరామకృష్ణులును—భూసురులును నాసీనులై యుందురు.]

[దుర్యోధనుఁడు—కర్ణుఁడు—దుశ్శాసనుఁడు—ప్రవేశించుచున్నారు.]

దుర్యో—మిత్రమా! కర్ణా! పాండవులు లాక్షాగృహంబునబడి మ్రగ్గిరని మనము దలఁచుచుండఁగా వారెచ్చటనో ప్రచ్ఛన్నవేషంబులఁబూని చరించుచున్నారని యందరును జెప్పుకొనుచుండిరి. ఇది యేమైయుండవచ్చును.

కర్ణ—(తనలో) వాసుదేవరక్షితులయిన పాండునందనుల కెప్పటికిని నెట్టిహానియు సంభవింపదని నేను మున్నే యనుకొంటిని. (ప్రకాశముగా) రాజాగ్రణీ! ఒకవేళ వారు బ్రతికియుండిరని యే యూహింతము. దానివలన నీ కేమి హానికలుగును!

దుర్యో—ఒకవేళ మా తండ్రిగారు వారలను మరల బిలచి ధర్మజునకు రాజ్యాభిషేకంబు సేయునేమోయని సంశయించుచున్నాఁడ.

దుశ్శా—అట్లయిన మఱల నేదియో యొక నెపముగల్పించి పురి వెడల నడిపింప జేయలేకపోవుదమా!

కర్ణు—ఆప్రశంసయంతయు నిప్పుడేల. ఇప్పుడు మనమువచ్చిన కార్యమునందు వర్తింతము.

దుర్యో—కర్ణా! సకలరాజచంద్రులును స్వయంవరభవనా బలంకరించినారు. అదిగో మత్స్యయంత్రముకూడ నక్కడ నమర్చబడియున్నది. ఆహా! ఈ యంత్రముఁగొట్టినవారికేగదా కన్యక నొసంగుదురు!

దుశ్శా—అన్నయ్యా! అదినీకుఁ దృణప్రాయమేయని నే నూహించెదను. ఆ ద్రౌపదీదేవి తప్పక నాకు వదినెగాఁగునని శుభసూచకంబగుచున్నది.

దుర్యో—తమ్ముఁడా! నే నంతటిభాగ్యంబును నోచికొంటినా?

మ॥ ధరణీపాల కులావతంసులు సము • ద్యత్ప్రీతి నింబొంద దు
స్తరబాహాబలశౌర్య విక్రమమునన్ • క్ష్మామండలంబందు న
శ్వరయంత్రంబును గూల్చియాద్రుపద భూ • పాలాగ్రణీపుత్రి స
త్కారముగా బట్టగ నోచినానొ యటుగా • కన్ బ్రాప్తి యెట్లున్నదో.

కర్ణు—కౌరవేశ్వరా! నీవు దీనివిషయమై సందియంబంద నవసరము లేదు. ఆ యంత్రము గొట్టుటకుఁ గృష్ణుండు సమర్థుఁడయ్యును దీని తెలియునకు రాడు. పాండవులుండిరేని యందర్జునుండు గూలచేయును. వారిజాడ యింతవరకును గానరాకున్నదిగదా. తక్కినరాజ లోకంబున నెవ్వరును దీని గదల్పఁజాలరు. నీవే

సమర్థుండవు. నీవు తప్పక దీనిం గొట్టి పాంచాలరాజసుతను వివాహ మాడఁగలవు. అట్లుగాదేని,

తే॥ గీ॥ ఘోరసమరంబునందున ♦ వీరినెల్ల
నోర్చి; రాక్షసవిధిని య ♦ య్యువిదఁదెచ్చి
నీకు నర్పించువాఁడను ♦ నిక్కముగను
నమ్ము మీ వన్నఁ గౌరవ ♦ నాథ వంద్ర

దుశ్శా—కర్ణుఁడు దలంచెనేని యంతపనియుఁ జేయుఁగలుగును.

దుర్యో—అందుకు సందియ మేమున్నది. రండు. మన మాసనంబుల నధిష్ఠింతము.

(ఆసీనులగుచున్నారు.)

[ద్రుపదుఁడు—ధృష్టద్యుమ్నుఁడు—పురోహితుఁడగు విష్ణుశర్మయుఁ బ్రవేశించుచున్నారు.]

ద్రుప—(విష్ణుశర్మనుజూచి) భూసురవర్యా! నీమాటలను నేను నమ్మ వచ్చునా! నే నంతటిభాగ్యమును నోచికొనియుంటినా!

విష్ణు—మహారాజా! మీరు నామాటలను నమ్మవచ్చుటయేగాక, యట్టిభాగ్యమును మీ రిప్పుడే నోచనై యున్నారు.

ధృష్ట—తపోధనులగు భూసురుల వాక్యంబులు రిత్తవోవునా!

ద్రుప—బ్రాహ్మణోత్తమా! కుంభకారుని గృహమం దెవ్వరో యేవురు భూసురులు విడిసియుండిరని చెప్పితివి. వారును నిప్పటి స్వయం వరమందిరంబున కరుదెంచిరా!

విష్ణు—అరుదెంచియున్నారు.

ద్రుప—అట్లయిన నింక నాలస్య మెందుకు. స్వయంవరవేళ గూడనా సన్నమగుచున్నది. మన మరిగి, మహోత్సవార్థమై యరు దెంచిన రాజులనందఱను యథోచితంబుగ గౌరవింపవలయును. గదా! (ఇంచుక నడచి తమతమ యాసనంబుల నధిష్ఠింతురు)

ద్రుప—(రాజులనందఱిని జూచి) ఓ రాజపుంగవులారా !

ఉ॥ పావనమయ్యె నాకులము • పండెమదీయ తపఃఫలంబు ; మో
దావహమయ్యె జన్మము ; సు • తామణి ద్రౌపది పెండ్లి నేఁ ; డు
శ్రీవిలసిల్ల మీరలిట • జేరుట ; శౌర్యసమిద్ధులార ; ధా
త్రీవిభులార ! సంతత సు • ధీరగుణాకరులార ! యిమ్యోడన్.

మ॥ ధరణీపాల కులావతంసులు సము • ద్యత్కీర్తివిస్ఫారము
స్తరబాహాబల విక్రమాఢ్యులిటుల • న్సత్కృతి, న్నాసత్స్వయం
వరకార్యార్థము నేగుదెంచుటమదిన్ • భావించివీక్షింప న
ద్దిర మందాకిని చోటినేలవయి న • ర్థింబాతెనట్లేగదా.

రాజన్యచూడామణులారా ! ఈస్వయంవరసమయంబున మిమ్ములనందఱ నొక్కచోట చూచుటకే రెండుకన్నులును గడు పుణ్యము జేసికొనియున్నవి.

దుర్యో—

తే॥ గీ॥ భవ్యభవదీయసద్గుణ • భావమొకటి
కన్యకామణిసౌందర్య • గరిమ; రెండు
దివ్యయంత్రముగూల్పగా • దీక్ష మూడు
మమ్మునీడకుదెప్పించె • మానవేంద్ర.

ద్రుప—(కృష్ణునిజూచి) కృష్ణా! వసుదేవనందనా ! బలరామసహితుండవైన నీరాక మాకెంతయు శుభప్రదంబని నే నూహించుచున్నాను. నీవు లీలామానుషవిగ్రహుండవగు భగవంతుండవుగాని సామాన్యమర్త్యుండవుగావు.

తే॥ గీ॥ ఏదలంచినరీతిగా • నీస్వయంవ
రంబు బాగుగాజరుగు తె • ఱంగుజూచు
నీవు చేయంగలేనిది • యేదికలదు
భక్తరక్షణపారీణ • వాసుదేవ.

కృష్ణ—

ఉ॥ నీవు మహానుభావుఁడవు ♦ నిర్మలధర్మవివేకశీల స
ద్భావముసీదుసొమ్ము; వని ♦ తానుణి ద్రౌపది గోరుకొన్న యా
భూవరమాళి యెుఖ్పుడు ♦ పొందుగ మంత్రము గూల్చునీదు స
ద్భావమునందుమున్న పరి ♦ తాపముదీఱఁగ రాజపుంగవా.

ద్రుప—(తనలో) ఈమహాత్మునివాక్యంబు లమోఘంబులు.

దుర్యో—(కర్ణునితో రహస్యముగా) కర్ణా! ఈమెమనంబునం దెవ్వరిని వరించుటకు సంకల్పించుకొన్నదోగదా.

కర్ణ—సంకల్పించుకొన్నంతమాత్రంబునఁ బ్రయోజనమేమియున్నది. ఆతఁడు మత్స్యయంత్రమును గూలనేయువలయునుగదా. ఆయంత్రముగొట్టుటకు నీకుదప్ప నితరులకు శక్తి చాలదు. మఱియు నకళంక, సుందరవిగ్రహుండవును, సప్తద్వీపసముద్రముద్రిత మహీవలయంబు నేకఛత్రంబుగఁ బరిపాలించువాడవును, నఖండైశ్వర్యవంతుడవును, నింద్రభోగంబుల నందుచున్నవాడవును, నూర్వురతోబుట్టువుల కగ్రజుండవును, వైరివీర దర్పాంధకార ప్రభాకరుండవును నగు నిన్నుదప్ప యింకొకరిని వరించునా!

దుర్యో—(తనలో) భగవంతుండు నాపక్షంబున నుండునో లేదో. (ద్రుపదునిజూచి) ద్రుపదభూవరా! స్వయంవరవేళయా సన్నిహితమగుచున్నది.

ద్రుప—(ధృష్టద్యుమ్నుని జూచి) కుమారా! ధృష్టద్యుమ్నా! నీవరిగి ద్రౌపదిని సమస్తాలంకృతగాఁ జేసి సత్వరమ్ముగ దోడితెమ్మని యంతఃపుర పరిచారికల కాజ్ఞాపింపుము.

ధృష్ట—ఇదే తోడ్కొనివచ్చెద. (నిష్క్రమించును.)

ధర్మరాజు—(తమ్ములనుజూచి రహస్యముగా) తమ్ములారా! నిరంతర

మును మనల గాపాడుచున్న వాసుదేవుండుగూడ బలరామ
సహితుండై యరుదెంచియున్నాఁడు.

అర్జు—మనకు బాంధవుండును, సఖుండును, రక్షకుండునైన వాసు
దేవుం డెదుటనుండినను, యాతనితో మాటలాడకుండ నుండ
వలసివచ్చెనుగదా.

భీమ—మనకిన్ని కష్టంబులగల్పించిన కురుకులపాంసనుండగు దుర్యోధ
నుండు వచ్చియున్నాడు. అగ్రజా! ధర్మనందనా!

మ॥ కలరిచ్చోటను సోదరోన్నృపమణుల్ ♦ గంజాక్షుడుంగూడ నా
బలరామాఖ్యునితోడవచ్చి నిలచెన్ ♦ భవ్యాత్ములైనట్టి వీ
రలసాన్నిధ్యమునందు; ద్రుంచెదను గౌ ♦ రవ్యాగ్రణిన్ దుష్టు; ని
స్తుల కారుణ్యవిహీను; దుర్మదుని మ ♦ ద్దోర్దండ దర్పంబునన్.

ధర్మ—తమ్ముఁడా ! ఇప్పుడు మన మెట్టివేషంబులనుంటిమి. ఇట్టి సాహ
సము బూననెంచుటయేమి.

అర్జు—అన్నయ్యా! వాయునందనా ! ఈ మత్స్యయంత్రము గూల్చు
టకు నాకుఁదప్ప నితరులకు శక్తి చాలదు. బలరామకృష్ణులు
సమర్థులయ్యు దీనితెరువునకు రారు. ఇయ్యది నేనుగూల్చి
నప్పుడిచ్చట కలహంబు ప్రాప్తించితీఱును. అప్పుడు కౌరవ
రాజుపైనున్న నీపగఁ దీర్చుకొనవచ్చును. (ఎదుటఁజూచి) అదు
గో! ధృష్టద్యుమ్నుండు చేటీపరివృతయగు ద్రౌపదిని దోడ్కొని
వచ్చుచున్నాఁడు. (తనలో) ఆహా! యేమి! ఈమెసౌందర్యము.

తే॥ గీ॥ సర్వలావణ్యసారముల్ ♦ నంతరించి
ముద్దగాఁజేసియొకచోట ♦ భూమిపైన
యువిదద్రౌపది సృష్టించి ♦ యుండనోపు
నలుమొగంబులవేల్పని ♦ తలఁచువాఁడ.

అట్లుగాదేని;

మ॥ ఘననిర్మాణవిచిత్రమెల్ల దెలుపం ♦ గా; ధాత యేయేవిధం
బున బ్రహ్మాండసృజించినా డికను సం ♦ పూర్ణంబుగా! వానినే
ర్పనుమింపన్ సతినిక్కదాసిగనె ♦ బుట్టింతునంచున్ రమా
తనయుండీమెయి జేసినాడనుచు మ ♦ ద్భావంబునం దెంచెదన్.

ఓ యువతీలలామా! ఏకచక్రపురంబున మీ పురోహితుండైన విష్ణుశర్మయొద్ద నీచిత్రపటము చూచినప్పుడే నేను దాసుండనయితిని. ఇప్పుడు నీ నిజరూపసందర్శనంబున నేనే నీకు వశుండనైతిని.

దుర్యో—(దుశ్శాసనునిఁజూచి) అదిగో ద్రౌపది పుష్పదామము చేత బట్టుకొని యామత్స్యయంత్రమును గొట్టినవారికంఠంబు నలంకరించుటకు వచ్చుచున్నది.

[ధృష్టద్యుమ్నుఁడు—నర్మదాసమేతయగు ద్రౌపదితో ప్రవేశించును.]

ద్రుప—(ద్రౌపదినిఁజూచి) కుమారీ! ద్రౌపదీ! ఇటురమ్మా. భవదీయ స్వయంవరార్థ మీరాజపుంగవులందఱును విచ్చేసియున్నవారు. (కుమారునిఁజూచి) కుమారా! ఈవచ్చినరాజులనందరిని వేర్వేఱుగా నమ్మాయికి వినిపింపుము.

ధృష్ట—(ద్రౌపది చేయిబట్టుకొని) సోదరీ! ఇటురమ్మా అదిగోచూడుము. ఆ మొదటఁగూర్చున్నవాఁడు హస్తినాపురాధీశ్వరుండును, నధికైశ్వర్యసంపన్నుఁడును నగు దుర్యోధనుండు. ఆతని ప్రక్కనున్నవాఁ డతనికిఁ బ్రాణసఖుండైన కర్ణుండు. ఆతనిచుట్టును బరివేష్టించియున్నవా రందఱును నతనితమ్ములయిన దుశ్శాసనాదులు.

ద్రౌప—(తనలో) వీనిముఖంబుఁజూచినఁ బంచమహాపాతకంబులు గలుగును. వీఁడేగదా పాండవులను పురినుండి వెడలనడిపినాఁడు.

ధృష్ట — అమ్మాయీ! సోమదత్త భూరిశ్రవశ్శ్రుతసేనాదులు మువ్వరును వరుసగానున్నారు. అదిగో నా చేతికెదురుగా నాసీనుండై యున్నవాడు మత్స్యదేశాధీశ్వరుండైన విరటుండు. అతఁడు భుజవీర్యసింధుండైన జరాసంధుండు. ఆప్రక్కను మొదట నాసీనుఁడై యున్నవాడు యదుకులపుంగవుండైన శ్రీకృష్ణుండు. ఆతనిప్రక్కనున్నవాఁ డతని కగ్రజుండగు బలరాముండు. వీరిరువురును భగవదాంశ సంభూతులు. ఆతనిని బరివేష్టించినవారందరును యదువృష్ణిభోజాంధక ప్రముఖులు. అదిగో చేకితాన శిశుపాల పౌండ్రకవాసుదేవులచ్చట నున్నవారు. ఆప్రక్కనున్నదియంతయు భూసురబృందము. ఇందులో నెవ్వరు మత్స్యయంత్రమును గొట్టుదురో వారిగళంబును నీవు పూలహారంబుతో నలంకరింపుము. ఆతఁడే నీకు నాథుఁడగును.

విష్ణుశర్మ — స్వయంవరకాలమా సన్నమగుచున్నది. రాజులందరును నీమత్స్యయంత్రమును గొట్టుట కుపక్రమింపవచ్చును.

ధృష్ట —

తే॥ గీ॥ ఎవరు మోపెట్టి యీవిల్లు • నేను బాణ
ములను మత్స్యంబుగూల్తురో • భుజబలమున
వారి వరియించు ద్రౌపదీ • వారిజాక్షి
గాన యత్నింపుఁ డందుకు • ధన్వులార.

విష్ణు — ఓ రాజన్యచూడామణులారా! ఎవ్వరీవిల్లును మోపెట్టి యంత్రమధ్యముననున్న మత్స్యంబును నైదుశరంబులచే గూల్తురో వారినే మా రాజపుత్రిక వరించును. కల్యాణమునకును, భుజబలంబును, బాణలక్ష్యంబును పలువురిసముఖంబున గనబఱచి యశంబందుటకును నిదియే మంచిసమయము కావున మీమీ బలాబలంబుల జూచుకొనుఁడు.

బల—(కృష్ణునిఁజూచి) తమ్ముఁడా! యిందుకు నీవేమయినఁ బ్రయత్నింపఁ దలంచితివా !

కృష్ణు—నేనేకాదు; మనవారిలో నెవ్వరినిగూడ నిందులకు యత్నింపవలదని చెప్పితిని.

బల—తమ్ముఁడా! అందులకు గారణం బెఱుంగవచ్చునా !

కృష్ణు—ఆసంగతి యింకనిప్పుడు బయలుపడఁబడవచ్చును. ఈమత్స్యయంత్రముఁగొట్టుటకా రాజలోకంబున నెవ్వరును శక్తులుగారు. యర్జునుండొక్కఁడే దీనిని గొట్టఁగల సమర్థుండు.

బల—ఆయర్జునుండిప్పు డెట్లువచ్చును. పాండవులందఱును లాక్షాగృహంబున దగ్ధులైరని వింటిమిగదా.

కృష్ణు—అన్నయ్యా! వారట్టియాపదకు బాలుపడుదురా !

బల—తమ్ముఁడా వారు సుఖులై యుండిరా! అట్లయిన వారిక్షేమంబు వినుటకు నాచిత్తంబు తత్తరమందుచున్నది.

కృష్ణు—అట్లయిన నరుగో చూడుము. పాండవులేవురును భూసురవేషములతో నచ్చట నున్నవారు. అందు పార్థుండే యీ మత్స్యయంత్రమును గొట్టును.

బల—తమ్ముఁడా ! నేఁడెంతయు సుదినము.

[అంత కొందఱు రాజులు మత్స్యయంత్రమును గొట్టుటకు బ్రయత్నించి విఫలమనోరథులగుచున్నారు.]

దుర్యో—(కర్ణునిఁజూచి) మిత్రమా ! కర్ణా ! వీరెవ్వరును నీయంత్రమును గొట్టఁజాలకపోయిరే. ఇంక నేను బ్రయత్నించెదను. (అని లేచి రెండడుగులువేసి) అహా! ఏమిది! మత్స్యయంత్రంబునుగొట్టి ద్రౌపదిని గైకొనఁదలంచుచున్న నాచిత్తంబున నస్థైర్యము జనించుచున్నది. దేహము కంపమెత్తుచున్నది. యం

త్రింబు సమీపించుటకే భయమగుచున్నది. కానిమ్ము. భగవంతుఁ డెట్లుసేయుచున్నాఁడో. (మత్స్యయంత్రము సమీపించి దానిని గొట్టలేక చతికిలఁబడుచున్నాఁడు.)

(అందరును చప్పట్లుగొట్టుదురు.)

విష్ణు—(మర్కొనాథునిజూచి) ఓరాజా! నీవు చాలా శ్రమపడ్డావయ్యా! కాశీలో లక్కయిల్లు కట్టించదలచుకొన్నావుకాబోలు.

ద్రౌప—(తనలో) ఈరాజేంద్రునకు దగిన పరాభవమైనది. (యించుక యూరకుండి) అక్కటా! నాహృదయంబు నపహరించిన పార్థుండిందెందును గానిపింపఁడే. ఈపురోహితుండగు విష్ణుశర్మ పాండవులు బ్రాహ్మణవేషంబులనుండి యుందురనియు, వారు స్వయంవరంబునకు దప్పక యరుదెంతురనియు జెప్పినాఁడు. అయ్యో! నేనింక జీవించుటయెట్లు.

అర్జు—(ధర్మరాజునుఁజూచి) అగ్రజా! ఇయ్యంత్రము గూలసేయుటకు నేను బ్రయత్నింతువెద.

ధర్మ—తమ్ముఁడా! కానిమ్ము.

అర్జునుడు—(లేచి మత్స్యయంత్రమును సమీపించుచున్నాఁడు.)

ద్రౌప—(తనలో) ఈభూసురుం డెవ్వడో కడుధైర్యంబున యంత్రమును గొట్టుటకుకాబోలు దీసని సమీపించినాఁడు.

గోవిందశాస్త్రి—(రామశర్మనుజూచి) రామశర్మగారూ! చూచినారా! ఈబ్రాహ్మణుని సాహసము. ఇంతమందిరాజులు కొట్టజాలని నీయంత్రమును నీతడు సమీపించుచున్నాఁడు. ఏదోమోస్తరుగా వైదికవృత్తినలనబ్రతికే మనకింతపని చేయదలంచుట యేమిటండీ!

రామశర్మ—శాస్త్రిగారూ! మన మల్లాగ అ. ధ్యానిక్షి వలనుపడదు. వ

పుట్టలో యేపామున్నదో. పరశురాముండు మనవాఁడేగదా. ఆతఁ డెట్టిపనులుజేసినాఁడు. మీరు నూట్లాడక చూస్తూ వుండండి.

అర్జు—(విలును నెత్తును.)

రాము—గోవిందశాస్త్రిగారూ! చూచినారా! ఏరాజేంద్రుఁడును నెత్త జాలనివిల్లు నీత డవలీలగా నెత్తినాఁడు. ఈతఁడీమత్స్యయంత్రము నుగూడఁ గూల్చును. ఓబ్రాహ్మణోత్తమా! మత్స్యయంత్రము నుగూల్చి జాతికి గీర్తి దెమ్ము.

దుర్యో—(కర్ణునిజూచి) మిత్రమా! ఈపాఱు డెవ్వఁడోగాని యశ్రమముగా విల్లునెత్తి నారి నాకర్షించినాఁడు.

కర్ణు—నేనును నదియే యాలోచింపుచున్నాను. అదిగో ఆతఁడు గొట్టుటకు బ్రయత్నము నేయుచున్నాఁడు.

అర్జు—(విల్లును బట్టుకొని తనలో)

తే॥ గీ॥ సద్గుణుండగ్రజుఁడు సత్య • సంధుఁడేని
తల్లిసాధ్వీమణియగుచు • దనరనేని
శాంతిఁ బెంజ్లాడుభాగ్యంబు • గలిగనేని
నేలపై యంత్రమత్స్యంబు • గూలుగాక.
[యంత్రమును గొట్టుచున్నాఁడు.]

రాము—ఎల్లాగయినా బ్రాహ్మణతేజం బధికమయినదిగదా.

ద్రౌప—(అర్జునుని కంఠమునఁ బుష్పహారము వేయును)

ద్రుప—(రాజులందఱినిఁ జూచి) క్షమావల్లభులారా! ప్రతిన ననుసరించి మీరందఱును జూచుచుండగా గగనమత్స్యయంత్రంబును భూసురుండు గొట్టినాఁడు. కావున మీరందఱును నాయెడ ననుగ్రహించి వివాహామహోత్సవమగునట్లు యోచింపుడు.

దుర్యో—(కర్ణునిజూచి) కర్ణా! చూచితివా! ఈద్రుపదుఁడు మనల నెట్లుపరాభవించినాఁడో! ఇప్పుడు వీనిని వదలకూడదు. (ద్రుపదునితో) ద్రుపదమహీధవా! స్వయంవరార్థమై మమ్ముఁబిలిచి యీరీతిఁ బరాభవింతువా! ఇంతమంది వీరులగు నారాజులనేకులుండఁగాఁ నెవ్వఁడో యొక్కభూసురుండు మత్స్యయంత్రము గూల్చినంతమాత్రముననే కన్యక నీతనికొసంగెదవా! (ఇంచుక యూరకుండి) అయినను నిన్ననవలసిన పనియేమున్నది. ఇంతమంది నృపాలురను తృణీకరింపుచు నిట్టి యకార్యము జేసినందు కీభూసురు ననవలెను. (అర్జునునిఁజూచి) ఓయీ! భూసురా! గర్వాంధకారప్రమత్తహృదయా!

మ॥ ధరణీపాలురు పెక్కుమంది ముదిత • త్సాహంబులంబూని యీ
సరసీజాక్షిని పెండ్లియాడుటకునై • జన్దంచియుండంగ; నీ
కరణిన్ వారికి సిగ్గుగొల్పుటకునై • గాంక్షించి యంత్రంబునున్
ధరణిన్ గూల్చితివె కన్నియన్ గొనఁగ; నీ • దర్పంబు జూపింపుమా.

అర్జు—రాజా! మదోన్మత్తుండవై వీరాలాపంబు లాడకుము.

తే॥ గీ॥ భుజబలంబునుజూపించి • భూమిపైన
యంత్రమునుగూల్చినారలే • యతివఁగొనఁగ
నర్హులంచు ననుటచే • యంత్రమిపుడు
శౌర్యమునఁ గూల్చగల్గితి • క్ష్మాతలేంద్ర.

శౌర్యపరాక్రమంబులును భుజబలంబును జూపుటకు కులము తోఁబనిలేదు. నాభుజదర్పంబు జూచుటకు నీవెంతవాఁడవు. యంత్రము గొట్టితిని. కన్యను గైకొందును. ఇందులకెవ్వరైన నడ్డంబరుదెంచిరేని వారిశిరంబులు వ్రీల్లనేయుదును.

భీము—(సభనుండిలేచి) ఓరీ! కౌరవవంశపాంసనా!

ఉ॥ ఏమిర పేరిలువుంటివి యు ◆ హీనబలాఢ్యుడితండు యంత్రముం
గూలగ నేసెనీసభను ◆ గోమలిగ్గ కొను సింకనట్టివో
నీమదియందునోర్వకను ◆ నిట్టివిధంబున బల్కెదేల; ర
మ్మానిము నందఱ[illegible] దృఢిని ◆ మారణజేతు భుజాబలంబునన్.

(అని యుద్ధమునకు మొనయుచున్నాడు)

కర్ణు——(అర్జునునిజూచి) రణంబనగా సంభాషణలకును, సంతర్పణలకును నరుగుటయని తలంచినావు బ్రాహ్మణోలు? రమ్ము. నీసత్వంబు దూలించెదను.

రామశర్మ——(భూసురులారా) మన బ్రాహ్మణుడు మత్స్యయంత్రము గూల్చినాడని కోపంబున గయ్యంబునకు గాలుదువ్వుచున్నారు. వీరపురుషులయిన యీ బ్రాహ్మణులకు మనము సాయము సేయువలెను. ఆలోచించకండి. లెండి. జారీచెంబులు అంగవస్త్రంబులకు ముడివేసి గిరగిరత్రిప్పడం తలలు చెక్కలయ్యేటట్లు కొట్టడం ప్రారంభించండి. లెండి లెండి.

అర్జు——ఓయీ! కర్ణా! మాటలతో నేమిపనియున్నది. ఇంచుక నిలిచి యుద్ధముజేసినచో నాశౌర్యంబు జూడగలవు.

భీము——ఓరీ! దుర్యోధనా! మాభుజబలంబును దృణీకరించిన నీవెందు బోవెదవు. రమ్ము.

(కర్ణుడు అర్జునునితోడను దుర్యోధనుడు భీమునితోడను యుద్ధముజేసి పాఱిపోవుచున్నారు.)

ద్రుప——(కృష్ణునిజూచి) కృష్ణా! నాకిదియంతయు మిగుల చోద్యముగానున్నది. ఈయంత్రప నుగొట్టిన యీభూసురుం డెవ్వరు. [illegible]ధనకర్ణాది రాజబృందంబును రణంబున బాఱద్రోలిన వీ

పరాక్రమంబు వర్ణనాతీతంబుగనున్నది. మహాత్మా! కరుణాంత రంగుండవై నా సందేహంబును బాపుము.

కృష్ణు—ద్రుపదమహీధవా! ఇంక నీయొద్ద నేమియు దాచఁబనిలేదు.

ఉ॥ ఎవ్వనికీయఁగాఁదలఁచి • యెంతయుఁ గోరిక, నగ్నికుండమం
దివ్వనజాక్షిఁగంటివో మ • హీశ్వరులందున శస్త్రవిద్యయం
దెవ్వఁడు మేటిగాఁ బఱఁగె • నెవ్వఁడు లోకము బాసిపోయె నం
చవ్విధిచింతనొందితివో • యట్టినరుండితఁడే మహీధవా.

ద్రుప—కృష్ణా! ఏమి నాభాగ్యము ఈతఁడే యర్జునుఁడా. (అర్జునునిఁ జూచి) అర్జునా! ఒక్కసారి కౌఁగలించుకోనిమ్ము. (కౌఁగలించుకొని) కృష్ణా! తక్కినవారందఱును నెచ్చట నున్నవారు?

కృష్ణు—దుర్యోధనునితో బోరాడిన యతండు భీముండు. ధర్మనకుల సహదేవులు గృహంబున కరిగినారు. కుంతియు నచ్చటనున్నది.

ద్రుప—ధృష్టద్యుమ్నా! నీవు పసిడిరథంబులను దీసికొనిపోయి వారి నందఱను మన మందిరమునకు దోడ్కొనిరమ్ము.

ధృష్ట—మంచిది. (నిష్క్రమించును.)

ద్రౌప—(తనలో) ఇప్పుడుగదా నాకు యానందముగలిగినది.

ద్రుప—అమ్మాయీ! నీవుకోరిన యర్జునుండు వచ్చినాడు. (కృష్ణుని జూచి) కృష్ణా! ఇంక వీరలకు వివాహంబు జరిగింపవలయునుగదా.

కృష్ణు—రాజా! వ్యాసుం డిచ్చట కరుదెంచును. ఆతని యనుమతంబున మనము జేయుదము. నీయభీష్టము నెఱవేరినది. ఇంక నీకు గావలసిన దేమున్నది!

ద్రుప—దేవా! నాకు గావలసిన దింకేమున్నది. అయినను నిట్లుగాక!

మంగళమహాశ్రీ.

భూతలమునఁ బ్రజలు ♦ భూరిసుఖముల్ గనుచుఁ
బుణ్యమతులై వెలయుగాతఁ
నీతముగవర్షములు ♦ నేలబడగానెపుడు
నిండుఫలమీయుత పొలంబుల్
ఖ్యాతిగనురాజునెడ ♦ గాంచుతజనంబులతి
గౌరవముభక్తి ననిశంబుఁ
నేతయుసుధర్మగతి ♦ నిఁదొలగకఁబుడమి
నిఁసతతమేలు ననురక్తిఁ.

ఇది పంచమాంకము సర్వేమును

